RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



08 జూన్ 2025 ఆదివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:8

## మహారాష్ట్ర తరహాలో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ రిగ్గింగ్

### కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణ



న్యూఢిల్లీ జూన్ 7 గత ఏడాది నవంబర్‌లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగినట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అదే తరహాలో ఈ ఏడాది బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ రిగ్గింగ్ జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో రాహుల్ ఇవాళ ఓ పోస్టు పెట్టారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల రిగ్గింగ్‌పై రాహుల్ రాసిన కథనాన్ని ఓ పత్రికలో పోస్టు చేశారు. ఆ పత్రిక రిపోర్టును ఆయన తన ఎక్స్‌లో పోస్టు చేశారు. రిగ్గింగ్ ప్రజాస్వామ్యానికి 2024 మహారాష్ట్ర ఎన్నికలు బ్లూప్రింట్ అని, ఆ రిగ్గింగ్ ఎలా జరిగిందో ఈ ఆర్టికల్‌లో తెలుస్తుందని రాహుల్ వెల్లడించారు.అయిదు దశల్లో రిగ్గింగ్ జరుగుతుందని తన కథనంలో రాహుల్ తెలిపారు. తొలి దశలో ఎన్నికల సంఘంలో రిగ్గింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఎలక్టోరల్ రోల్‌కు నకిలీ ఓటర్లను జోడిస్తారన్నారు. ఆ తర్వాత బోగస్ ఓట్ల ఆధారంగా బీజేపీ గెలుస్తుందన్నారు. ఆధారాలను దాచిపెడుతారని చెప్పారు. రిగ్గింగ్‌ను మ్యాచ్ ఫిక్సింగ్‌తో పోల్చారు. చీటింగ్ చేసిన పార్టీ గెలుస్తుందని, కానీ దాని వల్ల వ్యవస్థలన్నీ నష్టపోతాయన్నారు. ప్రజల్లో విశ్వాసం నాశనం అవుతుందన్నారు. మహారాష్ట్రలో జరిగిన మ్యాచ్ ఫిక్సింగ్ .. త్వరలో బీహార్ ఎన్నికల్లో జరుగ బోతోందన్నారు. మ్యాచ్ ఫిక్స్ ఎన్నికలు ఏ ప్రజాస్వామ్య దేశానికైనా విషం లాంటిందన్నారు.288 స్థానాలు ఉన్న మహారాష్ట్ర అసెంబ్లీలో.. బీజేపీ 132, శివసేన షిండే 57, ఎసీపీ 41, కాంగ్రెస్ 16, శివసేన ఉద్దవ్ 20, ఎన్సీపీ శరద్ పవార్ ఫ్యాక్షన్‌కు 10 సీట్లు దక్కాయి. అత్యధిక సీట్లు బీజేపీకి దక్కాయి. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ఎన్నికల సంఘాన్ని అవమానిస్తున్నట్లుగా ఉన్నాయని బీజేపీ ఆరోపించింది.

## ఛత్తీస్‌గఢ్ ఎన్ కౌంటర్ లో ఐదుగురు మావోయిస్టులు మృతి





ఛత్తీస్‌గఢ్ జూన్ 7 బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. గత 3 రోజులుగా నేషనల్ పార్క్‌లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భీకర ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఇప్పటికే మావోయిస్టు కేంద్ర కమిటీతో పాటు తెలంగాణ రాష్ట్ర కీలక సభ్యుడు మృతి చెందినట్లు తెలుస్తోంది. తాజాగా మరో ఐదుగురు మావోలను భద్రతా బలగాలు హతమార్చాయి. ఘటనాస్థలం నుంచి మృతదేహాలను, ఆయుధాలను బలగాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

## కాళేశ్వరం కొట్టిన దెబ్బ.. ఆనాటి కథలు..

### ఈటలపై తుమ్మల ఫైర్



బీజేపీ నేత, హైదరాబాద్-మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యలను తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తప్పుబట్టారు. కాళేశ్వరం కమిషన్‌కు ఈటల అసత్యాల వాంగ్మూలం ఇచ్చారని మంత్రి తుమ్మల ఆగ్రహించారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఈటల పొంతనలేని సమాధానం ఇచ్చారని, ఆయన చెప్పిన సబ్ కమిటీ.. కాళేశ్వరం కోసం వేసింది కాదన్నారు. కాళేశ్వరానికి శాంక్షన్ ఇచ్చిన తర్వాత పెండింగ్ ప్రాజెక్టుల కోసం వేసిన సబ్ కమిటీ అదని తుమ్మల క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ప్రాణహిత, దేవాదుల, కాంతలపల్లి, తుపాకులగూడెం పనుల కోసం సబ్ కమిటీ వేశారని బీఆర్ఎస్ పాలనా సమయంలో జరిగిన విషయాల్ని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. ఆ సబ్ కమిటీ కాళేశ్వరం బ్యారేజీలపై ఎలాంటి నివేదిక ఇవ్వలేదని.. కాళేశ్వరం నిర్మాణానికి సబ్ కమిటీ ఆమోదం తెలిపిందనడం అబద్ధమని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేబినెట్ ఆమోదం పొందలేదని మంత్రి తుమ్మల తేల్చిచెప్పారు.

'కాళేశ్వరం ఎప్పుడూ కేబినెట్ ముందుకు రాలేదు. పరిపాలన అనుమతులతోనే కాళేశ్వరం అమలులోకి వచ్చింది. ఈటెల రాజేందర్ ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చారు. కమిషన్ ముందు ఈటలకు అబద్ధాలు ఆడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది. ఈటల పట్ల గౌరవం ఉంది, కానీ ఆయన ప్రకటన చూసిన తర్వాత కొంత బాధేసింది. నేను స్వయంగా కమిషన్‌కు సబ్ కమిటీ రిపోర్ట్‌ను ఇవ్వాలని అనుకుంటున్నా. కమిషన్ వివాదంలోకి నన్ను ఎందుకు లాగాల్సి వచ్చిందో ఈటలే సమాధానం చెప్పాలి. తుమ్మల కూడా కాళేశ్వరం కోసం సబ్ కమిటీ రిపోర్ట్ పై సంతకం చేశారని ఇచ్చిన వాగ్మూలం బాధాకరం. కాళేశ్వరం అంశం కేబినెట్ ఉమ్మడి నిర్ణయమని చెప్పడం సరికాదు. హరీష్ రావు అబద్దాల హరీష్ రావుగా మారిపోయారని' మంత్రి తుమ్మల అన్నారు.

కాళేశ్వరం కేబినెట్ ముందుకు వచ్చినట్లు రుజువు చూపించాలని ఈటలను తుమ్మల డిమాండ్ చేశారు. కాగా, తుమ్మల గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉండే వారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలోకి చేరి ప్రస్తుతం మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎలాన్ మస్క్

### కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు యోచన ..



న్యూ డిల్లీ జూన్ 7 అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పేస్ ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతున్నది. నిన్నమొన్నటి వరకు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఈ ఇద్దరూ ఇప్పుడు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు సొంత డబ్బును నీళ్లలా ఖర్చు చేసిన మస్క్ ఇప్పుడు అదే ట్రంప్ వైఖరిని తప్పుబడుతున్నారు. ఇటీవలే డోజ్ శాఖ నుంచి వైదొలిగిన మస్క్.. బహిరంగంగానే ట్రంప్‌పై సంచలన ఆరోపణలు చేస్తున్నారు. ప్రస్తుతం వీరి మధ్య విభేదాలు కొత్త చర్చకు దారి తీశాయి.ట్రంప్‌తో విభేదాల వేళ ఎలాన్ మస్క్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు గురించి మస్క్ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. మధ్య వయస్కుల్లో 80 శాతం అమెరికన్లకు ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ స్థాపించడానికి ఇది తగిన సమయమేనా..? అంటూ తనకున్న 20 కోట్ల మందికి పైగా ఫాలోవర్లను ప్రశ్నించారు. దీని కోసం పోల్ పెట్టారు. ఆసక్తికరంగా 80శాతం మంది దీనికి అనుకూలంగా ఓటు వేశారు.

## బీజాపూర్ పోలీస్ కస్టడీలోని మావోయిస్టు నాయకుల్ని కోర్టులో హాజరు పర్చాలి

### మావోయిస్టు మరణాలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ చేపట్టాలి

### వామపక్ష పార్టీల డిమాండ్.

చతీష్‌ఘడ్ రాష్ట్రంలో కొనసాగుతున్న మావోయిస్టు అగ్రనాయకుల హత్యలు అత్యంత అమానుషంగా కొనసాగుతున్నాయి. బీజాపూర్ పోలీస్ కస్టడీలోని నాయకుల్ని ఒక్కొక్కర్ని కాల్చిచంపి, ఎన్‌కౌంటర్స్‌గా ప్రకటిస్తున్నారు. 2004 నాటి శాంతి చర్చల ప్రతినిధి సుధాకర్‌తోపాటు, సురేష్ తదితర ఐదుగురి మరణం అనేక ప్రశ్నల్ని లేవనెత్తుతున్నది. అంతేగాకుండా పది, ఇరవై మంది నాయకులు ఇంకా వాళ్ళ కస్టడీలో ఉన్నట్లు, వారందరినీ కూడా ఇదే రీతిలో కాల్చిచంపి ఎన్‌కౌంటర్ మరణాలుగా ప్రకటించే అవకాశం కన్పడుతున్నది.ఈ నేపథ్యంలో బీజాపూర్ పోలీస్ కస్టడీలో ఉన్నవారందర్నీ వెంటనే కోర్టుకు అప్పగించాలని, సుధాకర్, సురేష్ తదితరుల హత్యలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం. ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపి వేసి, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలను ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ రోజు సిపిఐ రాష్ట్ర కార్యాలయమైన మఖ్దుం భవన్‌లో వామపక్ష పార్టీలు సమావేశమయ్యాయి. ఈ సమావేశంలో పశ్య పద్మ (సిపిఐ) అధ్యక్షత వహించగా, సిపియం నుండి అబ్బాస్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమెక్రసీ నుండి వేములపల్లి వెంకట్రామయ్య, కె. గోవర్ధన్, యంసిపిఐ(యు) నుండి వనం సుధాకర్, ఎస్‌యుసిఐ (సి) నుండి తేజ, ఆర్ఎస్‌పి నుండి జానకి రాములు పాల్గొన్నారు.కూనంనేని సాంబశివారావు (సిపిఐ), జాన్ వెస్లీ (సిపిఎం). పి. సూర్యం (సిపిఐ (ఎం ఎల్ )న్యూడెమోక్రసీ), పోటు రంగారావు (సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ ), గాదగోని రవి ప్రసాదన్న ( సిపిఐ ఎం ఎల్ ) . మురహరి , రమేష్ రాజా ( సిపిఐ ఎం ఎల్ ) బరేషన్, జానకి రాములు బండా సురేందర్ రెడ్డి ( ఫార్వర్డ్ బ్లాక్ )

## కొత్తగా 20 వేల ఎలక్ట్రిక్ ఆటో రిక్షా లకు అనుమతి

### పొన్నం ప్రభాకర్



**రంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:**ఓఆర్ఆర్ లోపల కొత్త ఆటో రిక్షాల అనుమతి సడలిస్తూ పరిమిత సంఖ్యలో అనుమతి ఇస్తూ ఆదేశాలు- మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ

నగరంలో గత కొంతకాలంగా కొత్త ఆటో రిక్షాలకు పరిమితి ఉంది..

కొత్త ఆటో రిక్షాలు పరిమిట్లు ఇవ్వడానికి లేదు ఆ పరిమితిని సడలిస్తూ జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ లోపల పరిమిత సంఖ్య లో ఎలక్ట్రిక్, సిఎన్జీ, ఎల్పీజీ ఆటో రిక్షాలకు అనుమతి ఇస్తూ జీవో నెంబర్ 263 విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు..

హైదరాబాద్ నగరంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా కాలుష్యాన్ని తగ్గించడానికి ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడుతుంది..

హైదరాబాద్ నగరంలో రోజురోజుకు జనాభా పెరుగుదల, ఓఆర్ఆర్ లోపల ఏర్పడిన కొత్త లేఅవుట్ల, అపార్ట్మెంట్లు ఫలితంగా పట్టణీకరణ యొక్క వివిధ సవాళ్లు తలెత్తాయి. నగరంలో జనాభాలో అపారమైన పెరుగుదల కారణంగా ఆటో రిక్షా పర్మిట్లకు డిమాండ్ పెరిగింది.

ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, హైదరాబాద్ నగరంలో వాయు మరియు శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడానికి, ప్రజా రవాణా మెరుగుపరచడానికి ఎలక్ట్రిక్/ఎల్‌పీజీ/సీఎన్‌జీ ఆటో రిక్షాలను అనుమతించడం అవసరమని ప్రభుత్వం భావించింది..

ఓఆర్ఆర్ లోపల

కొత్తగా 20 వేల ఎలక్ట్రిక్ ఆటో రిక్షా లకు అనుమతి

10 వేల కొత్త ఎల్‌పీజీ ఆటో రిక్షాలకు అనుమతి

10 వేల కొత్త సీఎన్‌జీ అటో రిక్షాలకు అనుమతి

డీజిల్ ,పెట్రోల్ వాహనాలకు సంబంధించిన ఆటో లకు రేటిరోఫీట్మెంట్ చేసి వాటి ఇంజన్ ను ఎలక్ట్రిక్, ఎల్‌పీజీ ,సీఎన్‌జీ లాగా మార్చుకోవడానికి 25 వేల వాహనాలకు అనుమతి ఇస్తూ జీవో విడుదల చేయడం జరిగింది

ఇప్పటి వరకు ఉన్న డీజిల్ ,పెట్రోల్ ఆటో రిక్షాల ట్రాన్స్‌ఫర్ లేదా డీజిల్ పెట్రోల్, కొత్త ఆటో రిక్షాలకు ఓఆర్ఆర్ పరిధిలో అనుమతించబడవు..

ఈ ఎలక్ట్రిక్ వాహనాలు ఎల్‌పీజీ ,సీఎన్‌జీ తీసుకురావడానికి రెండు ప్రధాన కారణాలున్నాయి ఓ ఆర్ ఆర్ లోపల ప్రజా రవాణా ను మెరుగుపరచవచ్చు..

ఎలక్ట్రిక్ , ఎల్‌పీజీ ,సీఎన్‌జీ ఆటోలకు అనుమతి ఇచ్చి నగరంలో కాలుష్యాన్ని తగ్గించవచ్చు....

ఈ ప్రభుత్వ ఆదేశాల ద్వారా దాదాపు 65 వేల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు..

## భారత్‌ను అభ్యర్తిస్తూ నాలుగు లేఖలు రాసిన పాకిస్థాన్

న్యూఢిల్లీ జూన్ 7 : పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన విషయం తెలిసిందే. ఆ ఒప్పందంపై పునరాలోచన చేయాలని పాకిస్థాన్ కోరుతోంది. ఇప్పటికే ఇండియాకు నాలుగు లేఖలు కూడా రాసినట్లు తెలుస్తోంది. సింధూ నదికి చెందిన నీళ్లు ఇండియా అడ్డుకున్న నేపథ్యంలో.. పాకిస్థాన్‌లో నీటి సంక్షోభం మొదలైనట్లు కొన్ని వర్గాల ద్వారా తెలుస్తోంది. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేస్తూ సింధూర్ ఆపరేషన్ చేపట్టిన తర్వాత కూడా ఇండస్ వాటర్ ట్రీటీపై పాకిస్థాన్ లేఖ రాసినట్లు చెబుతున్నారు.ఉగ్రవాదం, వాణిజ్యం ఒకే విధానంగా ఉండడం కుదరదని ఇండియా తేల్చింది. రక్తం, నీళ్లు కూడా ఒకే చోట ప్రవహించదన్నారు. సిందూ జలాల ఒప్పందాన్ని పరస్పర విశ్వాసం, స్నేహం ఆధారంగా రూపొందించారు. కానీ సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడుతున్న పాకిస్థాన్ చర్యలను భారత్ ఖండిస్తోంది. పాకిస్థాన్ నీటి వనరుల శాఖ కార్యదర్శి సయ్యిద్ అలీ ముర్తాజా ఆ లేఖలను .. కేంద్ర జలశక్తి మంత్రిత్వ కార్యాలయానికి పంపినట్లు స్పష్టం అవుతున్నది. ఆ లేఖను మళ్లీ విదేశాంగ కార్యాలయానికి పంపారు.నీటి సంక్షోభాన్ని పరిష్కరించకుంటే ఆకలితో చస్తామని, సింధూ పరివాహక ప్రాంతం తమకు జీవాధారం అని, మూడో వంతు నీళ్లు తమకు దేశం బయటి నుంచి వస్తోందని, సింధూ బేసిన్‌పై 10లో 9 మంది ఆధారపడుతారని, 90 శాతం పంటలు ఆ జలాలపైనే ఆధారపడుతాయని, పవర్ ప్రాజెక్టులు, డ్యామ్‌లు అన్నీ సింధూ నదిపైనే కట్టారని, మాపై వాటర్ బాంబు పడినట్లు ఉందని, దాన్ని త్వరగా డిఫ్యూజ్ చేయాలని ఇటీవల పాకిస్థాన్ సేనేటర్ సయ్యిద్ అలీ జాఫర్ తెలిపారు. సింధూ, జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లజ్ నదులకు చెందిన నీటిని వాడుకునేందుకు 1960లో ఇండస్ వాటర్ ట్రీటీని ఏర్పర్చుకున్నారు.

# ప్రజాబలం

08 జూన్ 2025 ఆదివారం


## లాటిన్ అమెరికా యోధుడు జోస్ ముజికా

ఉరుగ్వే మాజీ అధ్యక్షుడు జోస్ 'పెపె' ముజికా 89వ ఏట 2025 మే 13న మరణించారు. అతడి జీవిత సహచరి, ఉద్యమ సహచరి లూసియా టొపోలన్‌స్కీ గతంలో గెరిల్లా యోధురాలు, సెనేటర్ కూడా. ఒక గెరిల్లా యోధుడి నుండి దేశాధ్యక్షుడి దాకా కొనసాగిన ముజికా జీవనయానం చాలా ప్రత్యేకమైనది. ఏండ్ల తరబడి ఒంటరిగా ఖైదు జీవితాన్ని అనుభవిం చాడు. ఆ తర్వాత ప్రజల హృదయాలను గెలుచుకున్న నేతగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందాడు. ఉరుగ్వేలోని మాంటెవిడియో లో ముజికా 1935 మే 20న జన్మించాడు. వాళ్లది ఒక మధ్యతరగతి కుటుంబం. ఎనిమిదేళ్ళకే తండ్రిని పోగొట్టుకున్నాడు ముజికా. దాంతో తన పొట్ట పోసుకోడానికి అన్ని రకాల పనులనూ చేయాల్సి వచ్చింది. రొట్టెలు ఇళ్ళకు సరఫరా చేయడం నుంచి పువ్వులు అమ్మడం వరకూ రకరకాల పనులు చేశాడు. యుక్తవయస్సు వచ్చాక కొద్దికాలం పాటు మధ్యేవాద–మితవాద పార్టీ అయిన నేషనల్ పార్టీలో పని చేశాడు. ఆ పార్టీ రాజకీయాల పట్ల విముఖత ఏర్పడి ప్రత్యామ్నాయ రాజకీయాల అన్వేషణలో పడ్డాడు. 1959లో జరిగిన క్యూబన్ విప్లవం ముజికాను ఎంతో ఉత్తేజితుడిని చేసింది. 1962లో తన 27వయేటా ఇతరులతో కలిసి ముజికా నేషనల్ లిబరేషన్ మూవ్‌మెంట్ (ఎం.ఎల్.ఎన్–టి) అనే సంస్థను స్థాపించాడు. అది ఒక గెరిల్లా ఉద్యమం. ఉరుగ్వేలోని నియంతృత్వ ప్రభుత్వాన్ని కూలదోయడమే దాని లక్ష్యం. తన విప్లవ జీవిత కాలంలో ముజికా నాలుగుసార్లు పట్టుబడ్డాడు. ఆరుసార్లు తూటాలు శరీరంలోంచి దూసుకు పోయినా బతికాడు. జైలు నుండి రెండు సార్లు తప్పించు కున్నాడు. దీర్ఘకాలం క్రూరమైన నిర్బంధాన్ని తట్టుకున్నాడు. ఉరుగ్వేలోని సైనిక నియంతృత్వ పాలనలో అతడిని దారుణంగా చిత్రహింసలు పెట్టారు. తన పద్నాలుగేండ్ల జైలు జీవితంలో పదేండ్ల పాటు ఒక లోతైన నూతిలో ఒక్కడే నిర్బంధించబడ్డాడు. 1985లో సైనిక పాలన అంతం కావడంతో గెరిల్లా యోధులం దరికీ క్షమాభిక్ష లభించింది. దాంతో ముజికా బయటపడ్డాడు. విడుదల అనంతరం ముజికా సాయుధ పోరాట మార్గాన్ని విడనాడాడు. ప్రజాతంత్ర రాజకీయాలవైపు మొగ్గు చూపాడు. మూవ్‌మెంట్ ఆఫ్ పాపులర్ పార్టిసిపేషన్ (ఎం.పి.పి) అనే పార్టీని ఇతరులతో కలిసి స్థాపించాడు. అది ఒక విశాల ప్రాతిపదికన ఏర్పడ్డ వామపక్ష సంఘటన. 1994లో ముజికా ఛాంబర్ ఆఫ్ రిప్రెజెంటేటివ్స్ (ప్రజాప్రతినిధుల సభ)కు ఎన్నికయ్యాడు. ఆ తర్వాత సెనేట్‌కు ఎన్నుకోబడ్డాడు. పార్లమెంటులో అతడు ఒక సూత్రబద్ధమైన నాయకుడిగా నిజాయితీగా, నిరాడంబరంగా జీవించే నేతగా గౌరవాన్ని పొందాడు. 2009లో ముజికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. తనకు కేటాయించిన అధ్యక్ష భవనంలో ఉండడానికి తిరస్కరించి దేశ రాజధాని మాంటెవిడియో శివార్లలో తనకున్న చిన్న రేకుల షెడ్డు ఇంటిలోనే ఉండడానికి ఇష్టపడ్డాడు. అధ్యక్షుడిగా తనకు వచ్చే జీతంలో తొంభైశాతం వరకూ దానంగా ఇచ్చేవాడు. "రాజకీయ వేత్తలు తమ ప్రజల మాదిరిగా జీవించాలే తప్ప ప్రత్యేక స్థాయి గల కొద్ది మందిలా ఉండకూడదు" అని చెప్పేవాడు. 2010–15 మధ్య అధ్యక్షుడిగా ఉన్న కాలంలో ఉరుగ్వేను మార్చడానికి ముజికా ఎన్నో చర్యలు చేపట్టాడు. క్రమం తప్పకుండా వేతనాలను పెంచాడు. పేదరికంలో ఉన్న జనాభా సగానికి పైగా దాన్నుంచి బయటపడ్డారు. పేదరికపు రేటు ఏడు శాతానికి తగ్గింది. నిరుద్యోగం గణనీయంగా తగ్గింది. జీడీపీ సుమారు 5.4 శాతం పెరిగింది. అబార్షన్‌ను చట్టబద్ధం చేయాలన్న దీర్ఘకాలిక డిమాండ్‌ను ఆమోదించి చట్టం చేశాడు. మరిజువానాపై ప్రభుత్వ నియంత్రణ అమలు చేసి మాదక ద్రవ్య వ్యాపారులకు కళ్లెం వేశాడు. నయా ఉదారవాదం చెప్పే నియమాలకు కట్టుబడకుండా ముజికా తన విధానాలను అమలు చేశాడు. నయా ఉదారవాదానికి, అది పెంచి పోషించే వినిమయతత్వానికి ముజికా బద్ధ వ్యతిరేకి. "ఇంకా ఇంకా ఎక్కువ సంపాదించాలనుకున్న వారే నిజమైన పేదవాళ్లు" అని ముజికా ప్రకటించాడు. పర్యావరణ పరిరక్షణకు, పర్యావరణ హిత అభివృద్ధికి ముజికా కట్టుబడి వ్యవహరించాడు. నేడు ఉరుగ్వే ప్రపంచంలోనే పర్యావరణానికి అత్యంత అంకితభావంతో కట్టుబడిన దేశంగా ఉంది. ఆ దేశంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 98 శాతం బయోమాస్ నుండి, గాలి నుండి, సూర్యుడి నుండి వస్తుంది.

ఉరుగ్వే చట్టాల ప్రకారం ఒకసారి అధ్యక్షుడైనవాడు వరుసగా రెండు సార్లు ఆ పదవిలో ఉండకూడదు. ఆ నిబంధనను అనుసరించి ముజికా పదవి నుండి వైదొలగాడు. ఐతే, ఆ సమయానికి 60 శాతం ప్రజానీకం ముజికా విధానాలకు ఆమోద ముద్ర వేశారు. ముజికా 2020 వరకూ సెనేటర్‌గా కొనసాగాడు. జీవితాంతమూ అతడు లాటిన్ అమెరికా ఐక్యతనే కోరుకున్నాడు. లాటిన్ అమెరికా ఖండంలోని తక్కిన వామపక్ష, అభ్యుదయ వాదులందరికీ ముజికా స్ఫూర్తినిచ్చాడు. 2024లో ముజికాకు అన్నవాహిక వద్ద క్యాన్సర్ సోకినట్టు నిర్ధారించారు. తన అనారోగ్యాన్ని లెక్క చేయకుండా ముజికా 2024 ఎన్నికల్లో తమ అభ్యర్ధి యమాందు ఒర్సి గెలుపు కోసం ప్రచారం చేశాడు. జనవరి 2025లో ముజికా ఇక తనకు వైద్యం వద్దని తిరస్కరించాడు. "ఒక సైనికుడు ఎప్పుడో ఒకప్పుడు విశ్రాంతి తీసుకోవాలి" అన్నాడు. ముజికా మరణం లాటిన్ అమెరికా లోను, ప్రపంచ ప్రజల్లోను విషాదాన్ని నింపింది. పేదలకు, శ్రామిక వర్గానికి అనుకూలంగా ఉండే రాజకీయాల సమున్నత వారసత్వాన్ని ముజికా మనకి వదలి వెళ్ళాడు. అతడి నిరాడంబరత, ప్రజలతో మమేకం కావడం, అవినీతికి అతీతంగా ఉండడం, న్యాయానికి అచంచలంగా కట్టుబడి వ్యవహరించడం ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. మెక్సికో అధ్యక్షుడు క్లాడియా షీన్‌బామ్ "ముజికా లాటిన్ అమెరికాకు, యావత్ ప్రపంచానికి కూడా ఒక గొప్ప ఉదాహరణ" అన్నారు. చిలీ అధ్యక్షుడు గేబ్రియల్ బోరిక్ "ఇప్పటికన్నా ఇంకా మెరుగుగా చేయవచ్చునన్న తీరని దాహాన్ని మాకు మీరు మిగిల్చి వెళ్లారు. గుండె కొట్టుకుంటున్నంత వరకూ, ప్రపంచంలో అన్యాయం ఉన్నంత వరకూ పోరాటం చేయడం కన్నా గొప్ప పని ఇంకొకటి లేదని మీరు చాటి చెప్పారు" అన్నారు.

లాటిన్ అమెరికా నేడు అల్లకల్లోల పరిస్థితుల్లో ఉంది. "ఇప్పటికి చేసినదానికన్నా ఇంకా మెరుగ్గా చేయవచ్చు"నని ముజికా చెప్పినదాన్ని ఆచరించడం పెద్ద సవాలుగా మారింది. గేబ్రియల్ బోరిక్ ప్రభుత్వం చిలీలో చాలా ఎక్కువ అంచనాలతో గెలుపొందింది. కాని ఇప్పుడా ప్రభుత్వం సంక్షోభంలో ఉంది. ప్రజా తీర్పుకు అనుగుణంగా బోరిక్ వ్యవహరించడం లేదని ఎక్కువ మంది భావిస్తున్నారు. రాజ్యాంగ సభ ఒక అభ్యుదయకర రాజ్యాంగాన్ని తయారుచేసింది. కాని దానిని జాతీయ రెఫరెండంలో ప్రజలు తిరస్కరించారు. రెండవ మారు తయారెచితున్న ముసాయిదా రాజ్యాంగం పట్ల ప్రజలకు ఏమంత విశ్వాసం కలగడం లేదు.బొలీవియా లోని మూవ్‌మెంట్ ఫర్ సోషలిజం (ఎం.ఎఫ్.ఎస్) లో చీలికలు ఏర్పడ్డాయి. మాజీ దేశాధ్యక్షుడు ఇవో మొరేల్స్‌ను ప్రస్తుత అధ్యక్షుడు లూయిస్ ఆర్సె పక్కనబెట్టాడు. ఆగస్టులో అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరగబోతున్నాయి. ఎం.ఎఫ్.ఎస్ తన అభ్యర్థిగా ఎడ్వర్డో డెల్ కాస్టిలోను నిలబెట్టింది. మొరేల్స్ దీనిని సవాలు చేస్తూ నామినేషన్ వేయడానికి తయారౌతున్నాడు, కాని రాజ్యాంగం రెండు సార్లు కన్నా ఎక్కువగా అధ్యక్ష పదవిని చేపట్టకూడదని నిబంధన విధించింది. ఐనా మొరేల్స్ దీన్ని కూడా ధిక్కరిస్తూ స్థానిక ఆదివాసీలను పెద్దఎత్తున సమీకరించి దేశ రాజధానిలో ప్రదర్శన నిర్వహించాడు. దీన్ని పోలీసులు అడ్డుకున్నారు. బాష్ప వాయువు సైతం ప్రయోగించారు. బొలీవియాలోని వామపక్ష శక్తులు ఇలా చీలిపోవడం తీవ్ర నష్టానికి దారి తీయవచ్చు. ఈక్వెడార్‌లో ఏప్రిల్ 14న జరిగిన ఎన్నికలలో సిటిజెన్ రివల్యూషన్ అభ్యర్థి లూయిసా గొంజాలెజ్ గెలుపు ఖాయమని అందరూ భావించారు.

## అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల



**రాజేంద్రనగర్ ప్రజాబలం ప్రతినిధి:** IVF రంగారెడ్డి జిల్లా మహిళ విభాగ్ ఆధ్వర్యంలో మనికొండ మర్రిచెట్టు దగ్గర IVF రంగారెడ్డి జిల్లా మహిళ విభాగ్ అధ్యక్షురాలు బండ సంయుక్త గారి ఆధ్వర్యంలో జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై అన్నప్రసాద వితరణ కార్యక్రమంనీ ప్రారంభించిన TPCC ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త గారు.

IVF ప్రధమ మహిళ ఉప్పల స్వప్న గారు.

ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం గొప్పది అని ఆయన అన్నారు.

అన్నప్రసాద వితరణ ద్వారా అనేక మంది కి ఆకలి తీర్చిన వారిని అవుతాము అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో IVF మహిళా విభాగ్

రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ అనూష , కోశాధికారి శ్వేత , అడిషనల్ జనరల్ సెక్రెటరీ లావణ్య ం, మాధురి, చవత, స్వప్న కటకం శ్రీనివాస్ గుప్త , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంజుల , అర్చన గారు, జూబ్లీ హిల్స్ IVF మహిళ విభా గ్ అధ్యక్షురాలు స్వాతి , చింతల రజినీకాంత్ గుప్త లోకేష్, శ్రీనివాస్ ఆర్య వైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రివర్గంలో మాకు చోటు కల్పించండి

### సీఎంకు మాదిగ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు



జూబ్లీ హిల్స్ నివాసం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మాదిగ సామాజిక వర్గ శాసనసభ్యులు. మంత్రి వర్గం లో తమకు అవకాశం కల్పించాలని వారు సీఎంకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ని కలిసిన వారిలో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ , నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తదితరులున్నారు.

## కాంగ్రెస్ అధికార పార్టీ నాయకుల దౌర్జన్యం

భూమి లాక్కున్నారని, న్యాయం కావాలని పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం ముందు 40 డిగ్రీల ఎండలో దివ్యాంగుడు తన కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేశాడు.జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు రూపాని సాలయ్య కు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. 2009లో అదే గ్రామానికి చెందిన చింత మహేందర్ వద్ద 5.20 ఎకరాలు కొనుగోలు చేసి తన భార్య రూపాని యాదమ్మ పేరుపై కొడకండ్లలోని సబ్ రిజిస్టార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు.

# రాజీవ్ స్వగృహ – హౌసింగ్ బోర్డు ఫ్లాట్లు, స్థలాలు విక్రయం

## వివాదాలు లేని ఆస్తుల కొనుగోలుకు చక్కటి అవకాశం....

### హౌసింగ్ బోర్డు కమిషనర్ వి.పి.గౌతం







హైదరాబాద్ , జూన్ 7....అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలు, ఫ్లాట్లను బహిరంగ వేలం వేయాలని హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ సంస్థలు నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీ డా. జ్యోతి బుద్ద ప్రకాశ్, హౌసింగ్ బోర్డు కమిషనర్ శ్రీ వి.పి. గౌతం లు, సిద్ధం చేసిన ప్రతిపాదనలకు వనరుల సమీకరణలపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ఈ నెల 20 వ నాటికి ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ను విడుదల చేయాలని,అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పలు జిల్లాలలోని 11 ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తి అయిన, పాక్షికంగా పూర్తి అయిన అపార్ట్ మెంట్లు– ఫ్లాట్లతో (%ఖీశ్రీఫ్‌ం%) పాటు, ఓపెన్ ప్లాట్లు , హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలోని నాలుగు ప్రాంతాల్లోని ఓపెన్ ప్లాట్లు (%ూశ్రీశ్‌ం%), ఖాళీ స్థలాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఎటువంటి వివాదాలు లేని భూములు, అందుబాటులో ఉండే ధరలతో నిర్మించిన అపార్ట్మెంట్లు–ఫ్లాట్లను కొనుగోలు చేసుకునేందుకు ఆసక్తి ఉన్నవారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గృహనిర్మాణ సంస్థ కమిషనర్ శ్రీ వి.పి.గౌతం విజ్ఞప్తి చేశారు.ఈ విక్రయాలతో వచ్చిన ఆదాయంతో, ఓఆర్ఆర్ పరిసరాల్లోనూ, ఇతర జిల్లాల్లోనూ సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా హౌసింగ్ పథకాలను చేపట్టాలని భావిస్తున్నారు. వీటిని బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు అదికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజీవ్ స్వగృహకు సంబంధించినంత వరకు గాజుల రామారం, పోచారం, ఖమ్మం పోలేపల్లి ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న టవర్లలో (ఒక్కో దానిలో సుమారు 100 నుంచి 150 వరకు ఫ్లాట్లు ఉన్న టవర్ ను యూనిట్ గా) ఏక మొత్తంగా విక్రయించనున్నారు. బిల్డర్లు, ఒక గ్రూప్ గా ఏర్పడి కొనుగోలు చేయాలనుకున్న వారితో పాటు, హౌసింగ్ కార్యక్రమాలు నిర్వహించే సంస్థలు, బహుళ అంతస్తుల భవనాల అవసరం ఉన్న సంస్థల, వంటి వారు తీసుకునేందుకు వీలు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు.వేలం వేయనున్న వాటి వివరాలు ఇలా ఉన్నాయిరాజీవ్ స్వగృహకు చెందిన వాటి వివరాలు రంగారెడ్డి జిల్లా తొర్రూరులో 514, కుర్మల్ గూడలో 20, చందానగర్ లోని 3 ఓపెన్ ఫ్లాట్లు , బండ్లగూడలో 159 పూర్తి అయిన ఫ్లాట్లు, మేడ్చల్–మల్కాజ్ గిరి గాజులరామారం లోని 5 టవర్లలోని పూర్తి కాని కట్టడాలు, పోచారం లోని పూర్తి అయిన 601 ఫ్లాట్లు, అసంపూర్తిగా ఉన్న 6 టవర్లలోని వివిధ రకాల ఫ్లాట్లు, బహదూర్ పల్లిలోని 69 ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. మహబూబ్ నగర్ జిల్లాలోని పోతులమడుగులో 111 , అమిస్తపూర్ లోని 45 ఓపెన్ ప్లాట్లను విక్రయించడానికి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.ఖమ్మం జిల్లాలో పోలేపల్లిలో అసంపూర్తిగా ఉన్న 8 టవర్లతో పాటు, 3.38ఎకరాల ఖాళీ స్థలాన్ని కూడా బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. హౌసింగ్ బోర్డు స్థలాలు కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ (కెపిహెచ్ బి)– 4 వ ఫేజ్ లో ఖాళీగా ఉన్న 7ఎకరాల 33 గుంటల విస్తీర్ణంలో ఖాళీ భూములను, అదే కాలనీలో ఉన్న రెండు ఓపెన్ ప్లాట్లును(4598 చదరపు గజాల విస్తీర్ణం, 2420 చదరపు గజాల స్తీర్ణం) ఈ–ఆక్షన్ ద్వారా విక్రయించనున్నారు. అలాగే నాంపల్లి లోని 1148 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఖాళీ స్థలాన్ని, సంజీవరెడ్డి నగర్ లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీహాల్ కు చెందిన 2605 చదరపు గజాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సంజీవరెడ్డి నగర్ లోని కమ్యూనిటీహాల్ (సెల్లార్, స్టిల్ట్, జి౦1) 22,285 చదరపు అడుగుల విస్తీర్ణంలో,37,070 చదరపు అడుగుల పార్కింగ్ స్థలంతో పూర్తి అయ్యే స్థితిలో ఉన్నది. ఈ భూములను ఫంక్షన్ హాల్ నిర్వహణ కోసమే వేలం వేయనున్నారు.

## కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు ఇద్దరు మృతి

మేడ్చల్ ఘట్కేసర్ మండలం ఎదులాబాద్ లో కరెంటు స్తంభాన్ని హ్యుండాయ్ క్రెటా కారు ఢీ కొట్టింది. కారులో నలుగురు వ్యక్తులు భార్గవ్ యాదవ్, వర్షిత్, ప్రవీణ్, దినేష్ వున్నారు. ఈ ప్రమాదంలో భార్గవ్ యాదవ్, వర్షితులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రవీణ్ కు తీవ్ర గాయాలు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. దినేష్ కు ఎలాంటి గాయాలు కాలేదు. మృతవదేహాలను గాంధీ హాస్పిటల్ కి తరలించారు.

# సముద్రాలను కాపాడుకోలేమా !

భూగ్రహాన్ని 71 శాతం వరకు జలమే ఆక్రమించుకొని అసంఖ్యాక జీవుల మనుగడకు ఊపిరి పోస్తున్నది. సముద్ర జలాల ప్రాణికోటికి ప్రాణ వాయువును అందిస్తూ, బిలియన్ల మానవాళికా జీవనోపాధులను కల్పిస్తూ, దాదాపు 80 శాతం జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి మహా సముద్రాలు ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయి. నేటి డిజిటల్ యుగంలో సముద్ర జలాలు అతిగా చేపలను పట్టడం, ప్లాస్టిక్ కాలుష్యం, వాతావరణ ప్రతికూల మార్పులు, సముద్ర ఉపరితలాల ఉష్ణోగ్రతలు పెరగడం, జల ఆమ్లీకరణ, సముద్ర జీవ వైవిధ్యం లాంటి పలు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నది. నేడు కేవలం 17 శాతం నేల, 8 శాతం మహాసముద్రాలు మాత్రమే పరిరక్షించబడుతున్నాయి. మహాసముద్రాల దీర్ఘకాలిక మనుగడలు, బీచ్‌లు, సముద్ర సంపద, జల చక్రం, కార్బన్ చక్రం, సముద్ర ఆహారం, ఉపరితల రవాణా, ఓడ రేవులు, సముద్ర క్రీడలు, సముద్ర శ్వచ్ఛత, సముద్ర వనరుల వినియోగం మొదలగు పలు అంశాలు మహాసముద్రాలతో ముడిపడి ఉన్నాయి. ధరణిని నీలి గ్రహంగా పిలవడానికి నీలి వర్ణపు మహాసముద్రాలే కారణం. మనం 30 శాతం వరకు సముద్రాలను సంరక్షించుకోగలిగితే వాతావరణ సానుకూల మార్పులు, జీవ వైవిధ్య పరిరక్షణ, సుస్థిర జీవ వ్యవస్థలు సుసాధ్యం అవుతాయి. నేడు భూమండలంపై పసిఫిక్ (అత్యంత పొడవైన, లోతైన), అట్లాంటిక్(అతి లవణ సాంద్రత), ఇండియన్, అర్కిటిక్(అతి చిన్న, అతిశీతల, అతి ఇరుకైన), అంటార్కిటిక్(సదరన్) అనబడే ఐదు ప్రధాన మహాసముద్రాలు ఉన్నాయని మనకు తెలుసు. 1992లో ఐరాస కీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 08 జూన్ రోజున విశ్వవ్యాప్తంగా "ప్రపంచ మహాసముద్రాల దినోత్సవం (వరల్డ్ ఓసియన్ డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. మహాసముద్రాల ప్రయోజనాలను ప్రజలకు వివరించడం, వాటిని పరిరక్షించుకుంటేనే భవిష్యత్తు తరాల మనుగడ సుసాధ్యం అవుతుందని వివరించడం జరుగుతుంది. సముద్ర చేపలను పరిమితులకు మించి అతిగా పట్టడం వల్ల అపార్థాలు జరుగుతాయని వివరించడం ప్రధానమైనదిగా భావిస్తున్నారు. ప్రపంచ మహాసముద్రాల దినం-2025 ఇతివృత్తంగా "ఆశ్చర్యం : మనల్ని కాపాడే దానిని కాపాడుకోవడం (వార్ : సస్టేనింగ్ వాట్ సస్టేన్స్ అజ్)" అనబడే అంశాన్ని తీసుకున్నారు. శాస్త్రీయ పరిజ్ఞానాన్ని జోడిస్తూ, ఆవిష్కరణలను ఊతం ఇస్తూ, సాంప్రదాయ పద్ధతులకు మెరుగులు దిద్దుతూ మహాసముద్రాల ఆరోగ్యాలను కాపాడడం కొనసాగాలి. ప్రతి ఏట 13 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జలాల్లోకి చేరుతున్నాయి. నేడు మహాసముద్రాలను డంపింగ్ యార్డులుగా పరిగణించడం ప్రమాదకరం, ఆక్షేపణీయం. దీని వల్ల మహమ్మారి వైరస్‌లు, సునామీలు, తుఫాన్లు, అకాల వర్షాలు, తీవ్ర అనారోగ్యాలు లాంటి విపత్తులు వస్తున్నాయి. నేడు మహాసముద్రాలను కాపాడడానికి దాదాపు 2,000లకు పైగా సంస్థలు కృషి చేయడం ముదావహం. భూమిపై ఉన్న జలవనరుల్లోనే 90 శాతం వరకు జీవావరణం దాగినఉంది. భూమి ఉపరితల జలాల్లో 97 శాతం మహాసముద్రాల్లోనే దాగి ఉన్నాయి. అన్ని మహాసముద్రాల ఘనపరిమాణం 1.35 బిలియన్ క్యూబిక్ కిలోమీటర్లు ఉండగా, సముద్రాల సగటు లోతు 3,700 మీటర్లుగా రికార్డు అయ్యింది. సముద్రాల్లో 2,30,000 రకాల జీవజాతులు గుర్తించబడినవి. ప్రపంచ మానవాళి దృష్టిని మహాసముద్రాల పరిరక్షణ వైపు మరల్చడంతో పాటు సముద్రాలను నిలబెడితేనే అవి ప్రాణికోటిని కూడా నిలుపుతాయని గుర్తుంచుకోవాలి. దాదాపు 3 బిలియన్ల ప్రజలు సముద్ర జలాలపై పోషకాహారం కోసం ఆధారపడి జీవనోపాధులను పొందుతున్నారని, దాదాపు 10 శాతం ప్రజలు సముద్ర చేపల మీద ఆధారపడి జీవితాలను గడుపుతున్నారని తెలుసుకోవాలి. ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులు, పౌర సమాజం చేయి చేయి కలిపి మహాసముద్రాలను పరిక్షించుకోవాలి, రేపటి సుస్థిరాభివృద్ధికి బాటలు వేయాలి. జలమే జీవనాధారమని, సముద్రాలను కాపాడితేనే ఉజ్వల భవిత అని భావిస్తూ సముద్ర దేవతకు రక్షణ గొడుగు పడుతూ, రక్షించమని వేడుకుందాం.

# బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన ఏది?

ప్రతి సంవత్సరం జూన్ 8ను అంతర్జాతీయ బ్రెయిన్ ట్యూమర్ దినంగా ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం ప్రజల్లో బ్రెయిన్ ట్యూమర్ పట్ల అవగాహన పెంపు, బాధితులకు మానవీయ మద్దతు కల్పించడం, అలాగే శాస్త్రీయ పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వడం. జర్మన్ బ్రెయిన్ ట్యూమర్ అసోసియేషన్ 2000వ సంవత్సరంలో ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. అప్పటి నుంచీ ఈ రోజు అనేక మంది జీవితాల్లో ఆశను నింపే ఉద్యమంగా మారింది.బ్రెయిన్ ట్యూమర్ అనేది మెదడులోని కణాలు నియంత్రణ లేకుండా పెరగడం వల్ల ఏర్పడే గడ్డ. ఇవి మెదడులో ఏర్పడిన ప్రాథమిక ట్యూమర్‌లు కావచ్చు లేదా శరీరంలోని ఇతర భాగాల నుంచి మెదడుకు వ్యాపించిన మెటాస్టాటిక్ ట్యూమర్‌లు కావచ్చు. ఈ ట్యూమర్‌లు కొన్ని సార్లు సౌమ్యంగా ఉండవచ్చు (బినైన్), మరికొన్నిసార్లు మెలిగ్నెంట్‌గా మారి ప్రాణాంతకంగా మారుతాయి. అయితే, రెండు రకాల ట్యూమర్లూ మెదడుపై ఒత్తిడిని కలిగించి, మానసిక, శారీరక పనితీరును ప్రభావితం చేయగలవు. బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలు చాలా విభిన్నంగా కనిపించవచ్చు. ఉదయపు తలనొప్పులు, మూర్ఛ, జ్ఞాపకశక్తి లోపం, చూపులో మార్పులు, చేతులు కాళ్లలో బలహీనత, నడకలో తడబాటు, మాట్లాడడంలో తేడా, భావోద్వేగాల్లో మార్పులు వంటి సమస్యలు కనిపించవచ్చు. వీటి గురించి సరైన అవగాహన లేకపోతే రోగ నిర్ధారణ ఆలస్యమై, చికిత్స ప్రయోజనకరంగా మారదు. ఇటువంటి సందర్భాల్లో ముందస్తు గుర్తింపు జీవితాన్ని నిలుపుతుంది. ఈ లక్షణాలను గమనించినప్పుడు వైద్య సలహా తీసుకోవడం అత్యవసరం. బ్రెయిన్ ట్యూమర్ నిర్ధారణకు ఎమ్ఆర్ఐ, సీటీ స్కాన్, బయోప్సీ వంటి పద్ధతులు ఉపయోగిస్తారు. చికిత్సలో శస్త్రచికిత్స, రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనోథెరపీ వంటి విధానాలు వినియోగించ బడతాయి. ట్యూమర్ స్థితిగతులు, రోగి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా చికిత్స మారుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం కనీసం మూడు లక్షల మందిలో బ్రెయిన్ ట్యూమర్ కొత్తగా గుర్తించ బడుతోంది. పిల్లల క్యాన్సర్ రోగాల్లో ఇది మూడవ స్థానంలో ఉంది. భారత దేశంలో సంవత్సరానికి సుమారు 40,000 నుంచి 50,000 కొత్త కేసులు నమోదవుతున్నట్లు నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రాం అంచనా వేస్తోంది. భారత దేశంలో బ్రెయిన్ ట్యూమర్ రోగులలో సగం మంది నలభై ఏళ్ల లోపువారే. ఇది మానవ వనరులపై తీవ్ర ప్రభావం చూపుతోందని చెప్పవచ్చు. అంతేకాదు, భారత్ వంటి దేశాల్లో వైద్య వసతుల కొరత, అవగాహన లోపం, ఆర్థిక పరిమితులు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల లేకపోవడం వంటి అంశాలు చికిత్సను మరింత కష్టతరంగా చేస్తున్నాయి. ఈ దినోత్సవం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపుకు తోడుగా, రోగులకు మానసిక బలాన్నివ్వడం, శాస్త్రీయ పరిశోధనలకు నిధులు సేకరించడం, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల సహకారంతో ఉచిత స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్పష్టమవుతోంది. ముఖ్యంగా మొబైల్ డయాగ్నస్టిక్ సెంటర్లు, ఆరోగ్య బీమా అవగాహన కార్యక్రమాలు, పేద రోగులకు చికిత్సా బదిలీ పథకాలు అవసరమవుతున్నాయి. ఈ రోజున మనం ప్రతి బాధితుడికి మద్దతుగా నిలబడితే, ప్రతి శాస్త్రవేత్త పరిశోధనకు కావాల్సిన వనరులు అందించగలిగితే, ప్రతి కుటుంబానికి అవగాహనను అందించగలిగితే ం భవిష్యత్తులో మెదడు ఆరోగ్యానికి భద్రత కల్పించ గలుగుతాం.

# మహోపకారి ప్రవక్త ముహమ్మద్

అరబ్బుల మత, రాజకీయ నాయకుడు, ఇస్లాం చివరి ప్రవక్త ముహమ్మద్ లేదా మహమ్మద్. ముస్లింలు ఇస్లాంను, ఏకేశ్వరో పాసక మతముల ప్రకటనలో చివరి మెట్టుగా భావిస్తారు. ఇస్లాం పరంపర ఆదామ్ ప్రవక్తతో ప్రారంభ మైనది. అనేక ప్రవక్తల గొలుసు క్రమంలో మహమ్మద్ చివరివారు. ముస్లిమేతరులు సాధారణంగా మహమ్మద్ ను ఇస్లాం మత స్థాపకునిగా భావిస్తారు. కాని ఇస్లాం మతం ప్రారంభమైంది ఆది పురుషుడైన ఆదమ్ ప్రవక్తతో అని విశ్వాసం. సాంప్రదాయ ముస్లిం జీవితకర్తల ప్రకారం మహమ్మద్ సి.570లో మక్కాలో జన్మించి, 8వ జూన్, 632లో మదీనాలో పరమ పదించారు. మక్కా, మదీనా రెండూ అరేబియన్ ద్వీపకల్పం లోనివే. ఖురాన్ లో "ముహమ్మద్ " అని పేర్కొన బడింది. ముహమ్మద్ అనే పదానికి అరబ్బీ మూలం హమ్ (హ మ్ ద్) అర్థం. హమ్ ద్ పదానికి ము చేర్చిన ముహమ్మద్ అగును. అంటే శ్లాఘించ బడిన వాడు లేదా కీర్తించ బడినవాడు అని అర్థం. ఈ పేరునే ముహమ్మద్, మొహమ్మద్, మహమ్మద్, మహమ్మదు అని రాస్తారు. టర్కీవాసులు మహ్మెట్ లేదా మహమెట్ అని, అహ్మద్ అనీ పలుకుతారు. మహమ్మద్ తొలి ముస్లిం మూల నివేదిక ప్రకారం 611లో 40 ఏళ్ళ వయసులో హిరా గుహలో ధ్యానం చేస్తుండగా, దివ్య దృష్టిని పొందారు. ఈ విషయాన్ని సమీప వ్యక్తులకు వర్ణిస్తుండగా, దేవ దూత జిబ్రాయీల్ ఆయనకు కనిపించి, ఖురాన్ ప్రవచనాలను గుర్తు పెట్టుకుని, ఇతరులకు బోధిం చమని అల్లాహ్ ఆదేశించినట్లు చెపుతారు. మహమ్మద్, అరబ్బులకు తెలిసిన జుడాయిజమ్ (యూద మతము)ను కాని క్రైస్తవ మతాన్ని కాని పూర్తిగా తిరస్కరించ లేదు. ఇబ్రాహీం ప్రవక్త అవలంబించిన ఇస్లాం మతమును ప్రకటిస్తున్నానని చాటారు. తక్కువ సమయంలోనే అనేకుల విశ్వాసం పొందినా, విగ్రహారాధనా వలంబీకులైన అరబ్ తెగల ద్వేషాన్ని తప్పించు కోవడానికి తాత్కాలికంగా 622లో మక్కా నుండి వలస వెళ్ళి, తన సహచరులతో కలిసి యస్రిబ్ (నేటి మదీనా)లో స్థిరపడినారు. ఇక్కడే మహమ్మద్ తొలి ముస్లిం సముదాయమును స్థాపించి, నాయకులైనారు. తర్వాత ఖురేషులు మరియు మదీనా వాసులైన విశ్వాసులకు మధ్య జరిగిన యుద్ధంలో మహమ్మద్, ఆయన అనుచరులు విజయం సాధించారు. మహమ్మద్ మృతి చెందే నాటికి అరేబియా ద్వీప కల్పాన్ని సమైక్య పరిచి, ఉత్తరాన సిరియా మరియు పాలస్తీనా ప్రాంతాలలో ఇస్లాంను వ్యాపింప చేశారు. మహమ్మద్ తర్వాత ఖలీఫాల నేతృత్వంలో ఇస్లామీయ సామ్రాజ్యం పాలస్తీనా సిరియా, ఇరాక్, ఇరాన్, ఈజిప్టు, ఉత్తర ఆఫ్రికా, స్పెయిన్ దేశాలకు వ్యాపించింది. ముస్లింలు, ముస్లి మేతరుల మధ్య వర్తక సంబంధాలు, మత ప్రచార కార్య కలాపాలు మహమ్మద్ ప్రవచించిన మతాన్ని భూమి నలు చెరగులా వ్యాప్తి చెందించడానికి దోహద పడ్డాయి. ముహమ్మద్ జీవితాన్ని గురించి ఖురాన్, సీరత్ హదీస్ సేకరణలు తెలుపు తున్నాయి. హదిత్ సేకరణలలో ముహమ్మద్ జీవితానికి సంబంధించి అనేక అప్రామాణిక సాంప్రదాయాలు ముస్లిం ముస్లిమేతర పండితులు ఏకగ్రీవంగా అంగీకరిస్తారు. అయితే ముహమ్మద్ చారిత్రక, జీవిత విశే షాలను మాత్రం అందరూ అంగీకరిస్తారు. 20 ఏప్రిల్, 570 లో రబీ అల్-అవ్వాల్ పన్నెండవ రోజు మక్కాలో ప్రవక్త ముహమ్మద్ జన్మించారని కొందరు ముస్లింలు నమ్ముతారు. షియాల ప్రకారం 26 ఏప్రిల్ 571గా భావిస్తారు. మహమ్మదు ప్రవక్త, చాలా సంవత్సరాలు వర్తకుడు గాను, ప్రబోధకుడి గానూ గడిపారు. తాను కరవాలాన్ని చేబట్టింది కేవలం 10 సంవత్సరాలు మాత్రమే. అదియూ స్వీయ , ముస్లింల రక్షణకొరకు మాత్రమే యుద్ధాలు చేశారు. కొద్దిమంది గల సేనతో, అదియూ అరకొర ఆయుధాలతో యుద్ధాలు చేసి విజయం పొందడం ఆయన విశ్వాస పటుత్వానికి , అల్లాహ్ దయకు ప్రతీక. 622లో ముహమ్మద్ మక్కావీడి మదీనాకు వలస వెళ్ళారు. ఈ వలస తేదీతోనే ఇస్లామీయ క్యాలెండర్ యొక్క మొదటి సంవత్సరం ప్రారంభం అవుతుంది. ఈ శకానికే హిజ్రీ శకం అంటారు. ఇస్లామిక్ క్యాలెండర్లో రబీ ఉల్ అవాల్ 3 వ నెల, దీనిని హిజ్రీ క్యాలెండర్ అని కూడా పిలుస్తారు. అరబిక్‌లో, "రబ్బీ" అనే పదానికి వసంతం అని, "అల్ అవ్వాల్" అంటే మొదటిది అని అర్థం. అందువల్ల రబ్బీ ఉల్ అవ్వాల్ మొత్తంగా 'ది ఫస్ట్ స్ప్రింగ్' గా అనువదించారు. రబీ ఉల్ అవాల్ ఇస్లామిక్ చరిత్రలో అత్యంత ముఖ్యమైన నెల. పవిత్ర ప్రవక్త మొహమ్మద్ (స) జన్మించడం ద్వారా ఈ నెలకు ప్రాముఖ్యత చేకూరింది. ఇది మానవ చరిత్రలో అత్యంత ముఖ్యమైన మరియు గొప్ప సంఘటన. కాబట్టి, ఈ నెలను ప్రవక్త (స) పుట్టిన నెల అని పిలుస్తారు. మహమ్మద్ ప్రవక్త పేరు ఉచ్చరించి నపుడు సల్లల్లాహు అలైహి వస ల్లమ్ (అతని మీద శాంతి కలుగుగాక) అని పలుకుతారు.

ముహమ్మదు ప్రవక్త కొన్నిరోజులు అనారోగ్యం పాలయ్యారు, తదనంతరం 63 సంవత్సరాల వయస్సులో జ్వరం, తలనొప్పి, బలహీనతతో చాలా రోజుల తరువాత మదీనా నగరంలో 8 జూన్ 632 సోమవారం తన భార్య ఈషా ఇంట్లో పరమపదించారు. మరణించిన స్థలంలో, ఈషా ఇంటిలో ఖననం చేయబడ్డారు. తరువాత, ఆయన సమాధి, గ్రీన్ డోమ్ ఆ ప్రదేశంలో నిర్మించబడ్డాయి.

# సాహితీ వాచస్పతి దాశరథి

తెలుగు జాతి గర్వించదగిన సాహితీవేత్త దాశరథి రంగాచార్య. అయన చేసిన బహుముఖ రచనలు అనన్య సామాన్యాలు. అసాధారణ మేధో సంపత్తికి ప్రతిరూపాలు. రంగాచార్య రచనల్లో తెలంగాణదనం నిండుగా పరుచుకొని ఉంటుంది. ప్రగతి శీల భావం ఉప్పొంగుతుంది. వేద విజ్ఞానం ఆధ్యాత్మికతను తట్టి లేపుతుంది.

తెలంగాణ గ్రామీణ జన జీవనం సాక్షాత్కారిస్తుంది. అందుకే తెలంగాణ ప్రజలు, పోరాట యోధులు, తీవ్రవాదులు, పీడిత తాడిత ప్రజలు, నిరంకుశ పాలన బాధితులు, చరిత్రకారులు, చివరకు భాగవతోత్తములు... ఒక్కొక్కరికీ ఒక్కొక్క రీతిలో ఆత్మీయ రచయితగా నిలిచారు. ఆయన రచయిత, జీవిత చరిత్రకారుడు మాత్రమే కాదు. తెలుగు, సంస్కృతం, ద్రావిడం, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో గొప్ప పండితుడు, కవి, విమర్శకులు, నాటకకర్త. గొప్ప వక్త. ఏ అంశాన్నైనా అలవోకగా అవలీలగా వీనులకు ఇంపుగా చెప్పగలిగిన వ్యాఖ్యాత. తొలితరం ఉద్యమ రచయిత, తెలంగాణ అజ్ఞాత సాయుధ పోరాట యోధుడు. దాశరథి రంగాచార్యులు 1928, ఆగస్టు 24 న నాటి మహబూబా బాదు జిల్లా, చిన్నగూడూర్ మండలం, చిన్నగూడూర్ లో విద్వాన్ వెంకటాచర్య- శ్రీమతి వెంకటమ్మ దంపతులకు జన్మించారు. పుట్టింది పండిత కుటుంబమే అయినా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు దాశరథి. ఆయన అగ్రజుడు దాశరథి కృష్ణమాచార్యుల నుండి అభ్యుదయ, విప్లవ భావాలను అలవర్చుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఇద్దరూ కలిసి పనిచేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా పోరాడారు. తెలంగాణ ఉద్యమ జీవితాన్ని సాహిత్య రూపంలో ప్రజలకు అందించారు రంగాచార్య. తెలంగాణ చరిత్ర, ఉద్యమాలు, ప్రజల జీవితం, సాహిత్యం, సంస్కృతి.. ఇలా తెలంగాణకు సంబంధించిన అన్ని అంశాలను రచనల్లో స్పృశించిన సాటిలేని మేటి రచయిత ఆయన. మూడు కావ్యేతిహాసాలను - శ్రీమద్రామాయణము, శ్రీమదాంధ్ర మహాభారతము, శ్రీమద్భాగ వతము, వేదాలు - ఋగ్వేదము, కృష్ణ యజుర్వేదము, శుక్ల యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము ఓకే ఒక్కరుగా సంస్కృతం నుంచి వ్యాఖ్యాన సహితంగా ప్రతికృతి చేసిన ఏకైక రచయిత దాశరథి.

ఆరవ తరగతి చదువుతున్నప్పుడే తోటి విద్యార్థులను కూడగట్టి నిజాంకు వ్యతిరేకంగా సమ్మె చేశారు. నిజాం రాజ్యం ఆచంద్రార్కం నిలిచి ఉండాలని పాఠశాలల్లో చేసే ప్రార్థన, తాను చేయడానికి రంగాచార్య నిరాకరించి, నిబంధన మేరకు వారి లాగే కుచ్చు రూమీ టోపీ ధరించడానికి తిరస్కరించి బడి నుండి బహిష్కృతులు అయినారు. ఎక్కడా చదువు కాకుండా నిజాం ప్రభుత్వం ఫర్మానా జారీ చేసింది కూడా. పోలీసు నిర్బంధం, చిత్రహింసల నుంచి తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్ళి నిజాం వ్యతిరేక పోరాటం క్రియాశీలంగా జరిపారు. తర్వాత నిజాం ప్రభుత్వం వారంటు జారీ చేసినా, రంగాచార్య జాడ కనుక్కోలేక పోయింది. నేరుగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పగలు బడిలో పిల్లలకు పాఠాలు చెబుతూనే, రాత్రుళ్లు రైతు కూలీలకు ఉద్యమ బోధ చేసేవారు. తొలి నవల 'చిల్లరదేవుళ్లు'ను 1969లో వెలువరించారు. ఈ నవల 1974లో చలన చిత్రంగా వచ్చింది. 'చిల్లరదేవుళ్లు' 1938కి పూర్వపు తెలంగాణ ప్రజల జీవనాన్ని చిత్రిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలోని 1942-48 సంవత్సరాల మధ్య కాలాన్ని 'మోదుగు పూలు' నవల వర్ణిస్తుంది. చిల్లరదేవుళ్లు', 'మోదుగు పూలు' వంటి నవల్లో తెలంగాణ పలుకుబడులను - నుడికారాన్ని పలికించారు. స్వాతంత్ర్యం తరువాత రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలాన్ని 'జనపదం' నవలలో చిత్రించారు. బుద్ధుని జీవిత చరిత్రను 'బుద్ధ భానుడు' పేరుతో అపురూపమైన రచనను 2010 సంవత్సరంలో వెలువరించారు.1994లో హరివంశ సహిత 'మహా భారతం' రచించారు.1940ల్లో కోల్ కతాలో వచ్చిన కరువు రక్కసి గురించి ప్రఖ్యాత భారతీయ ఆంగ్ల రచయిత భవానీ భట్టాచార్య రాసిన నవల ఎవ ఎష్ట్రశీ తీఱఅవం ూశా౯ అస్త్రవతీ' ను 'దేవుని పేరిట' పేరుతో తెలుగులో అనువదించారు. తొలినాళ్ళలో రంగాచార్య పిల్లలకోసం 'వివేకనందుడు', 'మహాత్ముడు', 'కాళిదాసు' అనే మూడు నాటకాలు రచించారు. 1974లో 'శ్రీ వేంకటేశ్వర లీలలు' రచించారు. వేదాలు సామాన్యుడికి సైతం అందించాలనే ఆలోచనతో 70 ఏళ్ళ వయస్సులో బృహత్ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. విస్తృత సాహిత్యాన్ని సరళమైన తెలుగులోకి తేవడం, ముద్రణ, పంపిణీ, వ్యాప్తి కళ్ళార చూడడం రంగాచార్య చేసిన శ్రమఫలం, చేసుకున్న అదృష్టం. ఒక జీవితకాలంలో ఇంత చేసినవారు, ఎదిగినవారు మరొకరులేరు. తెలంగాణ జీవితాన్ని లోకానికి తెలియ జెప్పాలనే చారిత్రక దృష్టితో, దృఢ సంకల్పంతో, తెలంగాణ మీద అభిమానంతో, అందమైన శైలిలో రచనా వ్యాసంగాన్ని ఆయన సాగించారు. 1951లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. తరువాత 1957లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో చేరి, ఉద్యోగం చేస్తూనే బీఏ, ఎల్ఎల్‌బీ చేశారు. 32 సంవత్సరాల పాటు పనిచే చేసి, 1988లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. రంగాచార్య 2015 జూన్ 8వ తేదీన కన్ను మూశారు.

## డ్వాక్రా మహిళలకు లక్ష

విజయవాడ, జూన్ 7, ఆంధ్రప్రదేశ్‌లోని డ్వాక్రా మహిళల పిల్లల చదువు కోసం ప్రభుత్వం 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం' పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. స్త్రీనిధి బ్యాంకు ద్వారా 4% వడ్డీకే రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం అందిస్తారు. కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులందరూ ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. దీని ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించవచ్చు.ఆంధ్రప్రదేశ్‌లో డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. డ్వాక్రా మహిళల పిల్లల చదువు కోసం ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టింది. సెర్ప్ ఆధ్వర్యంలోని స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు ఇస్తారు. ఈ పథకానికి ఎన్టీఆర్ విద్యా సంకల్పంగా పేరు పెట్టాలని అధికారులు ప్రతిపాదించారు. ఇది కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులందరికీ వర్తిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు కూడా ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. స్త్రీనిధి నుంచి తీసుకున్న రుణాన్ని పిల్లల చదువు కోసమే ఉపయోగించాలి. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం కొనుగోలు చేయొచ్చు. సాంకేతిక విద్యకు కూడా ఈ డబ్బును ఉపయోగించవచ్చు. ఊరి నుంచి దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైకిల్ కొనుక్కోవడానికి కూడా అనుమతి ఉంది. డబ్బును దేనికోసం ఖర్చు చేశారో రసీదులు స్త్రీనిధి అధికారులకు ఇవ్వాలి.ఏపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు 4% వడ్డీకే రుణాలు ఇవ్వనుంది. స్త్రీనిధి బ్యాంకు ద్వారా రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం తీసుకోవచ్చు. పిల్లల చదువుకు భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. దీని ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్యనఅభ్యసించవచ్చు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలకు ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం స్త్రీనిధి డ్వాక్రా సభ్యులకు 11% వడ్డీతో రుణాలు ఇస్తోంది. అయితే, పిల్లల చదువు కోసం వడ్డీ రేటును తగ్గించారు. తల్లిదండ్రులు ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.డ్వాక్రా మహిళలు రుణాన్ని వాయిదాల రూపంలో చెల్లించవచ్చు. తీసుకున్న మొత్తాన్ని బట్టి కనీసం 24 నెలల నుంచి గరిష్టంగా 36 నెలల వరకు గడువు ఉంటుంది. ఈ పథకం కోసం ఏడాదికి రూ.200 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రుల చేతిలో డబ్బులు లేక బయట ఎక్కువ వడ్డీలకు తెచ్చి అప్పులపాలవుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం.. వారికి చేయూతగా నిలిచేందుకు కొత్త పథకాన్ని అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం ద్వారా పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందని భావిస్తున్నారుమరోవైపు రాష్ట్రంలో 138 అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు రూ.11.52 కోట్లు విడుదలకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. పీఎం జన్ మన్ పథకంలో భాగంగా .. ఒక్కో కేంద్రాన్ని రూ.12 లక్షలతో నిర్మించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజన ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందించేందుకు ఈ చర్యలు చేపట్టింది.

# రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

విజయవాడ, జూన్ 7, ఆంధ్రప్రదేశ్‌లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లను రాష్ట్రంలో ఆవిష్కరణ, స్టార్టప్‌లు, నైపుణ్య అభివృద్ధి, , ఉపాధి సృష్టిని ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్నారు. ఈ హబ్‌లు రాష్ట్రంలో సిలికాన్ వ్యాలీ తరహా ఇకోసిస్టమ్‌ను సృష్టించడానికి రూపొందించడానికి ప్లాన్ చేశారు. రాజమండ్రి బొమ్మూరు ప్రాంతంలో ఈ ఇన్నోవేషన్ హబ్ నిర్మాణం జరుగుతోంది. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురం వంటి ఇతర నగరాలతో పాటు రాజమండ్రి ఒక కీలక కేంద్రంగా ఎంపికైంది. ఈ హబ్‌ను ఈ నెలలోనే ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్, స్టార్టప్‌ల ప్రోత్సాహం కోసం ఈ హబ్ ఒక కేంద్రంగా పనిచేయనుంది. యువతకు నైపుణ్య శిక్షణ అందించడం, వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం , ఉపాధి అవకాశాలను సృష్టించడం ఈ హబ్ ప్రధాన లక్ష్యాలు. ఈ ప్రాజెక్టులో ×× గ్రీన్‌కో ఎనర్జీ , , అవంతి గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలు గవర్నింగ్ కమిటీలో భాగస్వాములుగా ఉన్నాయి. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం ద్వారా ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు. రాజమండ్రిని ఒక స్టార్టప్ కేంద్రంగా మార్చడంలో ఈ హబ్ కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. సెంటర్ నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక బాధ్యత కింద దిగ్గజ పారిశ్రామిక సంస్థలు నిధులు సమకూరుస్తాయి. వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, పోటీతత్వం వంటి వాటిలో ట్రైనింగ్ ఐ ఇస్తారు. పౌర సేవలందించే ప్రభుత్వ కార్యక్రమాలలోనూ ఆర్‌టీఐహెచ్ భాగస్వామ్యం అవుతుంది. భవిష్యత్తు టెక్నాలజీలైన క్వాంటమ్, ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ వంటి వాటిల్లో స్టార్ట్‌పలకు సహకారం అందిస్తుంది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లోనూ, ఆక్వా, మెరైన్ రంగాల్లోనూ సేవలు అందిస్తుంది. టెక్స్‌టైల్ ఇన్నోవేషన్, అపెరల్, ప్రత్యామ్నాయ ఫైబర్, ఇంధనం, క్లీన్‌టెక్, పునరుత్పాదక ఇంధన రంగాలు, లైఫ్‌సైన్స్, ఫార్మా అండ్ హెల్త్ రంగాలలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని ప్రభుతవం చెబుతోంది. పట్టణ రవాణా, సముద్ర రవాణా, సామాజిక వ్యాపారం, గ్రామీణ ఔత్సాహిక మహిళా పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు శిక్షణను ఇస్తుంది. ఏపీలో ఐదు సంవత్సరాల్లో 20,000 స్టార్టప్‌లను ఏర్పాటు చేస్తారు. ఇందులో తయారీ, సాంకేతిక వ్యవసాయం, టెక్స్‌టైల్స్, డిజిటల్, క్లీన్ ఎనర్జీ, ఆరోగ్య రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ఒక్కో స్టార్ట్‌పలోనూ రూ. 10 లక్షల నుంచి కోటి రూపాయల దాకా మొత్తంగా రూ. 1,000 కోట్ల పెట్టుబడులు సమీకరిస్తారు. ఈ స్టార్ట్‌పల్లో మహిళలకు, యువత, నైపుణ్యం కలిగినవారికి ప్రాధాన్యం ఇస్తారు. స్టార్ట్‌పలతో వచ్చే ఐదేళ్లలో లక్ష ఉద్యోగాలను కల్పించాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించుకుంది.

# ఆ పది మంది నేతలేనా....

విజయవాడ, జూన్ 7, అధికారంలో లేనప్పుడు గుర్తింపును నేతలు కోరుకుంటారు. ఈసారి అధికారంలోకి వస్తే ఖచ్చితంగా మంత్రి పదవి దక్కుతుందని భావిస్తారు. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉండగా యాక్టివ్ గా ఉన్న నేతలకు ఈసారి చంద్రబాబు కేబినెట్ లో ఎక్కువ మందికి అవకాశం దక్కిందంటారు. నిమ్మల రామానాయుడు, సవిత, హోంమంత్రి వంగలపూడి అనిత, డోలా బాల వీరాంజనేయ స్వామి, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్ లాంటి వారికి చంద్రబాబు మంత్రివర్గంలో అవకాశం ఇచ్చారు. వీరంతా కేవలం గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యాక్టివ్ గా ఉండి, అనేక కేసులు ఎదుర్కొనడమే కాకుండా తెగించి పోరాటం చేయడమే కాకుండా పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడాలనే ఈ అవకాశం ఇచ్చారు.. జర జాగ్రత్త పోరాడిన వారికి... సామాజికవర్గాలను కొంత తూకం పాటించినా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాడిన వారికి ఖచ్చితంగా అధికారంలోకి వస్తే ప్రాధాన్యత దక్కుతుంది. అది రాజకీయాలను గమనిస్తున్న వారికి ఎవరికైనా తెలుసు. కానీ వైసీపీలో మాత్రం నేతలు అలా యాక్టివ్ గా ఉండేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదు. అధికారంలోకి వచ్చినా తమకు మంత్రి పదవి అవసరం లేదన్న భావనలో ఉన్నట్లుంది. కొందరు మాత్రమే యాక్టివ్ గా ఉంటున్నారు. ఆర్కే రోజా, అంబటి రాంబాబు, పేర్ని నాని, కారుమూరి నాగేశ్వరరావు, గుడివాడ అమర్ నాథ్, భూమన కరుణాకర్ రెడ్డి లాంటి వాళ్లు మాత్రమే యాక్టివ్ గా ఉంటున్నారు. మిగిలిన వారు పెద్దగా కనిపించడం లేదు. అంతే కాదు పార్టీ పిలుపు నిచ్చిన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం మినహా వారి భాగస్వామ్యం అంతగా లేదు. నేతల పెర్ ఫార్మెన్స్ చూసి... ఇప్పుడ వైసీపీ అధినేత జగన్ ఈ విషయంలో ఒకింత సీరియస్ గానే ఉన్నారని తెలిసింది. అన్ని నియోజకవర్గాల నుంచి నేతల పెర్ ఫార్మెన్స్ పై నివేదికలను తెప్పించుకుంటున్నట్లు సమాచారం. ఇటీవల అంటే జూన్ 4వ తేదీన వైఎస్ జగన్ ఏపీ వ్యాప్తంగా వెన్నుపోటు దినంగా నిర్వహించాలని పిలుపు నిచ్చారు. కానీ అందులో కొందరు నేతలు అలా వచ్చి ఇలా వెళ్లారని తెలిసింది. కేవలం పది మంది వరకూ నేతలు మాత్రమే బాగా కష్టపడి కార్యకర్తలను సమీకరించడంలో కానీ, జనంలోకి తమ కార్యక్రమాన్ని తీసుకెళ్లడంలో సక్సెస్ అయ్యారని వైఎస్ జగన్ కు నివేదికలు అందినట్లు తెలిసింది. మిగిలిన వారు కొందరు అసలు కార్యక్రమంలో పాల్గొనకుండా తమ ముఖ్య అనుచరులచేత మమ అనిపించి ఫొటోలు కేంద్ర కార్యాలయానికి పంపినట్లు పసిగట్టారు.. దీంతో మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే ఈసారి కష్టపడిన నేతలకు మాత్రమే కేబినెట్ లో స్థానం కల్పించే అవకాశముందన్న ప్రచారం ఊపందుకుంది. అయినా నేతలు మాత్రం కేసులకు భయపడి బయటకు రావడం లేదు. 175 నియోజకవర్గాల్లో కేవలం ఇరవై నుంచి పాతిక నియోజకవర్గాల్లోనే నేతలు యాక్టివ్ గా ఉన్నట్లు వైసీపీ అధినేతజగన్ కు అందిన నివేదికలలో తేలిందని తెలిసింది. ఈ నివేదికలను చూసిన జగన్ కూడా ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేశారట. రాయలసీమ ప్రాంతంలో కూడా కొందరు నేతలు బయటకు రాకపోవడంపై జగన్ సీరియస్ గా ఉన్నట్లు తెలిసింది.

వారిని పిలిచి క్లాస్ పీకాలా? లేక ప్రత్యామ్నాయంగా మరొక నేతకు నియోజకవర్గ బాధ్యతలను అప్పగించాలన్న దానిపై ఆలోచిస్తున్నారని పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పారు.

# అనకాపల్లిలో నేతల ఎత్తులు

కాకినాడ, జూన్ 7, అనకాపల్లిలోనే అసలు కథంతా నడుస్తుంది. ఇక్కడ కూటమి పార్టీలకు చెందిన ముగ్గురు నేతల మధ్య పెద్దగా సఖ్యత లేనట్లు కనిపిస్తుంది. గత ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఆంధ్రప్రదేశ్ లో పోటీ చేశాయి. అయితే అనకాపల్లి విషయానికి వచ్చే సరికి శాసనభకు జనసేన నుంచి సీనియర్ నేత కొణతాల రామకృష్ణ పోటీ చేశారు. ఇక అనకాపల్లి పార్లమెంటు సభ్యుడిగా బీజేపీకి చెందిన సీఎం రమేష్ ఉన్నారు. ఇక టీడీపీ నుంచి కూడా దాడి వీరభద్రరావు వంటి నేత ఉన్నారు. ముగ్గురి నేతల మధ్య మాత్రం సమన్వయం లేనట్లు కనిపిస్తుందంటున్నారు. పార్టీ క్యాడర్ విషయంలోనూ ఒకింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాన్న ఫిర్యాదులు మూడు పార్టీల కేంద్ర కార్యాలయాలకు అందుతున్నట్లు తెలిసింది. విస్తుపోతున్న లీడర్లు ఎంపీగా ఉన్నప్పటికీ... అనకాపల్లి పార్లమెంటు సభ్యుడిగా సీఎం రమేష్ కడప నుంచి వచ్చి ఇక్కడ పోటీ చేసి కూటమికి వీచిన హవాతో గెలుపొందారు. ఆయన అనకాపల్లిలోనే పూర్తి స్థాయి రాజకీయాలు కేంద్రీకరించరు. ఆయన అనుచరులు అక్కడ పెత్తనం చేస్తున్నారని చెబుతున్నారు. సీఎం రమేష్ అప్పుడప్పుడు అనకాపల్లికి వస్తున్నప్పుడు మాత్రం అందరినీ కలుస్తూ ఆయన కూటమి పార్టీల నేతల మధ్య విభేదాలు లేకుండానే చేస్తున్నారు. కానీ ఆయన అనుచరులమని చెప్పుకునే కొందరు మాత్రం సీఎం రమేష్ పేరు చెప్పుకుని కొన్ని పనులు తీసుకోవడంతో పాటు సిఫార్సులు చేయడంలో ముందుండటంతో పాటు పదవుల విషయంలోనూ వారికే ప్రాధాన్యత దక్కుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి ఇక సీనియర్ నేత కొణతాల రామకృష్ణ అనకాపల్లి నుంచి జనసేన ఎమ్మెల్యేగా గెలిచారు. గత ఎన్నికలకు ముందు ఆయన వైసీపీలో చేరి టిక్కెట్ తెచ్చుకోగలిగారు. తర్వాత ఆయనకు కేబినెట్ లో చోటు దక్కలేదు. కొణతాల రామకృష్ణ అనకాపల్లి ఎమ్మెల్యే అయినప్పటికీ ఉత్తరాంధ్ర సమస్యలపై గతంలో ఎక్కువ ఫోకస్ పెట్టేవారు. ఉత్తరాంధ్రకు సాగు, నీరు అందించే ప్రాజెక్టును తీసుకు రావాలని కొంతకాలం ఉద్యమాన్ని కూడా నిర్వహించిన కొణతాల ఆయన ఎక్కువగా ఆ ప్రాంత సమస్యలపైనే ఫోకస్ పెట్టారట. అయితే కొణతాల రామకృష్ణ ఎక్కువగా విశాఖపట్నంలో ఉండటంతో అనకాపల్లిలో ఆయన ప్రధాన అనుచరులు హవా కొనసాగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అనేక పార్టీలు మారిన సీనియర్ నేత దాడి వీరభద్రరావు సయితం తనకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఎలాంటి పదవులు రాకపోవడంపై అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. అందుకు సీఎం రమేష్, కొణతాల రామకృష్ణ కారణమని ఆయన నమ్ముతున్నారు. సీఎం రమేష్ తో కాకపోయినా కొణతాల తో దాడి వీరభద్రరావు విభేదాలు ఈనాటివి కావు. దాడి వీరభద్రరావు బహిరంగంగానే కొణతాలపై విమర్శలు చేస్తుండటం, పార్టీ పదవులను కూడా టీడీపీ వారికి దక్కకుండా చేస్తున్నారని, చివరకు తమ కుటుంబాన్ని పక్కన పెట్టిన విషయంలోనూ కొణతాల ఉన్నారని దాడి వీరభద్రరావు అనుమానిస్తున్నారు. అందుకే మూడు పార్టీల నేతల మధ్య విభేదాలు అనకాపల్లిలో మూడు ముక్కలాటగాతయారైందంటున్నారు.

## ఢిల్లీని దాటేసిన బైర్ని హట్

షిల్లాంగ్, జూన్ 7, (న్యూస్ పల్స్) ప్రపంచంలోనే అత్యంత కలుషిత నగరంగా అందరూ భావించే ఢిల్లీ కాలుష్య నగరాల జాబితాలో రెండో స్థానంలో నిలిచింది. కజకిస్థాన్ లోని కరగండా మూడో స్థానంలో, ముల్లాన్ పూర్ (పంజాబ్) నాలుగో స్థానంలో, లాహోర్ (పాకిస్థాన్) ఐదో స్థానంలో నిలిచాయి.స్విస్ గ్రూప్ ఐక్యూఎయిర్ 2024 వార్షిక కాలుష్య నివేదిక ప్రకారం.. మేఘాలయలోని బైర్నిహాట్ ప్రపంచంలోనే అత్యంత కాలుష్య పట్టణంగా నిలిచింది. అయితే, భారతదేశ రాజధాని ఢిల్లీ ఈ జాబితాలో రెండవ స్థానంలో ఉంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి కూడా బైర్నిహాట్ ను వరుసగా రెండవ సంవత్సరం భారతదేశంలో అత్యంత కలుషితమైన పట్టణ ప్రాంతంగా ప్రకటించింది, ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ) 302 తో, దీనిని “చాలా పేలవమైన” కేటగిరీలో ఉంచింది.ఢిల్లీ తరచుగా అత్యంత కలుషితమైన నగరంగా భావించబడుతున్నప్పటికీ, ఇది రెండవ స్థానంలో ఉంది, తరువాత కజకిస్తాన్ లోని కరగండ మూడవ స్థానంలో ఉంది. భారతదేశంలోని పంజాబ్ లోని ముల్లాన్ పూర్ నాల్గవ స్థానంలో, పాకిస్తాన్ లోని లాహోర్ ఐదవ స్థానంలో ఉన్నాయి. పాకిస్థాన్ లోని దేరా ఇస్మాయిల్ ఖాన్ ఆరో స్థానంలో, చాద్ లోని నజామెనా ఏడో స్థానంలో, భారత్ లోని ఉత్తరప్రదేశ్ లో ఉన్న లోని పట్టణం ఎనిమిదో స్థానంలో ఉన్నాయి. న్యూఢిల్లీ తొమ్మిదో స్థానంలో, హర్యానాలోని ఫరీదాబాద్ 10వ స్థానంలో నిలిచాయి.2024లో ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల జాబితాలో పాకిస్థాన్ లోని ముల్తాన్ 11వ స్థానంలో, పెషావర్ 12వ స్థానంలో, ఫైసలాబాద్ 13వ స్థానంలో నిలిచాయి. పాకిస్థాన్ లోని సియాల్ కోట్ 14వ స్థానంలో ఉంది. హర్యానాలోని గురుగ్రామ్, రాజస్థాన్లోని శ్రీ గంగానగర్ వరుసగా 15, 16 స్థానాల్లో నిలిచాయి. చైనాలోని హోతాన్ 17వ స్థానంలో నిలవగా, గ్రేటర్ నోయిడా (ఉత్తరప్రదేశ్), భివాడి (రాజస్థాన్) 18, 19 స్థానాల్లో నిలిచాయి. ఉత్తరప్రదేశ్ లోని ముజఫర్ నగర్ 20వ స్థానంలో నిలిచింది.రాజస్థాన్ లోని హనుమాన్ గఢ్ 21వ స్థానంలో, ఉత్తరప్రదేశ్ లోని నోయిడా 22వ స్థానంలో నిలిచాయి. పాకిస్థాన్ లోని పిండి భటియన్ 23వ స్థానంలో, బల్లాబ్ గఢ్ (హర్యానా), మండి గోవింద్ గఢ్ (పంజాబ్ ) వరుసగా 24, 25 స్థానాల్లో నిలిచాయి. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా 26వ స్థానంలో, హర్యానాలోని బహదూర్ గఢ్ 27వ స్థానంలో నిలిచాయి. బంగ్లాదేశ్ లోని శ్రీపూర్ 28వ స్థానంలో, పాకిస్థాన్ లోని చార్సద్దా29వ స్థానంలో నిలిచాయి

# శత్రువులు ఎక్కడో ఉండరు...

# టీడీపీ నేతలకు పక్కలో బల్లెంగా నేతలు

గుంటూరు, జూన్ 7, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుంది. ఈ ఏడాదిలోనే తెలుగుదేశం పార్టీకి చెందిన అనేక మంది కార్యకర్తలు, నేతలు హత్యకు గురయ్యారు. అయితే అనేకచోట్ల టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు ఈ హత్యలకు కారణమని గుర్తించారు. ప్రకాశం జిల్లాలో వీరయ్య చౌదరి హత్య కేసును పరిశీలించినా, తర్వాత జరిగిన పల్నాడు జంట హత్య కేసులను చూసినా.. తర్వాత తాజాగా అనంతపురంలో టీడీపీ నేత సుధాకర్ నాయుడు హత్యకు కుట్ర కోణం పరిశీలించినా వీటి వెనక ఒకే పార్టీకి చెందిన నేతలుండటం విశేషం. ఆధిపత్య పోరు, అనేక విషయాల్లో భాగస్వామ్యం మధ్య తలెత్తిన విభేదాలు వంటివి ఈ ఘటనలకు కారణాలుగా చెబుతున్నారువీరయ్య చౌదరి హత్యను పరిశీలిస్తే మద్యం, ఇసుకతో పాటు అనేక కాంట్రాక్టు పనులకు తమకు అడ్డుతగులుతున్నారని సొంత సామాజికవర్గానికి చెందిన టీడీపీ నేతలే హత్యచేయించారు. పల్నాడు జంట హత్యలు చేసింది కూడా టీడీపీ నేతలే. అయితే దీని వెనక వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు అతని సోదరుడు ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ జంట హత్యలకు పాల్పడింది మాత్రం టీడీపీకి చెందిన వారే కావడం విశేషం. ఇక తాజాగా అనంతపురంలో సుధాకర్ నాయుడును హత్య చేయడానికి భారీ స్కెచ్ వేశారు. దీని వెనక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరులు ఉన్నారన్న ఆరోపణలు బలంగా వినిపించడంతో అధినాయకత్వం కూడా సీరియస్ అయింది.గత ఎన్నికల్లో ప్రభాకర్ చౌదరిని కాదని దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ కు అధినాయకత్వం టిక్కెట్ ఇచ్చింది. కూటమికి గత ఎన్నికలలో ఫుల్లు హవా రావడంతో దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ఎన్నికయ్యారు. మొన్నటి ఎన్నికల్లో దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ గెలుపు కోసం సుధాకర్ నాయుడు తీవ్రంగా శ్రమించారు. సుధాకర్ నాయుడుకు కూడా దగ్గుబాటి ప్రసాద్ ఎన్నికల సమయంలో ప్రాధాన్యత ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. ఇద్దరూ టీడీపీ నేతలే కావడంతో పెద్దలకు ఈ సమాచారాన్ని పోలీసులు అందించారు. సుధాకర్ నాయుడును ఎస్పీ జగదీశ్ పిలిచి విచారించారు.సుధాకర్ నాయుడును హత్య చేసేందుకు ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ అనుచరులు ప్లాన్ చేశారని పోలీసులు రహస్యంగా విచారణ జరిపి నివేదిక పంపారు. దీంతో ఇద్దరు టీడీపీ నేతలు కావడంతో పాటు ఇద్దరి నేతల అవసరం పార్టీకి ఉండటంతో టీడీపీ నాయకత్వం అమరావతికి రావాలని పిలిచినట్లు తెలిసింది. ఇద్దరిలో ఎవరిది తప్పు అన్నది తేల్చి క్లాస్ పీకే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాణాలు తీసుకునేంత స్థాయిలో విభేదాలు ఎందుకు వస్తున్నాయన్న దానిపై ప్రస్తుతం టీడీపీ నాయకత్వం దృష్టి పెట్టింది. ఇసుక, మద్యం వ్యాపారాలతో పాటు మరికొన్ని కాంట్రాక్టు పనుల విషయంలోనే వివాదాలు పెరిగి అవి కక్ష పెంచుకునేందుకు దారి తీస్తున్నాయని భావించిన అధినాయకత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి పరిస్థితులు ఉన్న చోట్ల ముందు జాగ్రత్తలు తీసుకుని నేతల మధ్య విభేదాలను తొలగించే బాధ్యతను ఇన్ చార్జి మంత్రులకు అప్పగించే అవకాశముంది.


# బిల్డర్లకు అదిరిపోయే గుడ్ న్యూస్

నెల్లూరు, జూన్ 7, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారాభివృద్ధి కోసం బిల్డర్లకు బంపరాఫర్ ప్రకటించింది. బహుళ అంతస్తులకు సంబంధించిన డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ ఛార్జీలను బిల్డర్లు ఇకపై వాయిదా పద్ధతిలో చెల్లించే అవకాశం కల్పించింది. ఇంపాక్ట్ ఫీజు, లేబర్‌సెస్ వంటివి విడతలవారీగా వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ ఛార్జీలను కూడా ఇదే పద్ధతిలో చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. దీనికి సంబంధించి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.ఏపీ ప్రభుత్వం రూ.15 లక్షలలోపు ఫీజులైతే ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది.. రూ.15 లక్షల నుంచి రూ.75 లక్షలలోపు ఫీజు 12 నెలల్లో నాలుగు విడతలుగా చెల్లించాల్సి ఉంటుంది.. 12% వడ్డీ ఉంటుంది. అలాగే రూ.75 లక్షలపైన ఉంటే 24 నెలల్లో 8 వాయిదాల్లో 12% వడ్డీతో సమాన వాయిదాల్లో చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బహుళ అంతస్తుల నిర్మాణ ప్రాంతంలో ఇప్పటివరకూ 10% పుర, నగరపాలక సంస్థలకు తనఖా పెడుతున్నారు.. ఇకపై 15 శాతానికి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఒకేసారి ఛార్జీలను చెల్లించాల్సి రావడం తమకు ఆర్థికంగా ఇబ్బంది అవుతోందని.. ఈ రుసుముల్ని వాయిదా పద్ధతిలో జమ చేసే అవకాశం కల్పించాలని ఇటీవల ప్రభుత్వాన్ని బిల్డర్లు రిక్వెస్ట్ చేసింది. వెంటనే ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకుంది. ఛార్జీల పెంపుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్ స్వాగతించారు, హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బహుళ అంతస్థుల యజమానులకు ఊరట దక్కనుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్, బిల్డర్ల కోసం కీలక నిర్ణయాలు తీసుకుంది. భవన నిర్మాణాలతో పాటుగా పన్నుల చెల్లింపుల విషయంలో కొన్ని వెసులుబాటు కల్పించారు. తాజాగా రుసుముల చెల్లింపుల విషయంలో కూడా వెసులుబాటు కల్పించారు. బిల్డర్లు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఆనందంలో ఉన్నారు..

# 5 లక్షల మందితో యోగా

విశాఖపట్టణం, జూన్ 7,జూన్ 21వ తేదీన ప్రధాని మోదీ ఆధ్వర్యంలో విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు ఏపీ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అక్కడ ఒకేరోజు 5 లక్షల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లక్ష్యంగా ఈవెంట్ చేపట్టనున్నారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజును భారీ స్థాయిలో యోగా కార్యక్రమాలను చేపట్టనుంది. విశాఖలో నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకానున్నాయి. ఒక్క విశాఖలోనే ఒకే రోజు 5 లక్షల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది లక్ష కేంద్రాల్లో యోగా సాధన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ఉంది. 25 లక్షల మందికి యోగా సర్టిఫికెట్లు అందజేయాలని భావిస్తోంది. ఇదే విషయాన్ని తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. యోగా మన జీవితంలో భాగం కావాలని? ఆయుష్ ద్వారా యోగాను ప్రతి ఒక్క ఇంటికి చేర్చేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. లక్ష కేంద్రాల్లో యోగా సాధన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా యోగా అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారు. విశాఖపట్నంలోని ఆర్‌కె బీచ్ నుండి భీమిలి బీచ్ వరకు జరిగే యోగా ప్రదర్శనలో భారీ ఎత్తున ప్రజలు భాగస్వాములవుతారని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రధాన కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.యోగాంధ్ర కార్యక్రమంలో 2 కోట్ల మందిని భాగస్వాములను చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం పేర్ల నమోదు కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటికే కోటిపైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 నాటికి 2 కోట్ల లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

# నేడు ప్రపంచ సముద్ర దినోత్సవం




ప్రతి సంవత్సరం జూన్ 8న ప్రపంచవ్యాప్తంగా సముద్ర దినోత్సవాన్ని నిర్వహిస్తారు. సముద్ర రక్షణ గురించి ప్రజల్లో అవగాహన పెంచడంకోసం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.1992లో బ్రెజిల్ లోని రియో డి జనీరోలో జరిగిన ధరిత్రి సదస్సులో సముద్రాలమీద కూడా అవగాహన పెంచడంకోసం ప్రతి ఏటా సముద్ర దినోత్సవం జరపాలని కెనడా ప్రతిపాదించగా, దాని ప్రకారం కొన్ని ఐరోపా దేశాలు నామమాత్రంగానే సాగర దినోత్సవాన్ని నిర్వహించాయి. 2005లో సునామీ వచ్చినపుడు జరిగిన అనర్థాలను దృష్టిలో ఉంచుకొని ఐక్యరాజ్యసమితి 2008, జూన్ 8న తొలిసారిగా ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని నిర్వహించింది. సముద్రంలో దొరికే వివిధ రకాల వస్తువుల సేకరణ, బీచ్, ఒడ్డును కాపాడుకోవడం, స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి బీచ్‌ను శుభ్రం చేయడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం, ప్రతి ఒక్క దేశం, ప్రతి ఒక్కరూ సాగరశాస్త్రానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని పెంచుకోవడం,సముద్రాలను కాపాడుకునే దిశగా ప్రపంచ దేశాలు తమ విధానాలు నిర్ణయించుకోవడం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

# నేటి నుండి మృగశిర కార్తె ప్రారంభం

## -మృగశిర కార్తె రోజు చేపలు ఎందుకు తింటారో తెలుసా..? -అసలు కారణం ఏమిటి..?



జూన్ 8 నుంచి మృగశిర కార్తె ప్రారంభం కానుంది. ఈ కార్తె రోజు ప్రతి ఇంట్లో చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. దీని వెనుక ఆరోగ్య రహస్యం దాగివుంది. రోళ్లు పగిలే ఎండలను మోసుకొచ్చిన రోహిణికార్తె ముగిసి.. చల్లబరిచే మృగశిర మొదలవుతుంది. మృగశిర కార్తె అంటే.. ఆశ్విని మొదలుకుని రేవతి వరకూ మనకున్న 27నక్షత్రాల్లో సూర్యుడి ప్రవేశం ఆధారంగా కార్తె నిర్ణయం జరుగుతుంది. భారతీయ జ్యోతిష సాంప్రదాయం ప్రకారం.. ఒక్కో కార్తెలో ఒక్కో విధంగా ప్రకృతిలో మార్పులు జరుగుతుంటాయి. ఈ క్రమంలో సూర్యుడు మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించి నాటి నుంచి నైరుతి రుతుపనాలు వస్తాయి. వాతావరణం ఒక్కసారి చల్లబడటం, ప్రకృతిలో అనేక మార్పులు చోటు చేసుకునే నేపథ్యంలో అనేక రకాల చెడు సూక్ష్మక్రిములు వంటివి పునురుత్పత్తి అవుతాయి. మానవునిలో రోగ నిరోధకశక్తి తగ్గి జ్వరం, దగ్గు, శ్వాస సంబంధ వ్యాధులు వస్తాయి. మృగశిర కార్తెలో చేపలు తినడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. ఇది శాస్త్రీయంగా నిరూపించబడింది. చేపలు తినడం వల్ల ముఖ్యంగా గుండె జబ్బులు, ఆస్తమా, మధుమోహ వ్యాధి ఉన్న వారు, గర్భిణులు ఈ సమయంలో చేపలు తింటే ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఈ నేపథ్యంలో మనిషి శరీరంలో మార్పులు జరిగి వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. గుండెజబ్బులు, ఆస్తమా తదితర ఆనారోగ్యసమస్యలు ఉత్పన్నమవుతాయి. వీటన్నింటికి అడ్డుకట్ట వేయాలంటే చేపలు తినాల్సిందే. అసలు మృగశిర కార్తెకు ఉన్న సంబంధం ఏమిటి..?వ్యాధుల నియంత్రణకు చేపలు మృగశిర కార్తె రోజు చేపలు ఎందుకు తింటారో తెలుసా..? రోకండ్లను సైతం పగులగొట్టే ఎండలు తగ్గిపోతాయి. వర్షాలు మొదలవుతాయి. 15 రోజుల పాటు ఈ కార్తె ఉంటుంది. మృగశిర కార్తె చేపలు తినడాన్ని మన పూర్వీకుల నుంచి ఆనాదిగా వస్తోంది. ఎండకాలం తర్వాత వాతావరణం చల్లబడటంతో మన శరీరంలో ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఈ క్రమంలో వేడి ఉండేందుకు చేపలను తింటారు. దీని వల్ల గుండె జబ్బులు, ఆస్తమా రోగులకు ఉపశమనం కలుగుతుంది. ఇదేకాక ఈ సీజన్‌లోచాలా మందికి జీర్ణశక్తితోపాటు రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంటుంది. జ్వరం, దగ్గు బారిన పడతారు. ఇలాంటి నుంచి గట్టెక్కాలంటే చేపలు తినాల్సిందే.పూర్వీకులు శాఖాపరమైన ఇంగువను బెల్లంలో కలుపుకొని ఉండలు.. ఉండలుగా చేసుకుని తినేవారు. మాంసాహారులైతే చేపలను ఇంగువలో, చింత చిరుగులో పెట్టుకుని తినేవారు. ఈ రోజు ఏ ఇంటా చూసినా చేపల పులుసే. చేపల కూర వంటకాలే కనిపిస్తుంటాయి. పులుసో, ఫ్రై చేసుకుని ఖచ్చితంగా తింటుంటారు. చేపలలో పోషకాలు: చేపలలో ఎన్నో పోషకాలున్నాయంటున్నారు వైద్య నిపుణులు. చేపలలో అనేకమైన మాంసకృతులతో పాటు శరీరానికి మేలు చేసే గుణాలు ఎన్నో ఉన్నాయి. కాల్షియం, పాస్పరస్, ఐరన్, మెగ్నీషియం, కాపర్, జింక్ వంటి ఖనిజ పోషకాలు ఎన్నో లభిస్తాయి. చేపలు కొవ్వులు చాలా సులభంగాజీర్ణమై శక్తిని అందిస్తాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎవరైనా తినవచ్చు. చేపల్లో ఉన్న కొవ్వు మన శరీరంలో రక్త పీడనంపై మంచి ప్రభావం చూపుతాయి. ఓమేగా 3 కొవ్వు ఆమ్లాలలో డీహెచ్ఏ, ఈపీఏ వంటివి కంటి చూపునకు ఎంతో మేలు చేస్తాయి. అలాగే జ్ఞాపకశక్తిని కూడా పెంచుతాయి. చేపల్లో బీ12 విటమిన్, రైబోఫ్లవిన్, నియాసిన్, బయెటిక్, థయామిన్ తదితర విటమిన్లు లభిస్తాయి. సముద్ర చేపల కాలేయంలో విటమిన్ఏ,డీ, ఈ వంటి విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. చేపలు గుండెకు సంబంధిత వ్యాధులకు, ఆస్తమా, షుగర్ వ్యాధి గ్రస్తులకు మంచి ఆహారంగా పని చేస్తుంది. ముఖ్యంగా గర్భిణులు, పిల్లల తల్లులకు ఎంతో మేలు. పిల్లల్లో జ్ఞాపకశక్తి, నాడీ వ్యవస్థ అభివృద్ధి చేస్తాయి చేపలు. మన రాష్ట్ర చేపల్లో కొర్రమీనులో లభించే ఆరాఖిడోనిక్ ఆమ్లం ఉంటుంది. ఇది గాయాలైనప్పుడు రక్తం తొందరగా గడ్డకట్టించే స్వభావం ఉంటుంది. దేశీయ మార్పు చేపల్లో ఐరన్, కాపర్ వంటి ఖనిజ పోషకాలు ఎన్నో లభిస్తాయి. మృగశిర కార్తె రోజు చేపలను ఏ రూపంలో తిన్నా మన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. మృగశిర కార్తెలో చేపలు తినడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. ఇది శాస్త్రీయంగా నిరూపించబడింది. చేపలు తినడం వల్ల ముఖ్యంగా గుండె జబ్బులు, ఆస్తమా, మధుమోహ వ్యాధి ఉన్న వారు, గర్భిణులు ఈ సమయంలో చేపలు తింటే ఎంతో ప్రయోజనం ఉంటుంది. శాఖాహరులు మాత్రం ఇంగువను బెల్లంలో కలిపి గుండ్రని గోళిలాగ చేసి దేవుని దగ్గర పెట్టి దండం పెట్టుకుని కుటుంబ సభ్యులందరు అన్ని వయస్సులవారు తప్పక తింటారు.ఈ అయుర్వేద ప్రక్రియ వలన శరీరం బలంగా ఉంచుతూ, రోగనిరోధక శక్తిని ప్రసాదిస్తుంది.

## రైతులకు అండగా పతంజలి

ముంబై,జూన్ 7, (న్యూస్ పల్స్)భారతదేశపు ప్రసిద్ధ స్వదేశీ సంస్థ, పతంజలి ఆయుర్వేద్ రైతులకు మద్దతు ఇవ్వడంలో , గ్రామ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇది సేంద్రీయ వ్యవసాయాన్నిప్రోత్సహించడమేకాకుండా న్యాయమైన వాణిజ్యం ద్వారా రైతుల జీవితాలను మెరుగుపరుస్తోంది. పతంజలి తన 'కిసాన్ సమృద్ధి కార్యక్రమం' రైతులకు సేంద్రీయ ఎరువులు, మంచి నాణ్యమైన విత్తనాలు ,తెగులు నియంత్రణ పద్ధతులను అందిస్తోందని కంపెనీ ప్రకటించింది. ఇది భూమి సారాన్ని పెంచుతుంది. పర్యావరణానికి హాని కలిగించదు. పతంజలి ఆయుర్వేద సంస్థ సేంద్రీయ వ్యవసాయం మరియు న్యాయమైన వాణిజ్యం ద్వారా రైతులకు సాధికారత కల్పిస్తోందని పేర్కొంది. దాని వినూత్న పరిష్కారాలు , డిజిటల్ సాధనాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని చెబుతున్నారు.పతంజలి వాణిజ్య నమూనా రైతులకు వారి పంటలకు మంచి ధర వచ్చేలా చూస్తుంది. మధ్యవర్తులను తొలగించడం ద్వారా , రైతుల నుండి నేరుగా కొనుగోలు చేయడం ద్వారా, కంపెనీ వారి ఆదాయాన్ని పెంచడంలో సహాయపడుతుంది. అదనంగా, పతంజలి కాంట్రాక్ట్ వ్యవసాయ పథకం రైతులకు ఆర్థిక భద్రతను అందిస్తుంది. ఇది రైతులకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా గ్రామాల్లో ఉపాధి , అభివృద్ధిని కూడా ప్రోత్సహిస్తుంది." అని పతంజలి సంస్థ ప్రకటించింది.పతంజలి టెక్నాలజీ రంగంలోకి కూడా అడుగుపెట్టింది. భూమి, వాతావరణ నవీకరణలు , మార్కెట్ ధరల గురించి సమాచారాన్ని అందించే రైతుల కోసం డిజిటల్ అప్లికేషన్‌లను అభివృద్ధి చేసింది. ఈ సాధనాలు రైతులు తమ వ్యవసాయ పద్ధతులను మెరుగుపరచుకోవడానికి , మార్కెట్‌లో పోటీతత్వాన్ని కొనసాగించడానికి సహాయపడతాయి. పతంజలి జైవిక్ ప్రోమ్ వంటి ఉత్పత్తులు భూసారాన్ని పెంచుతాయి. అన్ని రకాల పంటలకు ఉపయోగపడతాయి." అని కంపెనీ ప్రకటించింది. పతంజలి చేసిన ఈ ప్రయత్నం వ్యవసాయాన్ని మారుస్తోంది. పర్యావరణాన్ని కూడా కాపాడుతోంది. దాని పథకాలు రైతులకు వారి సామాజిక బాధ్యతలను నెరవేరుస్తూనే ఆర్థిక ప్రయోజనాలను అందిస్తున్నాయి. ఈ విధంగా, పతంజలి కొత్త పద్ధతులు , న్యాయమైన వాణిజ్య పద్ధతులు భారతీయ వ్యవసాయాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తున్నాయి" అని కంపెనీ పేర్కొంది.

## భూ భారతిలో భూ మిత్ర ఆప్షన్

నల్గోండ జూన్ 7 తెలంగాణలో భూ భారతి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు మండలాల్లో సేవలు ప్రారంభమయ్యాయి. అయితే ఈ కొత్త పోర్టల్ లో 'భూమిత్ర' అనే కొత్త సర్వీస్ అందుబాటులోకి వచ్చింది. రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.తెలంగాణలో వ్యవసాయ భూముల నిర్వహణకు భూ భారతి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు మండలాల్లో ఈసేవలు ప్రారంభమయ్యాయి. దీని ఆధారంగానే రిజిస్ట్రేషన్ల ప్రక్రియతో పాటు పలు సేవలు అందుతున్నాయి.తాజాగా ఈ పోర్టల్ కు సంబంధించి ప్రభుత్వం మరో కొత్త అప్డేట్ ఇచ్చింది. పోర్టల్ లో భూ మిత్ర ఆప్షన్ అందుబాటులోకి వచ్చినట్లు తెలిపింది. ఈ ఆప్షన్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సేవలను పొందవచ్చు.ఆ ఆప్షన్ ద్వారా? భూ భారతిలో యూజర్లు అడిగే ప్రశ్నలకు అప్పటికప్పుడు సమాధానమిచ్చేలా ఈ చాట్ బాట్ పని చేస్తుందని ప్రభుత్వం తాజాగా వెల్లడించింది.రైతులు ప్రాథమికంగా ఇచ్చే వివరాలతో సరైన సమాచారం ఇవ్వడానికి ఈ భూ మిత్ర ఉపయోగపడుతుందని ప్రభుత్వం వెల్లడించింది. హెల్ప్ డెస్క్ కింద ఈ చాట్‌బాట్(భూ మిత్ర)ను వినియోగించనున్నారు.ప్రాసెస్ ఇలా?.

ఈ సేవలను పొందటానికి ముందుగా ష్టbిబిజూబ://ఎష్ట్రబీఎష్ట్రజీతీజీబితి.బివశ్రీజీనిణజీనిజీ.ణనీల (తెలంగాణ భూ భారతి) వెబ్ సైట్ లోకి వెళ్లాలి. హోం పేజీలో చివర్లో కనిపించే భూమిత్ర ఆప్షన్ పై క్లిక్ చేయాలి. ప్రాథమికంగా ఇక్కడ కొన్ని ప్రశ్నలు ఉంటాయి.. అవి కాకుండా ఇంకా ఏమైనా ప్రశ్నలు కూడా అడగొచ్చు. టైప్ చేసి సెండ్ చేస్తే? వెంటనే మీకు రిప్లే వస్తుంది. తద్వారా భూముల వివరాలు, లావాదేవీల నిర్వహణలో వచ్చే సందేహాలను నివృత్తి చేసే అవకాశం ఉంటుంది.ఇక తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి పోర్టల్ లో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, ఆర్ఓఆర్ కరెక్షన్, నాలా, అప్పీల్, భూముల వివరాలు, భూముల మార్కెట్ విలువ, నిషేధిత భూములు, ఈ చలాన్ అప్లికేషన్ స్టేటస్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ వివరాలను తెలుసుకునే సేవలు అందుబాటులో ఉండేలా రూపకల్పన చేశారు. వీటి ఆధారంగా సులభంగా భూ వివరాలను పొందవచ్చు.భూ భారతి పోర్టల్ సమస్యలు, విచారణ కోసం టోల్ ఫ్రీ నెంబర్ ను తెలంగాణ సర్కార్ అందుబాటులోకి తీసుకువచ్చింది. పోర్టల్ లో తలెత్తే సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు వీలుగా 9140 - 29313999 నెంబర్ ను ప్రారంభించింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య భూ భారతి టోల్ ఫ్రీ నెంబర్ సేవలను పొందవచ్చు.

## భక్తిశ్రద్దలతో బక్రీద్ ప్రార్ధనలు

కడప త్యాగం, కరుణ, సహనాన్ని చాటిచెప్పే బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు కడప జిల్లా వ్యాప్తంగా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దీంతో జిల్లాలో ఉండే ఈద్గా మొత్తం ముస్లిం సోదరులతో కిక్కిరిసి పోయాయి. కడప నగర శివారులోని రిమ్స్ సమీపంలో ఉన్న ఈద్గాలో ఈదుల్ ఆదా నమాజు, ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. తరువాత ముస్లిం సోదరులు ఒకరిని ఒకరు ఆలింగణం చేసుకుని, ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

# జీడీపీ సరే.. జీవన ప్రమాణాల సంగతేంటీ

భారతదేశం 4 ట్రిలియన్ల డాలర్ల జిడిపి మార్క్‌ను దాటి, జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఇది గొప్ప విజయమని వేడుక చేసుకుంటున్నారు. కానీ నిశితంగా పరిశీలిస్తే ఆనందాన్ని తగ్గించే ముఖ్యమైన ఆర్థిక సవాళ్లు వెల్లడవుతాయి. ఈ వృద్ధి చేరిక గురించి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. తక్కువ తలసరి జిడిపి ద్వారా దెబ్బతిన్న మైలురాయి భారతదేశం మొత్తం జిడిపి 1.4 బిలియన్లకు పైగా ఉన్న, అధిక జనాభాను ప్రతిబింబిస్తున్నప్పటికీ, దాని తలసరి జిడిపి వేరే కథను చెబుతుంది. భారతదేశం 2,878 డాలర్ల వద్ద ఉంది. జపాన్ 33,138 డాలర్లు, యుకె 55,000 డాలర్లు కంటే చాలా వెనుకబడి ఉంది. ఈ స్పష్టమైన అసమానత ఆర్థిక వృద్ధి ప్రయోజనాలు సగటు పౌరుడికి చేరడం లేదని, వ్యక్తిగత శ్రేయస్సు కోట్లాది మందికి అందుబాటులో లేదు. రైతాంగం, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగస్థులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారుఆర్థికమాంద్యం సంకేతాలు ఇటీవల డేటాని పరిశీలిస్తే ఆందోళనకరమైన చిత్రాన్ని చిత్రీకరిస్తుంది. గృహ పొదుపులు ఫైనాన్షియల్ ఇయర్ 2020లో 11.61 లక్షల కోట్ల నుంచి ఫైనాన్షియల్ ఇయర్ 25లో 6.52 లక్షల కోట్లకు పడిపోయాయి. ఇది తగ్గిన ఆర్థిక భద్రతను సూచిస్తుంది. ఫైనాన్షియల్ ఇయర్ 25 లో బంగారంపై రుణాలు 71% పెరుగుదల చాలా మంది భారతీయులు ప్రాథమిక అవసరాలను తీర్చడానికి ఆస్తులు రద్దు చేస్తున్నారు అని సూచిస్తుంది. వినియోగదారు మార్కెట్ కూడా ఇబ్బందిపడుతున్నాయి. ఫైనాన్షియల్ ఇయర్ 2025లో ఆటో అమ్మకాలు 6% స్వల్పంగా పెరిగాయి. ద్విచక్ర వాహనం, వినియోగ వస్తువులు (ఎఫ్ఎంసిజి) అమ్మకాలలో మందగమనంతోపాటు, బలహీనమైన డిమాండ్‌ను సూచిస్తున్నాయి. ఆర్థిక బాధ, మానవ నష్టం ఈ సవాళ్ల మానవ నష్టం ఆందోళనకరమైనదిఆర్థిక సంక్షోభం రోజుకు 19 ఆత్మహత్యలతో ముడిపడి ఉంది. ప్రతి గంటకు ఇద్దరు రైతులు తమ ప్రాణాలను బలిగొంటారు. ఈ గణాంకాలు వ్యవసాయంలో లోతుగా పాతుకుపోయిన సమస్యలను విస్తృతమైన ఆర్థిక ఒత్తిడిని సూచిస్తున్నాయి. అప్పు, నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి లక్ష్యంగా చేసుకున్న జోక్యాల అవసరాన్ని నొక్కిచెబుతున్నాయి. మధ్యతరగతి పోరాటాలు, తక్కువ వేతనాలు భారతదేశ మధ్యతరగతి, తరచుగా ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌గా పరిగణించబడుతుంది. తీవ్ర ఒత్తిడిలో ఉంది. సగటు మధ్య తరగతి ఆదాయం సంవత్సరానికి రూ. 2.6 లక్షలు (నెలకు రూ. 22,000). ఇది 1820లో వలస రాజ్యాల ముందు భారతదేశంతో పోల్చదగిన స్థాయి. ద్రవ్యోల్బణంతో కలిసిన ఈ స్తబ్దత కొనుగోలు శక్తిని తగ్గించింది. అదనంగా, భారతదేశం సగటు గంట వేతనం ప్రపంచవ్యాప్తంగా ఐదవ అత్యల్ప స్థానంలో ఉంది. ఇది నైపుణ్యం కలిగిన, నైపుణ్యం లేని కార్మికులను తక్కువ ఆదాయ చక్రంలో బంధిస్తుంది. వ్యవస్థాగత సమస్యలు కఠినమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.ఆర్థిక కథనం వ్యవస్థాగత సవాళ్లతో మరింత క్లిష్టంగా ఉంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద ఉద్యోగాలకు పెరుగుతున్న డిమాండ్ గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర నిరుద్యోగాన్ని సూచిస్తుంది. జనాభాలో దాదాపు 60% మంది 800 మిలియన్లకు పైగా భారతీయులకు ప్రభుత్వం ఉచిత రేషన్ పంపిణీ విస్తృతమైన పేదరికం, ఆహార అభద్రతను హైలైట్ చేస్తుంది. సమగ్ర వృద్ధికి పిలుపు భారతదేశంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం గర్వకారణం అయినప్పటికీ, జీవన ప్రమాణాలను మెరుగుపరచకపోతే జిడిపి పరిమాణం మాత్రమే ఖాళీ కొలమానం అని నిపుణులు తెలుపుతున్నారు. ప్రజల శ్రేయస్సులో పురోగతికి సరైన అర్థం ఉండాలి.దేశంలో కోట్లాది మంది ప్రాథమిక అవసరాల కోసం పోరాడుతుంటే, దేశం నాలుగవ పెద్ద ఆర్థిక వ్యవస్థ అయింది అని సంబరపడాలా?.విధాన నిర్ణేతలు సమగ్ర వృద్ధిని నిర్ధారించడం, నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించడం ఆదాయ అసమానతలను పరిష్కరించడం వంటి సవాలును ఎదుర్కొంటున్నారు. ఈ ప్రయత్నాలు లేకుండా, భారతదేశ ఆర్థిక మైలురాయి దాని పౌరుల వాస్తవాల నుండి డిస్‌కనెక్ట్ చేయబడిన గణాంకాలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజలకు విద్య, ఆరోగ్యం, ఆహారం, పర్యావరణం, మెరుగైన జీవనం, సాధికారత వైపు అడుగులు వేయకుండా కేవలం అంకెల గారడీ నమ్ముకొని సంబరపడితే తీవ్ర అనర్థాలకు దారితీస్తుంది. వాపును చూసుకొని బలమనుకుంటే అంతే సంగతి.

# 7,000 లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ లతో స్టార్‌లింక్

న్యూఢిల్లీ జూన్ 7, (న్యూస్ పల్స్) ఎలాన్ మస్క్ కంపెనీ స్టార్‌లింక్ భారత్ లో ఇంటర్నెట్ సేవలు అందించడానికి అవసరమైన లైసెన్స్ పొందింది. స్పేస్‌ఎక్స్ ద్వారా అందించే శాటిలైట్ ఇంటర్నెట్ , భారతదేశంలో శాటిలైట్ కమ్యూనికేషన్ (సాట్‌కామ్)సేవలను అందించడానికి భారత ప్రభుత్వం నుండి ఆమోదం పొందింది. స్టార్‌లింక్‌కు భారతదేశ టెలికమ్యూనికేషన్స్ విభాగం నుండి గ్లోబల్ మొబైల్ పర్సనల్ కమ్యూనికేషన్ బై శాటిలైట్ లైసెన్స్ లభించింది. ఇప్పటి వరకు ఇలాంటి లైసెన్స్ యూటెల్‌సాట్ వన్‌వెబ్ , జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్ కు మాత్రమే ఉన్నాయి.

స్టార్ లింగ్ ఈ లైసెన్స్ పొందిన మూడవ సంస్థ2025 మే 7న ఆనీ స్టార్‌లింక్‌కు లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ అయింది. భద్రతా నిబంధనలను, డేటా సెక్యూరిటీ, జాతీయ భద్రతా మార్గదర్శకాలను పాటించేందుకు స్టార్‌లింక్ హామీ ఇచ్చింది. మరికొన్ని షరతులను పూర్తి చేయడంతో పాటు ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ నుండి అదనపు అనుమతులు స్టార్ లింక్ పొందాల్సి ఉంటుంది. 2025 మార్చిలో, స్టార్‌లింక్ భా రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్ తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యాలు స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను పంపిణీ చేయడానికి నగర, గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ కవరేజ్‌ను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయి. జియో , ఎయిర్‌టెల్ తమ రిటైల్ స్టోర్‌లు , ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా స్టార్‌లింక్ సేవలను అందిస్తాయి, వీరి మార్కెట్ వాటా కలిపి భారత టెలికాం మార్కెట్‌లో 70 శాతం కంటే ఎక్కువ.స్టార్‌లింక్ సుమారు 7,000 లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్‌లను ఉపయోగిస్తుంది. అధిక-వేగం, తక్కువ లేటెన్సీ బ్రాడ్‌బ్యాండ్‌ను అందిస్తుంది.

సాంప్రదాయ జియోస్టేషనరీ శాటిలైట్‌లకు భిన్నంగా, ఒఖా శాటిలైట్‌లు 550 కి.మీ ఎత్తులో ఉంటాయి, లేటెన్సీని తగ్గిస్తాయి.మరియు స్ట్రీమింగ్, గేమింగ్, వీడియో కాన్ఫరెన్సింగ్ వంటి వాటికి ఈ ఇంటర్నెట్ బాగా ఉపయోగకరం. ఇది పూర్తి వైర్ లెస్.

సాంప్రదాయ బ్రాడ్‌బ్యాండ్ అందుబాటులో ఉండని గ్రామాలకు ఉపయోగపడుతుంది.స్టార్‌లింక్ కిట్ కొంటెనే ఇంటర్నెట్ కనెక్షన్ పెట్టించుకోగలరు. ఇందులో శాటిలైట్ డిష్, వై-ఫై రూటర్, కేబుల్స్, పవర్ సప్లై ఉంటాయి. ఈ కిట్ 30 నుంచి యాభై వేల వరకూ ఉంటుంది. నెలావారీ ఇంటర్నెట్ చార్జీలు కూడా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వైర్లు లేకుండా చిన్న శాటిలైట్ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందుతాయి. మరో ఏడాదిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది దేశంలో స్టార్ లింక్ సేవలు ప్రారంభించేందుకు అవసరమైన ట్రయల్ స్పెక్ట్రమ్‌ను దరఖాస్తు చేసిన 15 నుంచి 20 రోజుల్లోగా మంజూరు చేస్తామని టెలికాం శాఖ తెలిపింది. స్టార్ లింక్ ఇప్పటికే 125 దేశాల్లో సేవలను అందిస్తోంది. ప్రస్తుతం దేశంలో చాలావరకు సంప్రదాయ ఇంటర్నెట్ సేవలు వైర్ లెస్ లేదా ఫైబర్ కేబుల్స్ ఆధారంగా అందుతున్నాయి. ఇవి భూమికి సుదూరంగా భూ స్థిర కక్ష్యలో ఉండే ఉపగ్రహాలపై ఆధారపడి ఉన్నాయి. స్టార్ లింక్ సంస్థ తక్కువ ఎత్తులో ఉండే కక్ష్యలో ఉండే ఉపగ్రహాల ద్వారా ఇంటర్నెట్ సేవలను అందిస్తోంది.

ప్రస్తుతం స్టార్‌లింక్‌కు చెందిన 6వేల శాటిలైట్లు భూమికి 550 కిలోమీటర్ల ఎత్తులో పరిభ్రమిస్తున్నాయి. స్టార్‌లింక్ అందించే ఇంటర్నెట్ వేగంకూడా ఎక్కువగా ఉండనుంది. ప్రారంభంలో స్టార్‌లింక్ ఇంటర్నెట్ వేగం 100-200 ఓఃఖూ వరకు ఉంటుందని, భవిష్యత్తులో ఇది 600-700 ఓఃఖూ బ్యాండ్ విడ్త్‌తో అత్యధిక వేగాన్ని అందిస్తుందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

## 7500 మందిపై కత్తి...

న్యూయార్క్, జూన్ 7, (న్యూస్ పల్స్) ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, ఇరాక్, లిబియా, సోమాలియా, సూడాన్, సిరియా, యెమెన్ వంటి ముస్లిం దేశాల పౌరులపై నిషేధం విధించిన తర్వాత, నేపాల్ విషయంలో కూడా అమెరికా సంచలన నిర్ణయం తీసుకుంది.అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేపాల్‌కు ఇచ్చిన బహిష్కరణ రక్షణను రద్దు చేశారు. ఈ నిర్ణయం తర్వాత, ఇప్పుడు 7,500 మంది నేపాలీలు వెంటనే అమెరికాను విడిచి వెళ్ళవలసి ఉంటుంది.న్యూస్‌వీక్ కథనం ప్రకారం,నేపాల్‌లో పరిస్థితి ఇప్పుడు 2015లో ఉన్నట్లు లేదని, కాబట్టి దాని బహిష్కరణ రక్షణను రద్దు చేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం చెబుతోంది. నేపాల్‌లో భూకంపం కారణంగా అప్పటి అమెరికా ప్రభుత్వం నేపాలీ పౌరులకు ఈ రక్షణను అందించింది. అమెరికాలో దీనిని తాత్కాలిక రక్షిత స్థితి లేదా టిపిఎస్ అంటారు. దీనిలో, తమ దేశంలోని చెడు పరిస్థితుల దృష్ట్యా అమెరికాలోకి వెళ్లి నివసించాలనుకునే వారికి అమెరికా ప్రభుత్వం రక్షణ హామీ ఇస్తుంది.బహిష్కరణ రక్షణ కింద, ఇతర దేశాల ప్రజలకు పని చేసే హక్కు మాత్రమే ఉంటుంది. అంటే, వారికి పౌరసత్వం లభించదు. అయితే, ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే, ఇప్పుడు ఏ దేశానికీ అలాంటి రక్షణ ఇవ్వబడదని ఆయన సూచించారు. ఇదిలావుంటే, టిపిఎస్ కింద 7500 మంది నేపాల్ పౌరులు అమెరికాలో నివసిస్తున్నారు. దీనిని రద్దు చేసిన తర్వాత, వారు వెంటనే తమ దేశానికి తిరిగి రావాల్సి ఉంటుంది. లేకపోతే, అమెరికా ప్రభుత్వం వారిని బలవంతంగా నేపాల్‌కు తిరిగి పంపవచ్చు.2017లో అధ్యక్షుడైన తర్వాత డొనాల్డ్ ట్రంప్ దానిని అంతం చేయాలని కోరుకున్నారు. కానీ ఇమ్మిగ్రేషన్ విభాగం దానిని వ్యతిరేకించింది. ట్రంప్ చివరి వరకు దీనికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. కానీ విజయం సాధించలేకపోయారు. నేపాల్‌లో పరిస్థితి ఇప్పుడు అలాగే లేదని, కాబట్టి బహిష్కరణ రక్షణకు అర్థం లేదని ట్రంప్ పరిపాలన చెబుతోంది.రెండు రోజుల క్రితమే అమెరికా అధ్యక్షుడు 12 దేశాల ప్రజలను నిషేధించాలని నిర్ణయించారు. ఈ దేశాలలో ఉగ్రవాదం విజృంభిస్తోందని ట్రంప్ సర్కార్ చెబుతోంది. ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్ వంటి దేశాలు ట్రంప్ నిర్ణయంపై స్పందించకపోగా, చాడ్ ఖచ్చితంగా దీనికి వ్యతిరేకంగా పెద్ద నిర్ణయం తీసుకుంది. చాడ్ తన దేశంలోకి అమెరికన్ పౌరుల ప్రవేశాన్ని నిషేధించాలని నిర్ణయించింది. మన ఆత్మగౌరవాన్ని అమ్ముకుని అమెరికాతో మాట్లాడలేమని చాడ్ అధిపతి అంటున్నారు. ఖతార్ నుంచి అందుకున్న బహుమతి గురించి చాడ్ అధ్యక్షుడు ప్రస్తావించారు.

## హైదరాబాద్ చేరుకున్న కేటీఆర్

హైదరాబాద్ టిఆర్ఎస్ నేత మాజీ మంత్రి కేటీఆర్ లండన్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. పార్టీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోగ్యం క్షీణించడంతో అర్ధాంతరంగా తన పర్యటన ముగించుకొని వచ్చారు. ఇదే విషయం మీడియా వివరణ కోరగా వద్దులే అంటూ వెళ్లిపోయారు

# కవిత నెక్స్ట్ ఏంటీ...



హైదరాబాద్, జూన్ 7, కొన్ని రోజులుగా తాను అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా పట్టించుకోని కేసీఆర్..ఆయనకు మద్దతుగా ధర్నా చేశాక కచ్చితంగా స్పందిస్తారని కవిత భావించారట.ఒక్క లేఖ. బీఆర్ఎస్‌తో ఆమె బంధంపై సస్పెన్స్‌ను కంటిన్యూ చేస్తోంది. కవిత బీఆర్ఎస్‌లో ఉన్నారా.? వీడారా అన్నది తేలని ప్రశ్నగా ఉంది. ఇదే సమయంలో ఆమె పొలిటికల్ ఫ్యూచర్ కూడా డైలమాలో పడిందన్న టాక్ వినిపిస్తోంది. తన అసంతృప్తి గళంతో కేసీఆరే పిలిచి మాట్లాడుతారని ఊహించారట కవిత. కానీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందంటున్నారు. గులాబీ బాస్ కేసీఆర్ కవిత కామెంట్స్ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నారని టాక్. ఏదైనా సమస్య ఉంటే డైరెక్టుగా తన దగ్గరకు వచ్చి చెప్పి ఉంటే బాగుండేదని..లెటర్ రాసి రాద్ధాంతం క్రియేట్ చేసిందనే ఆగ్రహంతో ఉన్నారట గులాబీబాస్ కేసీఆర్.పార్టీలో లోటుపాట్లపై కేసీఆర్‌కు లేఖ రాసిన కవిత..తండ్రి కేసీఆర్ దేవుడని, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని కామెంట్స్ చేసి పెద్ద చర్చకు దారితీశారు. తాను కేసీఆర్‌కు రాసిన లేఖ ఎలా లీక్ అయ్యిందో తేల్చాలని పట్టుబట్టారు. ఇదే సమయంలో సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ పలు వ్యాఖ్యలు చేసింది కవిత. ఈ క్రమంలో కవిత ఏదో పెద్ద నిర్ణయం తీసుకోబోతున్నారన్న చర్చ జరిగింది. అంతలోనే మళ్లీ రూట్ మార్చిన కవిత? తండ్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులిచ్చిన అంశంపై..హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ దగ్గర నిరసన తెలిపింది. అయితే ఆ ధర్నా చేయడం వెనుక కవిత ప్లాన్ వేరే ఉందని..ఆ స్ట్రాటజీ వర్కౌట్ అయినట్లు కనిపించడం లేదన్న టాక్ వినిపిస్తోంది.బీఆర్ఎస్‌లో కేసీఆరే సుప్రీం లీడర్. అందులో ఎవరికీ అనుమానాలు లేవు. అలాంటి కేసీఆర్‌కు మద్దతుగా కవిత ధర్నా చేస్తే అక్కడ ఒక్క గులాబీ జెండా కూడా కనిపించలేదు. కవిత ఇన్వైట్ చేశారో లేదో..లేక ఆమె పిలిచినా ఎవరు రాలేదేమో కానీ..ఒక్క బీఆర్ఎస్ లీడర్ కూడా ఆమె నిర్వహించిన ధర్నా వైపు రాలేదు. గతంలో కవిత ఎప్పుడు కార్యక్రమాలు నిర్వహించినా పోటా పోటీగా వచ్చి అటెండెన్స్ వేయించుకునే గులాబీ పార్టీ నేతలు ఇప్పుడు మాత్రం మొహం చాటేశారు.అయితే కవిత ఇన్ని రోజులు చేసిన కార్యక్రమాలు ఒక ఎత్తు. ఇప్పుడు కేసీఆర్‌కు మద్దతుగా నిర్వహించిన మహాధర్నా మరో ఎత్తని అంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు. తెలంగాణ జాగృతి పేరుతో వందల కార్యక్రమాలు చేసిన కవితకు ప్రతీ సందర్భంలో మద్దతుగా వెంట నడిచింది బీఆర్ఎస్ క్యాడర్. ఎక్కడైనా..ఎప్పుడైనా కవితను నెత్తిన పెట్టుకుని చూసుకున్నారు గులాబీ పార్టీ కార్యకర్తలు. కానీ తండ్రి కేసీఆర్‌కు ఆమె రాసిన లేఖ లీక్ తరువాత సీన్ మొత్తం మారిపోయింది.కేసీఆర్ అంటే బీఆర్ఎస్, బీఆర్ఎస్ అంటే కేసీఆర్. అలాంటి ఆయనకు మద్దతుగా చేసిన ధర్నాలో గులాబీ జెండాలు, కండువాలు పెట్టకపోవడమంటే కవిత తనకు తానుగా పార్టీకి దూరం అవుతున్నారా అన్న సందేహాలు కలుగుతున్నాయి. ఇన్నాళ్లు కవిత ఏం మాట్లాడినా, లేఖలు రాసినా ఆమె ప్రయాణం మాత్రం బీఆర్ఎస్‌తోనే ఉంటుందని అనుకున్నారంతా. కానీ రోజు రోజుకు ఆమె తీరు చూస్తోంటే మాత్రం బీఆర్ఎస్‌తో తెగదెంపులు చేసుకున్నట్టే కనిపిస్తోందన్న చర్చ జరుగుతోంది.కవిత కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ తర్వాత ఆమె అమెరికా నుంచి వచ్చినప్పటి నుంచి ఏ కార్యక్రమంలో పాల్గొన్నా బీఆర్ఎస్ జెండా కానీ, ఆ పార్టీ నేతలు గాని ఆమె కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించడం లేదు. దీన్ని బట్టే పార్టీ కవితను దూరం పెట్టేసిందని, ఆమె ఇప్పుడు ఒంటరి అయ్యారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నేతలు కనీసం కవిత పేరే ఎత్తడం లేదంటున్నారు.ఎమ్మెల్సీ కవిత జోలికి ఎవ్వరూ వెళ్లొద్దని పార్టీ నేతలకు బీఆర్ఎస్ అధిష్టానం ఆదేశించిందన్న అన్న టాక్ వినిపిస్తోంది. లేదంటే ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ నేతలే ఆమెతో గ్యాప్ మెయింటెన్ చేస్తున్నారా అన్న చర్చ జరుగుతోంది. ఇక కేసీఆర్ ను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యంగా ఇందిరాపార్క్ దగ్గర చేపట్టిన దర్నాకు బిఆర్ ఎస్ కేడర్ పూర్తిగా దూరంగా ఉండటం?ధర్నాకు కూడా పెద్దగా స్పందన లేకపోవడానికి తోడు కనీసం కేసీఆర్ నుండి పిలుపుకూడా రాకపోవడంతో ఇప్పుడేం చేయాలో పాలుపోక కవిత టీం ఆందోళన చెందుతోందట కొన్ని రోజులుగా తాను అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా పట్టించుకోని కేసీఆర్..ఆయనకు మద్దతుగా ధర్నా చేశాక కచ్చితంగా స్పందిస్తారని కవిత భావించారట. కానీ ఫామ్ హౌజ్ నుంచి మాత్రం నోరెస్పాన్స్. దీంతో కవిత చాలా నిరాశ చెందారనే చర్చ తెలంగాణ జాగృతి వర్గాల్లో జరుగుతోంది. దీంతో కవితను పార్టీ వద్దనుకుంటోందా.? లేక ఆమెనే పార్టీకి దూరంగా ఉంటున్నారా అన్న చర్చ మొదలైంది. ఏదేమైనా కవిత నెక్స్ట్ స్టెప్ ఏంటి అంటే ఇప్పటికిప్పుడైతే ఏం చెప్పలేని పరిస్థితి అంటున్నారు. ఆమె రాజకీయ భవితవ్యం ఏంటన్నది ఎవ్వరికి అంతుపట్టడం లేదంటున్నారు. బీఆర్ఎస్‌తో కవిత బంధం తెగినట్లేనా.? లేక ఆమెనే ఓ మెట్టు దిగి కేసీఆర్ గతంలో చెప్పినట్లు సైలెంట్ అయిపోతారా అన్నది వేచి చూడాలి.

# సిటీలో మరో 3 ఫ్లైఓర్లు

హైదరాబాద్, జూన్ 7, హైదరాబాద్‌ని విశ్వ నగరంగా అభివృద్ధి చేసి.. ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించడం కోసం మౌలిక వసతులను డెవలప్ చేయడం కోసం రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. అలానే నగరంలో ప్రధాన సమస్య అయిన ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టడం కోసం రాష్ట్ర ప్రభుత్వం.. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ)ని ప్రారంభించిన సంగతి తెలిసిందేదీనిలో భాగంగా నగరం మొత్తం మీద 16 ప్రాంతాల్లో 20.14 కిలోమీటర్ల మేర రూ.2400 కోట్లతో వంతెనలు, అండర్‌పాస్‌లు, రహదారుల విస్తరణ పనులకు సంబంధించిన ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించనున్నారు. ఈప్రాజెక్ట్‌లో భాగంగా భాగ్యనరంలో విపరీతంగా రద్దీ ఉండే మూడు ప్రాంతాల్లో ఫ్లైఓవర్‌లు నిర్మించేందుకు రెడీ అవుతోంది. మరి ఆ ప్రాంతాలు ఏవి అంటే..హైదరాబాద్ సిటీలో.. వాహనాల రద్దీతో విపరీతమైన ట్రాఫిక్ ఉండే మూడు జంక్షన్లకు పరిష్కారం లభించబోతోంది. రేవంత్ ప్రభుత్వం హెచ్-సిటీ ప్రాజెక్టు కింద రూ.360 కోట్లతో మూడు ఫ్లైఓవర్‌లు, ఓ అండర్‌పాస్ నిర్మాణానికి అంగీకారం తెలిపింది. ఈక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇంతకు ఆ ఏరియాలు ఏవి అంటే.. బంజారహిల్స్ రోడ్డు నం.3లోని ది లీలా హోటల్ జంక్షన్, పంజాగుట్ట నాగార్జున సర్కిల్ (ఎన్‌ఎఫ్‌సీఎల్)లో నిర్మాణం చేపట్టబోయే ఫ్లైఓవర్‌ల కోసం రూ.210 కోట్లు కేటాయించింది.అలానే రసూల్‌పుర ఎన్టీఆర్ చౌరస్తాపై.. బేగంపేట మెయిన్ రోడ్డును, మినిస్టర్ రోడ్డును కలుపుతూ నిర్మించబోయే ఫ్లైఓవర్‌కు గాను రూ.150 కోట్ల ఖర్చవతుందని అంచనా వేశారు. దీనికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియ పూర్తి కాగానే.. టెండర్లు పిలుస్తామని జీహెచ్‌ఎంసీ చెప్పుకొచ్చింది. ఈ ఫ్లైఓవర్లు అందుబాటులోకి వస్తే.. ఈ మూడు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించనుంది అంటున్నారఎన్‌ఎఫ్‌సీఎల్ చౌరస్తాలో నిర్మించబోయే ఫ్లైఓవర్ పొడవు నిర్మాణం 900 మీటర్లు. ఈ నిర్మాణ పనుల కోసం 13 ఆస్తులను సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. బంజారహిల్స్ రోడ్డు నం.1 నుంచి నాగార్జున సర్కిల్ మీదుగా రోడ్డు నం.3 వైపు వెళ్లే వాహనాల కోసం రెండు లైన్ల ఫ్లైఓవర్ రానుంది. దీని పొడవు 900మీటర్లు. అలానే పంజాగుట్ట నుంచి బంజారహిల్స్ రోడ్డు నం.3 మీదుగా శ్రీనగర్‌కాలనీకి రెండు లైన్ల అండర్‌పాస్ రాబోతుంది. దీని పొడవు 340 మీటర్లు.వీటితో పాటుగా కేబీఆర్ పార్కు నుంచి పంజాగుట్ట వైపు లీలా హోటల్ జంక్షన్ వద్ద మూడు లైన్ల ఫ్లైఓవర్ రానుంది. దీని పొడవు 600 మీటర్లు. ఈ రెండు నిర్మాణ పనుల కోసం 46 ఆస్తులను సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. అలానే బేగంపేట నుంచి సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డుకు వెళ్లే దారిలో.. ఎన్టీఆర్ జంక్షన్‌లో మెట్రో మార్గం మీదుగా ఫ్లైఓవర్‌ని నిర్మించబోతున్నారు. దీని పొడవు 740 మీటర్లు.. ఇందుకోసం 8 ఆస్తులను సేకరించాల్సి ఉంది. దీనిపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ భూసేకరణపై క్షేత్రస్థాయి పరిశీలన కూడా చేపట్టారు.

# చలాన్లు ఎగ్గొట్టి,, బండి వదిలి వెళ్లిపోయాడు

వరంగల్, జూన్ 7, చక్కని బైక్ ఉంది. దూసుకుపోవడానికి రోడ్లున్నాయి. ఇంకేం అనుకున్నాడో కుర్రాడు. కానీ రూల్స్ ప్రకారం వెళ్తే సమస్యలు ఉండేవి కావు. కానీ అడ్డదిడ్డంగా నడపడం అలవాటుగా చేసుకున్నాడు. రోడ్డు మీద సీసీ కెమెరాలు ఉంటాయని.. అవి లేని చోట ట్రాఫిక్ పోలీసులు కెమెరాతో రెడీగా ఉంటారని భయపడలేదు. ఆ వారేం చేస్తారులే అన్నట్లుగా రెచ్చిపోయాడు. బైక్ తో విన్యాసాలు చేశాడు. చివరికి ఇప్పుడు ఆ బైక్ కే ఎసరు వచ్చింది. ఎందుకంటే పోలీసులు సీజ్ చేశారు. వరంగల్‌లో వాహన తనిఖీల్లో భాగంగా సాయంత్రం హన్మకొండ ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్ సీతా రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది అశోక జంక్షన్ వద్ద పెండింగ్ చలాన్లు ద్విచక్ర వాహనాల తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఓ బైక్ ను ఆపి చలాన్లు చెక్ చేశారు. చలాన్ మిషన్ కనీసం ఒక్క నిమిషం పాటు రీడింగ్ తీసుకుంది. డీ మార్ట్ సరుకుల బిల్లుగా అలా ప్రింట్ చేస్తూనే ఉంది. పోలీసులు కూడా ఆ బైక్ డ్రైవర్ వైపు.. ఆ బైక్ వైపు చూస్తూనే ఉన్నారు. ఓ నిమిషం తర్వాతా చాలా పెద్ద చలానా బిల్లుతో ప్రింట్ ఆగిపోయింది. మొత్తం 109 ట్రాఫిక్ చలాన్లు ఉన్నాయి. వాటి విలువ 26 వేల 310 రూపాయలు .ఆ బైకర్ ను హన్మకొండ ప్రాంతానికి చెందిన బిక్షపతి గా గుర్తించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జంపింగ్, హెల్మెట్ లేకుండా వాహనం వంటి చలాన్లు ఉన్నాయి. అన్నింటికీ ఫోటోలు ఉన్నాయి. వాహనదారుడు బిక్షపతి కి పెండింగ్ చలాన్ల రసీదు అందజేశారు. ఫైన్లు చెల్లించేవరకు వాహనాన్ని పోలీస్ కస్టడీలోకి తీసుకొని ట్రాఫిక్ స్టేషన్ కు తరలించారు. ఇక్కడ కొసమెరుపేమిటంటే పోలీసులు తనిఖీలు చేస్తున్నప్పుడు కూడా భిక్షపతికి హెల్మెట్ల లేదు. అలా దూసుకు వచ్చి దొరికిపోయాడు. మామా?లుగా ఆ బైక్ సెకండ్ హ్యాండ్ లో అమ్మితే యాభై వేలు కూడా వస్తాయో రావో కానీ ఇప్పుడు ఇంటికి వెళ్లి ఇరవై ఆరు వేల రూపాయలు తీసుకుని రావాల్సి ఉంటుంది. ఆ బిక్షపతి జులాయిగా తిరుగుతాడని పెద్దగా ఆలోచించి చెప్పాల్సిన పని లేదు. ఎందుకంటే కాస్త కనీస బాధ్యతగా ఏదైనా ఉద్యోగమో.. వ్యాపారమో చేసుకుని బతుకూంటే.. ఇంత నిర్లక్ష్యంగా ఉండడు. వంద కంటే ఎక్కువ సార్లు అది కూడా నాలుగైదు రోజులకోసారి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి పోలీసులకు దొరకడు. సాధారణంగా ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించాలంటే ఎవరైనా .. పోలీసులు లేని చోట.. సీసీ కెమెరాలు లేని చోట చూసుకుని మాత్రమే చేస్తారు. కానీ భిక్షపతి మాత్రం ఇలాంటివి ఏమీ పట్టించుకోలేదు. తన దారి రహదారి అని దూసుకెళ్లాడు. కానీ ఎప్పుడో సారి దొరికిపోకతప్పదు. అలా దొరికిపోయి.. ఇప్పుడు నడుచుకుంటూ ఇంటికి పోవాల్సి వచ్చింది. ట్రాఫిక్స్ రూల్స్ ఉల్లంఘించడం హీరోయిజం కాదు.. చేజేతులా నష్టాన్ని.. వినాశనాన్ని కొని తెచ్చుకోవడమే.

# ఆఫీసులో ఉద్యోగుల ముద్దులు..

వరంగల్, జూన్ 7, ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చి, జీతం ఇచ్చి.. పనులు చేయండ్రా అని పంపితే .. వారు చేస్తున్న పనులు మాత్రం వేరే ఉన్నాయి. కుర్చీలో కూర్చుని పని చేయకుండా.. తోటి ఉద్యోగినితో ముద్దు ముచ్చట్లు పెట్టుకుంటున్నాడు. ఇద్దరూ కొత్తగా చేరిన వారే. ప్రేమలో ఉన్నారో.. దోమలు కుడుతున్నాయని కంగారు పడుతున్నారో కానీ.. ఉద్యోగానికి వచ్చినప్పటి నుండి అదే పని. దాంతో చిరాకేసిన కొంత మంది కిటీకీ నుంచి వీడియో తీసి.. వారి బాగోతాన్ని సోషల్ మీడియాలో పెట్టారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. విధులు నిర్వహించాల్సిన వీరు ముద్దు ముచ్చట తో రాసలీలల్లో మునిగిపోయారు. నిత్యం వేలాది మంది ప్రజలు వివిధ పనులకోసం కార్పొరేషన్ కార్యాలయానికి వస్తూంటారు. వారు అదే పనిగా తిరగడం తప్ప పనులు కావు. ఎందుకంటే.. ఉద్యోగులు ఇలాంటి పనులు చేస్తూంటారు. కార్పొరేషన్ కార్యాలయంలోని ఎకౌంట్స్ విభాగంలో రెగ్యులర్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆ ఇద్దరూ అకౌంట్స్ సరి చేసుకోవడానికే సమయం ఉండదు. ఇక ఇతర పనులు ఎక్కడ చేస్తారు. బిల్లులు రావాల్సిన వారు.. మంజూరు కావాల్సిన వారు అదేపనిగా కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉంటారు. పనులు కావు. వీరినిర్వాకాలు చూసి చాలా మంది గుట్టు బయట పెట్టాలనుకున్నారు. రాసలీలల్లో మునిగిపోయిన సమయంలో కార్యాలయానికి వచ్చిన ఎవరో వీడియో చిత్రీకరించారు. అయితే ఈ ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది. రాసలీలల పై ఇద్దరు ఉద్యోగులను ఉన్నతాధికారులు మందలించారు.ఈ ఉద్యోగుల అనుచిత ప్రవర్తన మొదట ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినప్పుడు, వారిని కేవలం మందలించి విడిచిపెట్టినట్లు సమాచారం. అయితే, ఈ హెచ్చరికలను వారు ఏ మాత్రం లెక్కచేయకుండా, తమ తీరును మార్చుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. కార్యాలయ ప్రాంగణాన్ని తమ వ్యక్తిగత ప్రవర్తనలకు వేదికగా మార్చుకోవడం పట్ల తోటి ఉద్యోగులు కూడా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సేవకు అంకితం కావాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు ఇలాంటి అసాంఘిక చేష్టలకు కేంద్రంగా మారడం బల్దియా గౌరవానికి భంగం కలిగిస్తుందని నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు.ఈ పరిస్థితిపై ఉన్నతాధికారులు ఇకనైనా కళ్ళు తెరిచి, తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని తోటి ఉద్యోగులు, నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అనుచిత ప్రవర్తనకు పాల్పడిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ఇలాంటి ఘటనలను అరికట్టవచ్చని, కార్యాలయ వాతావరణంలో వృత్తిపరమైన ప్రమాణాలను పునరుద్ధరించవచ్చని సూచిస్తున్నారు. రాసలీలలు పాల్పడిన ఇద్దరి పై అధికారులు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటారా.. లేక మందలించి వదిలేస్తారా వేచి చూడాలి.ఈ ఇద్దరూ ఉద్యోగులు కొత్తగా చేరిన వారని చెబుతున్నారు. తాము ప్రేమలో ఉన్నామని వారు సమర్థించుకునే ప్రయత్నం చేసినట్లుగా చెబుతున్నారు. ప్రేమలో ఉంటే ఆఫీసులో ముద్దులు పెట్టుకోవడం ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి

# జూలై నెలలో కొత్త మున్సిపాల్టీకి ఎన్నికలు

హైదరాబాద్, జూన్ 7, తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ప్రభుత్వం ఈ నెల చివరి వారం లేదా జులై తొలి వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు తెలంగాణ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల పదవీకాలం 2024 జనవరి 31న ముగిసింది. జిల్లా, మండల పరిషత్తులంటే ఎంపీటీసీల పదవీకాలం జులై 3వ తేదీన, జెడ్పీటీసీల పదవీకాలం జులై 3వ తేదీన ముగిసింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విషయానికి వస్తే చాలా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం జనవరి 26, 2025న ముగిసింది. కొన్నింటికి 2021లో ఎన్నికలు జరిగాయి. వాటి పదవీకాలం ఇంకా ఉంది. ఈ పదవీకాలం ముగిసిన స్థానిక సంస్థల్లో ప్రత్యేక అధికారుల ద్వారా పాలన సాగుతోంది. గ్రేటర్ హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు కొన్ని మున్సిపాలిటీలకు 2021లో ఎన్నికలు జరిగాయి. వీటి పదవీకాలం 2026లో ముగియనుంది.తెలంగాణలో 12,991 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా 223 పంచాయతీలను ఏర్పాటు చేశారు. అంతకు ముందు 12,769 పంచాయతీలు ఉండేవి. జిల్లాకో జిల్లా పరిషత్తు ఉంటుంది కాబట్టి, తెలంగాణలోని 33 జిల్లాలకు గాను 33 జిల్లా పరిషత్తులు ఉంటాయి. వీటి పాలనా ప్రతినిధులుగా 33 మంది జెడ్పీటీసీలు ఉన్నారు. తెలంగాణలో 620 మండలాలు ఉన్నాయి. వీటికి మండల పరిషత్తు ఉంటుంది. వీటికి పాలనా ప్రతినిధులుగా 620 ఎంపీటీసీలు ఉన్నారు. తెలంగాణలో కొత్తగా 12 మున్సిపాలిటీలను ఏర్పాటు చేశారు. వీటికి కలుపుకుంటే 153కు పెరుగుతుంది. ప్రస్తుతం 131 మున్సిపాలిటీలు ఉన్నాయి.తెలంగాణలో కొత్తగా ఏర్పడిన/ప్రతిపాదించబడిన మున్సిపల్ కార్పొరేషన్లు మరియు మున్సిపాలిటీల వివరాలు ఇక్కడ ఇవ్వబడ్డాయి. ఈ వివరాలు ఇటీవల వచ్చిన వార్తలు మరియు ప్రభుత్వ ప్రకటనల ఆధారంగా ఉన్నాయి, కొన్నింటికి సంబంధించిన తుది నోటిఫికేషన్లు ఇంకా వెలువడాల్సి ఉండవచ్చు.

కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు ఇవే

తెలంగాణలో ప్రస్తుతం 13 కార్పొరేషన్లు ఉండగా, కొత్తగా మూడు మున్సిపాలిటీలను కార్పొరేషన్ హోదాకు అప్‌గ్రేడ్ చేశారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా, మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా, కొత్తగూడెం మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయడం జరిగింది. కొత్తగూడెం కార్పొరేషన్‌గా పాల్వంచ మున్సిపాలిటీ, సుజాత్ నగర్ మండలంలోని కొన్ని పంచాయతీలను విలీనం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. కొత్తగూడెం కార్పొరేషన్ ప్రక్రియ దాదాపు పూర్తయినట్లేనని అధికారులు చెబుతున్నారు. ఇక మంచిర్యాల, మహబూబ్‌నగర్ కార్పొరేషన్ల ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయి.

కొత్త మున్సిపాలిటీలు ఇవే

..ఖమ్మం జిల్లా ? కల్లూరు
కామారెడ్డి జిల్లా ? బిచ్కుంద
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ? ఆలియాబాద్
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ? మూడు చింతలపల్లి
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ? ఎల్లంపేట
రంగారెడ్డి జిల్లా ? మొయినాబాద్
రంగారెడ్డి జిల్లా ? చేవెళ్ల
మహబూబాబాద్ జిల్లా ? కేసముద్రం
సంగారెడ్డి జిల్లా ? కోహిర్
సంగారెడ్డి జిల్లా ? గడ్డపోతారం
సంగారెడ్డి జిల్లా ? గుమ్మడిదల
సంగారెడ్డి జిల్లా ? ఇస్నాపూర్
మహబూబ్‌నగర్ జిల్లా ? దేవరకద్ర
ఖమ్మం జిల్లా ? ఏదులాపురం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ? అశ్వరావుపేట
జనగామ జిల్లా ? స్టేషన్ ఘన్‌పూర్
నారాయణపేట జిల్లా ? మద్దూర్
ములుగు జిల్లా ? ములుగు

అయితే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కొత్త మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు కూడా ఎన్నికలు జరుపుతారా లేదా అన్నది మాత్రం చూడాలి. ఇప్పటికైతే వీటి ఏర్పాటుపై అధికారులు తీవ్రంగా కసరత్తు నిర్వహిస్తున్నారు.

# కాంగ్రెస్ లో కొత్త వర్సెస్ పాత



హైదరాబాద్, జూన్ 7, అక్కడ నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలు.. ఇక్కడ క్యాడర్‌లో కన్ఫ్యూజన్. కొత్త నేతలతో పాత నేతల లొల్లి.. వీటికి పరిష్కారం వెతకండి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరేలా కార్యాచరణ రూపొందించాలన్నారామె. గత పదిరోజులుగా తెలంగాణలో మకాం వేశారు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవ హారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్. పార్టీ నేతలతో మీనాక్షి వరుస సమీక్షలు నిర్వహించారు. వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలకు కొంతమంది అబ్జర్వర్స్‌ను నియమించి.. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మంతనాలు జరిపారు. వారి సమస్యలను, సూచనలను నోట్ చేసుకున్నారు జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన మీనాక్షి ఆయనతో కీలక విషయాలను చర్చించారు. పదిరోజుల పాటు నేతలతో మాట్లాడిన విషయాలను వివరించారు. చాలా నియోజకవర్గాల్లో నేతలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నేతల వల్ల పాత నేతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఆధిపత్యపోరుతో పార్టీ క్యాడర్ ఇబ్బందులు పడుతున్నారని రేవంత్‌కు చెప్పారు మీనాక్షి. చాలా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ సోషల్ మీడియా టీమ్ బలహీనంగా ఉందన్నారు నటరాజన్. ప్రభుత్వ పథకాలను నేతలు ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నారన్నారామె. ఈ సమస్యలన్నింటికి పరిష్కార మార్గాలు చూపాలని రేవంత్‌కు తెలిపారు మీనాక్షి.మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 15 రోజులకోసారి మంత్రివర్గ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ప్రతి నెలలో మొదటి, మూడవ శనివారం రోజున మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని భావిస్తున్నారు. విధానపరమైన నిర్ణయాల విషయంలో ఆలస్యం కాకుండా ఉండేందుకే ఈ నిర్ణయమన్నారు సీఎం రేవంత్.

మీనాక్షి నటరాజన్ సమీక్షల్లో చాలా మంది నేతలు జిల్లాలు, నియోజకవర్గాల్లో ఒక నేతపై మరొక నేత ఫిర్యాదులు చేసుకున్నారు. దాంతో పాటు ఆధిపత్యపోరుకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి జిల్లాలు, నియోజకవర్గాల్లో నేతలు సోషల్ మీడియాలో చాలా వీక్‌గా ఉన్నారని, చాలా మందికి సోషల్ మీడియాపై అవగాహన లేదని, ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సంబంధించి వివరాలు తెలియవని, వాటిపై వారికి అవగాహన లేకపోవవడంతో జనాలకు వివరించలేకపోతున్నారని మీనాక్షికి ఫిర్యాదులు అందాయి. అన్ని విషయాలను ఆమె సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. ఈ సమస్యలన్నింటికి పరిష్కార మార్గాలు చూపవలసిందిగా ఆమె సీఎంను కోరారు. అలాగే కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నేతల వల్ల పాత నేతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని దీనికి చెక్ పెట్టాలని మీనాక్షి నటరాజన్ భావిస్తున్నారు. వీటన్నింటికి సంబంధించిన విషయాలను సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతినెలా రెండుసార్లు కేబినెట్ సమావేశాలు నిర్వహించనుంది. 15 రోజులకోసారి మంత్రివర్గ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. విధానపరమైన నిర్ణయాల విషయంలో ఆలస్యం లేకుండా వేగం పెంచాలని.. అందుకే రెండు మూడు నెలలకోసారి కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా కేబినేట్‌లో సమీక్ష చేయాలని నిర్ణయించారు. మంత్రులతో ఎప్పటికప్పుడు చర్చించేందుకు వీలుగా రెండు వారాలకోసారి మంత్రి వర్గ సమావేశం ఉండేలా ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి నెలలో మొదటి, మూడవ శనివారం రోజున మంత్రివర్గ సమావేశం నిర్వహించేందుకు ఆలోచన చేస్తున్నారు. కాగా ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటి వరకు 17 సార్లు కేబినెట్ భేటీలు జరిగాయి.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారాలు - వాస్తవాలు...

## మాజీమంత్రి హరీశ్ రావు

## పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పాయింట్స్



**జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి:**గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా కేవలం 11 టీఎంసీల నీటి మాత్రమే నిల్వ చేసే అవకాశం ఉండేది.

కానీ, కేసీఆర్ గారి ముందు చూపుతో కాళేశ్వరం ద్వారా 141 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా 16 రిజర్వాయర్ల నిర్మాణం జరిగింది.

మేడిగడ్డ, అన్నరం, సుందిళ్ల, మేడారం, మల్కపేట, అనంతగిరి, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, బుస్సాపూర్, గంధమల్ల, కొండం చెరువు, భూంపల్లి, మోతె, ధర్మారావుపేట, కాటేవాడి, ముద్దోజివాడి, తిమ్మక్కపల్లి రిజర్వాయర్లలో 141 నీటి నిల్వ సామర్థ్యం ఉంది.

ఒక్క మల్లన్న సాగర్ లోనే 50 టీఎంసీల నీటి నిల్వ ఉంటుంది.

ఎస్సారెస్పీకి నీళ్లు రానపుడు, కడెం నిండకుండా ఎల్లంపల్లికి కూడా నీళ్లు రానపుడు, మేడిగడ్డలో నీళ్లుంటాయి.

ఎక్కడా నీళ్లు లేనపుడు కూడా నీళ్లు లభ్యమయ్యే పాయింట్ మేడిగడ్డ.

వర్షాలు బాగా కురిసినపుడు ఎస్సారెస్పీ నుంచి మిడ్ మానేరుకు నీళ్లు తెచ్చుకున్నం.

మిడ్ మానేర్ లో పంప్ చేసి నుంచి అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్ వరకు నీళ్లు తెచ్చుకున్నం.

కాళేశ్వరంలో అంతర్భాగమైన వీటి అంతటా లక్షల ఎకరాల్లో పంటలు పండినయి.

కాళేశ్వరం ప్రాజెక్టులో కట్టిన మోటార్లతోనే అన్నపూర్ణకు నీళ్లొచ్చినయి.

అన్నపూర్ణలో పెట్టిన మోటార్లతో రంగనాయక సాగర్ కు నీళ్లొచ్చినయి.

రంగనాయక సాగర్ మోటార్లతో మిడ్ మానేర్ కు నీళ్లొచ్చినయి.

మిడ్ మానేర్ మోటార్లతో మల్లన్నసాగర్ కు, అక్కడి మోటార్లతో కొండ పోచమ్మ సాగర్ కు నీళ్లొచ్చినయి.

ఇదంతా కాళేశ్వరంలో భాగంగానే.. వ్యవస్థ అంతా పనిచేయడం వల్లనే లక్షల ఎకరాల్లో పంట పండింది

కాళేశ్వరం కింద ఒక్క ఎకరా పారలేదు అంటడు సీఎం రేవంత్ రెడ్డి.

ఇక ఉత్తమ్ కుమార్ రెడ్డి అయితే, 50 వేల ఎకరాలు మాత్రమే సాగయింది అంటడు.

ఇంకో కాంగ్రెస్ నాయకుడేమో లక్ష ఎకరాలే పారింది అంటడు.

ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు, ఒక్కో నాయకుడు ఒక్కో లెక్క చెబుతడు.

కాళేశ్వరం నీళ్లతో ఇప్పటి వరకు నేరుగా 98,570 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందింది.

కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వల ద్వారా నింపిన 456 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా 39,146 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందింది.

కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో ఎస్సారెస్పీ స్టేజీ 1, ఎస్సారెస్పీ స్టేజీ 2 మరియు నిజాంసాగర్ నీటితో నింపిన 2143 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా 1 లక్షా 67 వేల కొత్త ఆయకట్టు సాగయింది.

ఎస్సారెస్పీ స్టేజీ 1, ఎస్సారెస్పీ స్టేజీ 2 మరియు నిజాంసాగర్ ప్రాజెక్టులకు కాళేశ్వరం నీరందించి 17 లక్షల 8 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం జరిగింది.

కాళేశ్వరం నీళ్లు కూడెల్లి వాగు, హల్దీ వాగుల ద్వారా 66 చెక్ డ్యాములతో మరో 20 వేల 576 ఎకరాలకు సాగునీరందింది.

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మొత్తం 20 లక్షల 33 వేల 572 ఎకరాలకు సాగునీరు అందిస్తే, ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదు అని తప్పుడు ప్రచారం చేస్తరు ఈ కాంగ్రెస్ నాయకులు.

ఒక ఏడాది కరువు వస్తే, ఎస్సారెస్పీకి కూడా నీళ్లను రివర్స్ పంపింగ్ చేసినం.

మిడ్ మానేర్ నుంచి ఎల్ఎండీకి నీళ్లు తెచ్చి, ఎల్ఎండీ ద్వారా ఎస్సారెస్పీ స్టేజ్ 1 కు నీళ్లిచ్చినం,

ఎస్సారెస్పీ స్టేజ్ 2లో, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ దాకా నీరందించినం.

కాళేశ్వరం నీళ్లు పంపించి పంటలు కాపాడింది కేసీఆర్ గారి ప్రభుత్వం

ఇది వాస్తవమైన రిపోర్టు - నీటిపారుదలశాఖ అధికారులిస్తున్న రిపోర్టు

కానీ కాంగ్రెస్ నాయకులు 50 వేల ఎకరాలే పారిందని దుష్ప్రచారం చేస్తున్నరు.

తెలంగాణ ఏర్పడక ముందు గోదావరి జలాల సద్వినియోగానికి ఎవరూ కృషి చేయలేదు.

2007 నుంచి 2014 వరకు కేంద్రంలో, మహారాష్ట్రలో, ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నప్పటికీ తుమ్మడి హట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఏ అనుమతి సాధించలేదు.

బీఆర్ఎస్ పార్టీలా ఆలోచన చేసినం, తెలంగాణ పచ్చబడాలంటే గోదావరి జలాలే కావాలనుకున్నం.

గోదావరి నది 1465 కిలోమీటర్లు ప్రవహిస్తుంటే, అందులో 750 కి.మీ. తెలంగాణలోనే ప్రవహిస్తది.

ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో 1480 టీఎంసీల కేటాయింపులుంటే, తెలంగాణ వాటా 969 టీఎంసీలు.

కానీ, వాస్తవంగా అందులో తెలంగాణ వాడకం ఏనాడూ 400 టీఎంసీలు మించలేదు.

2014 వరకు తెలంగాణలో గోదావరిపై కట్టిన ప్రాజెక్టులు ఎస్సారెస్పీ, దేవాదుల మాత్రమే.

తెలంగాణ ఉద్యమం ఉప్పెనలా వస్తే, తలొగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది.

అక్కడ నీటి లభ్యత ఉండదు, ప్రాణహిత చేవెళ్ల నీటి నిల్వ సామర్థ్యం కేవలం 11 టీఎంసీలు మాత్రమే.

కాళేశ్వరం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 141 టీఎంసీలు.. ఎంత తేడా..

2014 వరకు కాంగ్రెస్ నాయకులు సర్వే, మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద రూ. 2328 కోట్లు కాంట్రాక్టర్లకు ఇస్తే, పనులు జరగనేలేదు, ఇందులో తట్టెడు మట్టి కూడా ఎత్తకుండా మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట 1052 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం స్వాహా చేసిందని స్వయంగా కాగ్ తన రిపోర్టులో వెల్లడించింది. ఇట్లా ఆ పైసలు కాంగ్రెస్ నాయకులు తీసుకొని జేబులు నింపుకున్నరు.

అప్పుడు మంత్రులుగా ఉన్నది కూడా ఇదే కోమటిరెడ్డి, ఉత్తమ్, శ్రీధర్ బాబులే. ఆనాడు రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉండి విమర్శించిండు. జలయజ్ఞం కాదు.. ధనం యజ్ఞం అన్నడు.

కానీ ఈరోజు రేవంత్ రెడ్డే కాంగ్రెస్ అవినీతిని వెనకేసుకొస్తున్నడు.

ఈ మధ్య ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడిండు. ప్రాణహిత చేవెళ్ల కోసం మేం 10 వేల కోట్లు ఖర్చు పెట్టినం, ఇంకో 20 వేల కోట్లు పెడితే అయిపోతుండె అన్నడు.

నేను లెక్కలన్నీ తీయిస్తే, 3700 కోట్లు మాత్రమే కాంగ్రెస్ ఖర్చు చేసినట్లు తేలింది. ఎందుకీ గోబెల్స్ ప్రచారం?

ప్రాజెక్టు ఖర్చు పెరిగిందని దుష్ప్రచారం చేస్తున్నరు ఈ కాంగ్రెస్ నాయకులు. 2007లో రూ.17,875 కోట్లకు జీవో ఇచ్చి, ఏ పని చేయకుండానే ప్రాజెక్టు ఖర్చును రూ.38,500 కోట్లకు పెంచింది కూడా వీళ్లే..

ఆ తర్వాత కేంద్రానికి పంపినపుడు రూ.40,300 కోట్లకు పెంచారు ఇదే కాంగ్రెస్ నాయకులు.

ఇదీ వీళ్ల నిర్వాకం.

2014 జూన్ 2 న తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై, కొత్త ప్రభుత్వం ఏర్పడ్డది. నెల రోజుల్లోనే సాగునీటిశాఖ మంత్రిగా ఉన్న నేను, ఇంజనీర్ల బృందం కలిసి మహారాష్ట్రకు వెళ్లినం.

అక్కడ కాంగ్రెస్ ఇరిగేషన్ మంత్రి హసన్ ముష్రఫ్ ను కలిసి ప్రాజెక్టు నిర్మాణం అవసరాన్ని వివరించినం.

వారి సీఎం పృధ్వీరాజ్ చౌహాన్, ఇరిగేషన్ మంత్రి హసన్ ముష్రఫ్ ఉమ్మడి ఏపీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి రాసిన లేఖను గుర్తు చేశారు.

ఫుల్ రిజర్వాయర్ లెవల్ 152 మీటర్లకు అనుగుణంగా చేపట్టే ప్రాజెక్టు పనులు నిరుపయోగమని, తాము 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తేనే అంగీకరిస్తామని ఆనాడే తేల్చి చెప్పినట్లు చెప్పారు.

ప్రాజెక్టు నిర్మాణం కోసం రెండు రాష్ట్రాల అధికారుల మధ్య రెండుసార్లు హైదరాబాదులో చర్చలు జరిగాయి.

ఆనాడు దివంగత ఆర్.విద్యాసాగర్ రావు కూడా పాల్గొని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పరిహారాన్ని తెలంగాణ ప్రభుత్వం ఇస్తుందని కూడా హామీ ఇచ్చారు.

అయితే తుమ్మిడిహెట్టి వద్దనే 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ తో ప్రాజెక్టు నిర్మించేందుకు బీఆర్ఎస్ ఎంతో ప్రయత్నం చేసింది. కానీ, మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదు.

మహారాష్ట్రలో ఎన్నికలు జరిగిన తర్వాత కొత్తగా ఏర్పడిన బీజేపీ ప్రభుత్వంలో ఆనాటి సాగునీటి మంత్రి గిరీష్ మహాజన్ తో నేను (హరీష్ రావు) ముంబైలో సమావేశమవడం జరిగింది.

ఈ సమస్యను ముఖ్యమంత్రుల స్థాయిలోనే పరిష్కరించుకోవాల్సి ఉంటుందని గిరీశ్ గారు సూచించారు.

ప్రాణహిత %-% చేవెళ్లను ఎందుకు రీ ఇంజనీరింగ్ చేయాల్సి వచ్చిందంటే... నీటి లభ్యత లేకపోవడమే కారణం.

హైడ్రాలజీ వాళ్లు అక్కడ ప్రాజెక్టుకు సరిపడా నికర జలాలు లేవన్నారు.

ప్రాజెక్టుపై పునరాలోచన చేయాలని సెంట్రల్ వాటర్ కమిషన్ సూచించింది.

ఉమ్మడి ఏపీలో 2008న రాసిన లేఖలో ప్రాణహిత చేవెళ్ల డీపీఆర్ పై సీడబ్ల్యూసీ స్పందించింది.

ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం కలిగిన బ్యారేజీలు లేవని, అందుకే కృత్రిమ జలాశయాలను గానీ, ఆన్ లైన్ జలాశయాల నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సీడబ్ల్యూసీ సూచించింది.

తుమ్మడిహెట్టి వద్ద ప్రతిపాదించిన బ్యారేజీ నిర్మాణం కోసం ప్రభుత్వ పరంగా రాజకీయంగా ఎన్నో ప్రయత్నాలు చేసినం.

అవేమీ ఫలించకపోవడంతోనే ప్రత్యామ్నాయ స్థలం కోసం ఆలోచన చేసినం. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ ఎంపిక చేసిన స్థలమే.. మేడిగడ్డ



## తెలంగాణ భవన్ లో "కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం - వాస్తవాలు" అనే అంశంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కు హాజరైన కేటీఆర్




కాంగ్రెస్-బీజేపీ నిస్సిగ్గుగా కుమ్మక్కై తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికే ఇవాళ హరీష్ రావు గారు ఈ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తున్నారు.

తెలంగాణ ఉద్యమ నినాదమైన నీళ్లు నిధులు నియామకాలు కాంగ్రెస్ దుర్మార్గపు పాలనలో మాయమైపోయింది.- కేటీఆర్

పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సర్కారు.. ఉద్యమ నినాదానికి పాతరేసి దుర్మార్గపు విధానంతో రాజ్యమేలుతున్నారు

అదే... BRS పై నిందలు - కాంట్రాక్టర్ లతో దందాలు - ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు చందాలు

గోదావరి, కృష్ణాలో ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకే కేసీఆర్ గారు కాలంతో పోటీపడి ప్రతిష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును, సీతారామ ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేశారు

దశాబ్దాలపాటు సాగునీటి కోసం తండ్లాడిన రైతులకు నీళ్లిచ్చి కన్నీళ్లు తుడిచిన దార్శనికులు కేసీఆర్ గారు

తెలంగాణ రాష్ట్రానికి, రైతులకు శ్రీరామరక్ష.. కేసీఆర్ గారు

అనుమతి లేకుండా ఏపి ప్రభుత్వం అనేక ప్రాజెక్టులు కడుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి, కాంగ్రెస్ మంత్రులు, బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదు

గుజరాత్ లో మోర్బీ బ్రిడ్జి కూలి 140 మంది చనిపోయినా Ndsa కానీ, ఏ ఏజెన్సీ కానీ ఇప్పటి దాకా నోరు మెదపలేదు.

బీహార్ లో నాలుగు రోజులకు ఒక బ్రిడ్జి కూలినా ఏ ఏజెన్సీ స్పందించదు

సుంకిశాలలో రిటైనింగ్ వాల్ కూలినా NDSA రాదు

SLBC టన్నెల్ కుప్పకూలి 8 మంది చనిపోయినా NDSA విచారణ చేయదు

వట్టెం పంపుహౌస్ మునిగినా, పెద్ద వాగు కొట్టుకుపోయినా NDSA రాదు

కానీ కాళేశ్వరంలోని వంద కాంపోనెంట్లలో కేవలం ఒక్క చోట రెండు పిల్లర్లు కుంగితే ఏడాదిన్నరగా మరమ్మత్తు చేయకుండా రాద్ధాంతం చేస్తున్నారు

NDSA రిపోర్ట్ పేరిట బీజేపీ ఆఫీసులో NDA రిపోర్ట్ తయారు చేసి దుష్ప్రచారం చేస్తున్నారు.

ఈ రిపోర్ట్ చెత్త బుట్టలో వేయడానికి తప్ప దేనికి పనికి రాదని ఎల్ అండ్ టీ సంస్థ తేల్చి చెప్పింది

పార్లమెంట్ నూతన భవనం కట్టిన ఎల్ అండ్ టీ సంస్థనే మేడిగడ్డ బ్యారేజ్ కట్టింది


తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి పంపిన మూటలతోనే కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయ భవనం కట్టుకుంది. దాన్ని కూడా ఎల్ ఎండ్ టీ సంస్థనే కట్టింది.

నమ్మకం లేకపోతే ఆ సంస్థతోనే ఎందుకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భవనం కట్టించారు.

కాంగ్రెస్-బీజేపీ కలిసి తెలంగాణ రైతుల బొండిగె పిసికే కుట్ర చేస్తున్న నేపథ్యంలో జిల్లాల వరకూ వెళ్లి వాస్తవాలు చెబుతాం

మేడిగడ్డ పిల్లర్లకు మరమ్మత్తు చేసి రైతులకు నీళ్ళు ఇచ్చే అవకాశం ఉన్నా.. కుంటిసాకులతో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సమాధానం చెప్పాలి

## రోహిణి తర్వాత మాడు పగులుతోంది...



హైదరాబాద్, జూన్ 7, రోహిణి కార్తె తన ప్రభావాన్ని చూపుతుంది. అకాల వర్షాలు, నైరుతి రుతు పవనాలు ముందుగానే రావడంతో ఈ ఏడాది రోహిణి కార్తెను తప్పించుకున్నట్లే అనుకున్నప్పటికీ కానీ రివర్స్ కొడుతుంది. నైరుతి రుతుపవనాల గమనం మందగించింది. దీంతో ఉక్కపోతతో పాటు గరిష్టంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వర్షాలు పడటం వల్ల మరింత ఉక్కపోత, తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. నిన్న మొన్నటి వరకూ చల్లటి వాతావరణంతో ఉన్న రెండు తెలుగు రాష్ట్రాలు ఇప్పుడు వేడిమితో ఉడికెక్కిపోతున్నాయి. మరో వారం రోజుల పాటు ఇలాంటి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ కేంద్రం అధికారులు స్పష్టం చేశారు. పగటి వేళ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ లో పగటి ఉష్ణోగ్రతలు నలభై డిగ్రీలు దాటే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్టంగా రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపింది. నైరుతి రుతుపవనాలు చిన్న బ్రేక్ తీసుకున్నట్లు కనపడుతుంది. మళ్లీ రెండు తెలుగు రాష్ట్రాలు వేడెక్కాయి. దక్షిణ భారతదేశంతో పాటు ఈశాన్య రాష్ట్రాల వద్ద నైరుతి రుతుపవనాల కదలికలు ఆగిపోయినట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో పగటి వేళ గరిష్టంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండమే నైరుతి రుతుపవనాల కదలికలు నిలిచిపోయినట్లు వాతావరణ కేంద్ర తెలిపింది. ... అందువల్లనే పొడిగాలులతో పాటు ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. అయితే మరో వారం రోజుల పాటు ఇలాంటి పరిస్థితులుంటాయని వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణలోనూ అనేక ప్రాంతాల్లో నలభై డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ప్రధానంగా నల్లగొండ, ఖమ్మం, మహబూబ్ నగర్, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పింది. అయితే కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని కూడా వాతావరణ కేంద్రం తెలిపింది. పగటి వేళ గరిష్ట ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు సాయంత్రానికి చిరుజల్లులు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో విద్యుత్తు వాడకం పెరిగింది. ఏసీ, ఫ్యాన్ల వాడకం కూడా గత మూడు రోజుల నుంచి పెరగిందని ట్రాన్స్ కో అధికారులు తెలిపారు.

## ఘనంగామాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు

తాండూరు శనివారం తాండూరు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన నివాసంలో నాయకుల మధ్య కేక్ చేసి సంబరాలు నిర్వహించారు. డప్పు వాయిద్యల మధ్య అభిమానులు డ్యాన్స్ చేస్తూ బర్డే సందడిగా మారింది. పార్టీ నేతలు, అభిమానులు నివాసానికి శుభాకాంక్షలు తెలిపేందుకు పోటెత్తారు. రోహిత్ రెడ్డి చేత భారీ కేక్ లు కట్ చేయించారు. నాయకులు అభిమానులు గజమాల, పూలదండ, శాలువాలతో ఘనంగా సన్మానించారు. దీంతో రోహిత్ రెడ్డి ఇంటివద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పండగ వాతావరణం నెలకొంది.

## భద్రాచల పట్టణంలో గ్యాంగ్ వార్ లో యువకుడు మృతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచల పట్టణం లో ఏఎస్ఆర్ కాలనీకి చెందిన సతీష్ వయసు (24) అనే యువకుడుని జగదీష్ కాలనీ యువకులు అతి దారుణంగా హత్య చేశారు. గతంలో రెండు వర్గాల మధ్య పాత కక్షల నేపథ్యం లో గత రాత్రి ఫ్లెక్సీ ఫుడ్ వలన కూలీలను సరఫరా చేసే ముఠా సభ్యుల మధ్య గొడవ జరగడం తర్వాత అంతా సర్దుకుని ఎవరి ఇంటికి వారు వెళ్లడం జరిగింది.గొడవ పడిన వారిలో కొంతమంది తిరిగి కటితి సతీష్ ఇంటికి తెల్లవారు జామున వచ్చి ఇంట్లోనే దారుణంగా కొట్టి కిరాతకంగా కత్తులతో పొడిచి వెళ్లినట్లు అది గమనించిన చుట్టుపక్కల వారు సతీష్ ని హుటాహుటిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే సతీష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.పాత కక్షల నేపథ్యం లో హత్య జరిగినట్లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పట్టణ పోలీసులు.భద్రాచలం టౌన్ సిఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## మహిళ ఎస్సైతో దురుసుగా ప్రవర్తించిన ఏడుగురు అరెస్ట్ రిమాండ్ కు తరలింపు పోలీస్ కమిషనర్

ఖమ్మం .... విధినిరవహణలో వున్న కల్లూరు పోలీస్ స్టేషన్ మహిళ ఎస్సై హరిత తో దురుసుగా ప్రవర్తించిన ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు.తల్లాడ గ్రామానికి చెందిన రాయల రామారావు తో పాటు కొంతమంది యువకులు శుక్రవారం సాయంత్రం మద్యం మత్తులో కల్లూరు పట్టణం ఎన్నెస్పీ క్రాస్ రోడ్డులోని చౌదరి హోటల్ వద్దకు వచ్చి గొడవ చేస్తున్నారని హోటల్ యజమాని అయిన మాగంటి బోసుబాబు కల్లూరు పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదుచేయగా క్రైమ్ నెంబరు 102/2025 u/s 329(4), 296(a), 79, 189 (2) r/w 190 BNS కేసు నమోదు చేసి, అట్టి కేసు విచారణ నిమిత్తం ఘటన ప్రాంతానికి ఎస్సై వెళ్ళిన విషయాన్ని తెలుసుకున్న రాయల రామారావు,తన అనుచరులతో మరల హోటల్ వద్దకు వచ్చి సాక్ష్యులుగా ఉన్న హోటల్ సిబ్బందిని మరియు యజమానిని తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినట్లయితే ఇబ్బందులకు గురి చేస్తానని హోటల్ నడవనివ్వనని హోటల్ ముందు కుర్చీ వేసుకుని కూర్చుని న్యూసెన్స్ చేస్తున్నాడనే సమాచారంతో ఎస్సై తన పోలీస్ సిబ్బందితో హోటల్ వద్దకు వెళ్ళగా ఎస్సై ఎదురుగానే రాయల రామారావు వీరాము తో పాటు అతని అనుచరులు మద్యం మత్తులో గొడవ చేస్తున్నారని, వారిని అక్కడి నుండి పంపించి కేసు విచారణ చేయాలనే ఉద్దేశ్యంతో ఎస్సై గారు వారిని పంపించే ప్రయత్నం చేస్తున్న క్రమంలో రాయల రామారావు ఏ రాము మరియు అతని అనుచరులు డ్యూటీలో ఉన్న మహిళా అధికారి విధులకు ఆటంకపరుస్తూ దౌర్జన్యంగా దాడి చేసి బెదిరింపులకు దిగారని తెలిపారు. ఈ నేపథ్యంలో కల్లూరు ఎస్సై ఫిర్యాదు మేరకు అ.శి.నెం-103/2025 u/s 74, 189, 191 (2), 195, 132, 351(2) 2/2 190 BNS. రావ 7 (1) మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మొత్తం పదిమందిపై కేసు నమోదు కాగా ప్రధాన నిందుతుడు రాయల రామారావు తో పాటు మొత్తం ఏడుగురిని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. గతంలో రాయల రామారావు పై తల్లాడ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయిందని తెలిపారు.

## రాజకీయాలలో విశ్వసనీయత ఎంత ముఖ్యమో పాలనా వ్యవస్థ జవాబుదారీతనం కూడా అంతే అవసరం.

### ప్రజారోగ్య వ్యవస్థను గాడిలో పెట్టడమే కాకుండా, డిజిటల్ ఆరోగ్య సేవలు, ఎన్ఫోర్స్మెంట్ పై దృష్టి సారిస్తాం. లక్ష ప్రాంతాలలో 2 కోట్లకు పైగా భాగస్వాములతో యోగాంధ్ర కార్యక్రమంతో ఆరోగ్యాంధ్ర దిశగా అడుగులు



కూటమి ప్రభుత్వం 1 సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రగతిని నివేదిక రూపంలో వెల్లడించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్, శనివారం విజయవాడ లోని ఓ హోటల్లో మీడియా మిత్రులతో సమావేశం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఈ సంవత్సర కాలంలో వైద్య ఆరోగ్య శాఖ లో చోటు చేసుకుంటున్న మార్పులు మరియు ప్రగతికి కారణమైనటువంటి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి, అధికారులకి, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందికి, నర్సింగ్ సిబ్బందికి అభినందనలు తెలియచేసారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆశలు ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగానే మరియు వారి నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగానే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అంతేకాకుండా ఈ సంవత్సర కాలం పాటు కూటమి ప్రభుత్వం ఎంతో జవాబుదారీతనంతో వ్యవహరించిందన్నారు. అందులో భాగంగానే వైద్య శాఖలో పై అధికారుల నుంచి కిందిస్థాయి వరకు గల సిబ్బంది సహకారంతో తులనాత్మక, గుణాత్మక, సకారాత్మక మార్పులు తీసుకురాగలిగామని , తద్వారా ప్రజలకి అందుతున్న నాణ్యమైన సేవలు మౌలిక సదుపాయాల కల్పన, డయాగ్నస్టిక్ పరికరాల పెంపు, సమయానికి డ్యూటీకి రావడం, పేషంట్ల పట్ల నిబద్ధతగా వ్యవహరించడం వంటి అంశాలే దీనికి ప్రమాణం అన్నారు.

## కావాలనే విషం చిమ్ముతున్నారు కొమ్మినేని, కృష్ణంరాజులను శిక్షించాలి

విజయవాడ సాక్షి డిబేట్ లో రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎనలిస్ట్ వి.వి.ఆర్ కృష్ణంరాజు వ్యాఖ్యలను ఖండిస్తూ ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి మీడియా తో మాట్లాడారు.

ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి మాదాల రాజ్యలక్ష్మీ, తూర్పు నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు నాగమణి, పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు సుఖాని సరిత, తెలుగు మహిళ నాయకురాలు చెరుకూరి మాధవి, వీరవనేని అరుణ, లక్ష్మీ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఉషా రాణి మాట్లాడుతూ అమరావతి రాజధాని కోసం భూమిలిచ్చిన మహిళలను కించపరిచే విధంగా అమరావతి రాజధాని వేశ్యలు అనడం చాలా బాధాకరమని అన్నారు.

అమరావతి మహిళలను జగన్ తో పాటు బ్లూమీడియా రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతు కంట కన్నీరు తెప్పిస్తున్నారు. xబ్లూ మీడియాలో కావాలనే రాజధాని నిర్మాణ పనులు అడ్డుకోవటానికి అమరావతి మీద విషం చిమ్ముతున్నారు. మహిళ కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ, హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత మహిళలను అవమానిస్తూ కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను సుమోట్ స్వీకరించి కేసు నమోదు చేసి చట్ట పరంగా శిక్షించాలని అన్నారు.

తాడేపల్లి ప్యాలెస్ లో వుంటున్న భారతి రెడ్డి రాష్ట్ర మహిళా లోకానికి బహిరంగా క్షమాపణ చెప్పాలి. దేవతల రాజధాని అమరావతి అని చంద్రబాబు అంటే బ్లూ మీడియాలో వేశ్యల రాజధాని అనడమే కాకుండా కులాల మతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా రెచ్చగొడుతున్నారు. జర్నలిస్టులకి మంచి చెడు బాగు తెలుసు..కానీ బ్లూ మీడియాకి నైతిక విలువలు పాటించటం, మహిళలను గౌరవించటం తెలియదని అన్నారు.

## దంపతులకు సర్దిచెప్పేందుకు వెళ్లిన మహిళకు కత్తిపోట్లు పరిస్థితి విషమం

రంగారెడ్డి మైలార్ దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి మధుబన్ కాలనీలో దారుణం జరిగింది. జుబేదా బేగం అనే మహిళను సలీం అనే వ్యక్తి కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఘర్షణ పడుతున్న భార్యాభర్తలకు సర్దిచెప్పేందుకు జుబేదా వెళ్లింది. దాంతో సలీం మాకే నీతులు చెబుతావా అంటూ కోపోద్రిక్తుడయాడు. ఇంట్లో ఉన్న కత్తితో జుబేదా పై దాడి చేసాడు. దాంతో జుబేదా తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసులే ఆర్గనైజ్డ్ క్రైమ్ చేస్తున్నారు: సజ్జల



అమరావతి జూన్ 7 ఆంధ్రప్రదేశ్ లో రెడ్ బుక్ పాలన నడుస్తోందని వైసిపి నేత సజ్జల రామకృష్ణా రెడ్డి తెలిపారు. వ్యవస్థలన్నీ నాశనం చేశారని దుయ్యబట్టారు. ప్రశ్నించే గొంతులను తొక్కేస్తున్నారని, పోలీసులే ఆర్గనైజ్డ్ క్రైమ్ చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ పాలనలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేశామని గుర్తు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి కార్యకర్త లక్ష్మీ నారాయణను సజ్జల, ఆ పార్టీ నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా సజ్జల మీడియాతో మాట్లాడారు.రక్షించేవారే అరాచక శక్తులుగా మారారని, శాతవాహన కాలేజీని కూల్చేశారని, ఎమ్మెల్సీని కిడ్నాప్ చేసినట్టు వార్తలు వచ్చాయన్నారు. సమర్ధులైన అధికారులను వీఆర్లో ఉంచుతున్నారని తెనాలిలో దాడి చేసిన పోలీసులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సజ్జల ప్రశ్నించారు. పొలిటికల్ బాస్లు చెప్పినట్లు పోలీసులు నడుచుకుంటున్నారని దుయ్యబట్టారు. ఎవరైనా పోలీస్ స్టేషన్కు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెడుతున్నారని సజ్జల రామకృష్ణా రెడ్డి విమర్శలు గుప్పించారు.

## తెలంగాణలో తమ తొలి ప్రీమియం కిడ్స్ ఎథ్నిక్ వేర్ బ్రాండ్, స్టోర్ ప్రారంభం



హైదరాబాద్, జూన్ 7, పిల్లల కోసం రాజసంగా, సంప్రదాయంతో కూడిన డిజైన్లను అందించే పి ఓ ఎస్ కో బ్రాండ్, తమ తొలి తెలంగాణ స్టోర్ను హైదరాబాద్,బంజారా హిల్స్లోని జివికె మాల్లో ప్రారంభించింది.పూజా బిహాని కనోరియా (ఎండీఐ గురుగావ్ నుండి మేనేజ్మెంట్ గ్రాడ్యుయేట్) మరియు సలోని గుప్తా బిహాని (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ? నిఫ్ట్ అలుమ్న) కలిసి ప్రారంభించిన ఈ బ్రాండ్ ఇప్పుడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. సలోని గుప్తా హైదరాబాదీ కానీ పెళ్లి తర్వాత కోల్కతాకు మకాం మార్చుకుందిపి ఓ ఎస్ కో బ్రాండ్ను అంబానీలు, పిరమళ్లు, అదానీలు, జీవీకే కుటుంబాలు, బాలీవుడ్ ప్రముఖులు షాహిద్ కపూర్, అనుష్క శర్మ, క్రికెట్ స్టార్స్ జస్ప్రీత్ బుమ్రా, గౌతమ్ గంభీర్, ఉమేష్ యాదవ్ వంటి సెలబ్రిటీ పిల్లలు ధరించారు. ఇంగ్లాండ్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ కుటుంబం కూడా ఈ బ్రాండ్ను మెచ్చుకుంది.ఈ స్టోర్ను రాపిడ్ కార్ప్ అనే మాస్టర్ ఫ్రాంచైజీ ద్వారా తెరిచారు హైదరాబాద్లో ఈ ఫ్రాంచైజీని తల్లి ? కుమార్తె జోడీ అయిన లతా అగర్వాల్ మరియు అక్షిత నహర్ నడుపుతున్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రాన్యుల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి ప్రియాంక చిగురుపాటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ,"పిల్లల డ్రెస్సింగ్లో కట్, ఫిట్, కంఫర్ట్, వ్యక్తిగత స్టైల్ ముఖ్యమైనవి. పి ఓ ఎస్ కో ఈ అంశాలను బాగా అర్థం చేసుకుని అందిస్తోంది. నేను తల్లిని కాబోతున్నాను. ఈ బ్రాండ్ను దగ్గరగా గమనిస్తున్నాను" అని పేర్కొన్నారు.ఫ్రాంచైజీ అక్షిత నహర్ మాట్లాడుతూ,"నేను ఇంటీరియర్ డిజైనింగ్లో ఉన్నప్పటికీ, హైదరాబాద్లో పిల్లల కోసం మంచి ఎథ్నిక్ వేర్ స్టోర్ (పిల్ల ల కోసం సాంప్రదాయ దుస్తులు) లేదు అని గమనించాను. అందుకే ఈ విభాగంలోకి రావాలని నిశ్చయించుకున్నాను," అని చెప్పారు.సంస్థాపకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ"మేము హైదరాబాద్లో నిర్వహించిన ఎగ్జిబిషన్లలో దేశంలోని ఏ నగరంలోనూ లేని స్పందన కనిపించింది. ఇక్కడ మంచి ప్రీమియం కిడ్స్ వేర్ కోసం డిమాండ్ ఉంది. అందుకే మొదటి స్టోర్ను ఇక్కడే ప్రారంభించాలనుకున్నాం," అని తెలిపారు.

## 500 మంది జనాభా 3 కిలోమీటర్ల దూరం ఉంటేనే కొత్త పంచాయితీ.

హైదరాబాద్ కొత్త పంచాయతీల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది గత ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లు పంచాయతీలు ఏర్పాటు చేయడంతో ఎన్నో సమస్యలు వస్తున్నాయని ఆరోపిస్తున్నది.

ఈ మేరకు కొత్త పంచాయతీల ఏర్పాటుకు పక్కా గైడ్లైన్స్ రూపొందించి ముందుకెళ్లాలని నిర్ణయించింది. ప్రధానంగా 500 కంటే తక్కువ జనాభా ఉన్న పల్లెలను పంచాయతీలుగా మార్చడంతో ప్రభుత్వానికి అదనపు భారమే తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆఫీసర్లు చెప్తున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్త పంచాయతీల ఏర్పాటు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి ప్రభుత్వానికి పెద్దసంఖ్యలో ప్రతిపాదనలు వచ్చాయి. కొత్త పంచాయతీల ఏర్పాటు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల టైమ్లో హామీ ఇచ్చినట్లు నేతలు చెప్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై వీళ్లంతా ఒత్తిడి తీసుకొస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పంచాయతీల కోసం 250 వరకు పంచాయతీరాజ్శాఖకు దరఖాస్తులు వచ్చాయి. అప్లికేషన్లతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సు లేఖలు కూడా జతచేసి ఉన్నాయి. దీనిపై పంచాయతీ రాజ్శాఖ అధికారులు క్షేత్రస్థాయి నుంచి వివరాలు తెప్పించారు. చాలా దరఖాస్తులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లేకపోవడంతో పెండింగ్ లో పెట్టినట్లు తెలిసింది.

3 కిలో మీటర్ల దూరం ఉండాలి:

రాష్ట్రంలో ప్రస్తుతం 12,777 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్త పంచాయతీల కోసం సుమారు 250 దరఖాస్తులు రాగా.. అందులో 37 గ్రామాల్లో మాత్రమే 500 జనాభా ఉన్నట్లు తేలింది. మిగిలిన గ్రామాల్లో 500లోపు జనాభా ఉంది. వికారాబాద్ జిల్లాలోని ఓ నియోజకవర్గంలో కేవలం 90 కుటుంబాలు ఉన్న ఓ పల్లెను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని అక్కడి ఎమ్మెల్యే సిఫార్సు లేఖ పంపినట్లు తెలిసింది.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటు చేయాలంటే కనీసం 500 జనాభా ఉండాలని, పల్లెకు, పల్లెకు మధ్య 3 కిలో మీటర్ల దూరం ఉండాలని పంచాయతీరాజ్ చట్టంలో స్పష్టంగా ఉంది. దీంతో ఇలాంటి దరఖాస్తులను పెండింగ్ లో పెట్టారు. త్వరలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కొత్త పంచాయతీల ఏర్పాటు సాధ్యం కాదని పంచాయతీరాజ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## వివాహేతర సంబంధం అనుమానం తో..

### భార్య తల నరికి.. పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లిన లొంగిపోయిన వ్యక్తి

బెంగళూరు జూన్ 7 వివాహేతర సంబంధం ఆరోపణలతో ఒక వ్యక్తి భార్య తల నరికాడు. తెగిన తలను చేతపట్టుకుని బైక్పై పోలీస్ స్టేషన్కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. 28 ఏళ్ల శంకర్, 26 ఏళ్ల మానసకు మూడేళ్ల కిందట ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె ఉన్నది. హీలలిగే ప్రాంతంలోని అద్దె ఇంట్లో నివసిస్తున్నారు.కాగా, జూన్ 3న రాత్రి వేళ శంకర్ పనికి బయలుదేరాడు. మరుసటి రోజు ఉదయం ఇంటికి తిరిగి వస్తానని భార్య మానసకు చెప్పాడు. అయితే పని ముగించుకుని ఊహించని విధంగా అర్ధరాత్రి వేళ ఇంటికి తిరిగి వచ్చాడు. భార్య మానస మరో వ్యక్తితో ఉండటం చూసి ఆగ్రహించాడు. అతడితో వివాహేతర సంబంధంపై గొడవ జరుగడంతో మానస ఇంటి నుంచి వెళ్లిపోయింది.మరోవైపు మానస ఆ తర్వాత పలుమార్లు ఆ ఇంటికి తిరిగి వచ్చింది. భర్త శంకర్ను వేడించింది. జూన్ 5న మళ్లీ ఇంటికి తిరిగి వచ్చింది. ఆ రాత్రి వేళ భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఆగ్రహించిన శంకర్ భార్య మానస తల నరికాడు. తెగిన తలతో బైక్పై పోలీస్ స్టేషన్కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. మానస మృతదేహాన్ని పోస్ట్మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల బంధువుల ఆందోళన

ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రూమ్ వద్ద రోగి బంధువుల ఆందోళన చేశారు. బాత్ రూం లు శుభ్రం చేయకపోవడం, బయోవేస్ట్ క్లీన్ చేయకపోవడం నీరు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. నీరు లేకుండా, పరిసరాలు శుభ్రంగా లేకుండా అప్పుడే పుట్టిన చిన్నారుల నుండి, గర్భిణీ స్త్రీల వరకు కొత్త రోగాలకు గురయ్యే అవకాశం ఉందని వాపోయారు. సొంత డబ్బులతో బయటనుండి నీరు కొనుక్కొవాల్సి వస్తుందని. అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన వినకపోవడంతో సూపరింటెండెంట్ రూం వద్ద ఆందోళన చేయడంతో సంబంధిత అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమైన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు



తిరుపతి, అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 7.30 నుండి 8.00 గంటల మధ్య మిథున లగ్నంలో వైఖానసాగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టం జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది.

అంతకుముందు ఉదయం 5.30 నుండి 6.00 గంటల వరకు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం ద్వారా తన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారు ఒకమారు ముందుగా పర్యవేక్షిస్తారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద విశేషపూజా కార్యక్రమాలు జరిగాయి. అంతకుముందు భేరితాడనం, భేరిపూజ, ధ్వజపటం, నవసంధి, శ్రీవారి మాడ వీధి ఉత్సవం, ఆస్థానం నిర్వహించారు. మిథున లగ్నంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఇందులో వైఖానస శాస్త్రోక్తంగా గరుత్మంతుణ్ణి నూతన వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. ఎన్ని దానాలు చేసినా ధ్వజారోహణకార్యంలో గరుడారోహణం వీక్షించిన భక్తులు పునీతులు అవుతారని పురాణాలు చెబుతున్నాయి. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని లక్ష్యం. సమాజశ్రేయస్సుకు, వంశాభివృద్ధికి ధ్వజారోహణం దోహదపడుతుంది.

టిటిడి పటిష్ట ఏర్పాట్లు:

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున టిటిడి పటిష్ట ఏర్పాట్లు చేపట్టింది. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు భక్తులకు అన్నదానం, ఆకర్షణీయంగా విద్యుత్ అలంకరణలు, పుష్పాలంకరణలు, క్షేత్ర మహిమను తెలిపేలా ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటుచేశారు. ఎస్వీ మ్యూజిక్ కళాశాల, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్వామివారి ఆలయ ప్రాంగణంలో ధార్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని టిటిడి కోరుతోంది.

అనంతరం ఉదయం 9.30 నుండి 11.00 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు, పసుపు, చందనంలతో అభిషేకం చేపట్టారు.

# ఘనంగా డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి ప్రమాణ స్వీకారం పలువురు అభినందనలు సన్మానాలు



బద్వేలు కడప జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్ గా శనివారం మంచూరు సూర్య నారాయణ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు సంబంధిత అధికారులు ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు ప్రమాణ స్వీకారం ఎంతో అట్టహాసంగా జరిగింది కడప జిల్లా వ్యాప్తంగా కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చారు బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ టిడిపి ఇన్చార్జి రితేష్ రెడ్డి ఇంకా పలువురు నాయకులు ఈ కార్యక్రమానికి వచ్చారు డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి బద్వేల్ వాసి కావడంతో ఎంతోమంది తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ కార్యక్రమానికి రావడం జరిగింది ప్రమాణ స్వీకారం అనంతరం సూర్యనారాయణ రెడ్డిని పలువురు అభినందించి సన్మానం చేశారు

# జాబితాపూర్ లో బడిబాట కార్యక్రమం.

## అత్యధిక విద్య అర్హతల ఉపాధ్యాయులచే విద్యాబోధన. విద్యార్థులను చేర్పించి బంగారు బాట వేయండి.




జగిత్యాల, జగిత్యాల రూరల్ మండల పరిధిలోని జాబితాపూర్ గ్రామంలో శనివారం రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జూన్ 6 నుండి 19 నిర్వహించు బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్స్ సహకారం తో ఇంటింటికి తిరిగి,కరపత్రాలు అందజేస్తూ ప్రభుత్వ పాఠశాలలో ఉండే సదుపాయాల తెలియజేశారు. అత్యధిక విద్య అర్హతలు కలిగిన, ఎక్కువ అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే విద్యా భోదన జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు శేష చలపతి తెలిపారు. గ్రామంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎం,అమరేశ్వరి,బి,రాజసాగర్, రాజు,కే,శ్రీనివాస్,బి శ్రీనివాస్, అంగన్వాడి టీచర్స్ ఉమారాణి, స్వరూప, కళావతి,జమున తదితరులు పాల్గొన్నారు.

## హనుమంత వాహనంపై శ్రీ గోవిందరాజస్వామి వైభవం

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శనివారం ఉదయం 7 గంటలకు శ్రీ గోవిందరాజస్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు అభయమిచ్చారు.భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.త్రేతాయుగంలో రామభక్తునిగా ప్రసిద్ధిగాంచినవాడు హనుమంతుడు. రాముడు భక్తాగ్రగణ్యుడైన హనుమకు ఆత్మతత్త్వాన్ని బోధించినట్టు ప్రాచీనవాఙ్మయం నుండి తెలుస్తోంది. బుద్ధి, బలము, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, ఆరోగ్యం, అజాడ్యం, వక్తృత్వం హనుమంతుని స్మరిస్తే లభిస్తాయి. శరణాగతికి ప్రతీకగా స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగుతారు.అనంతరం ఉదయం 10.00 నుండి 11.00 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్ళతో అభిషేకం చేశారు.

## తిరుమల లడ్డు కల్తీ వ్యవహారం ,ధర్మారెడ్డిని అరెస్టు చేయాలి

తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంలో ఎంత పెద్ద వారైనా శిక్షలు అమలు చేయాలంటూ తిరుపతి జనసేన పార్టీ నాయకులు కిరణ్ రాయల్ కోరారు.అన్ని వ్యవస్థలను ధర్మారెడ్డి శాసిస్తూఎక చక్రాధిపత్యం కొనసాగిస్తున్నాడని ఆరోపించారు. తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంలో అధికారులు వెంటనే స్పందించి ధర్మారెడ్డిని అరెస్టు చేయాలంటూ అయన అన్నారు.లడ్డులో ఏమాత్రం నెయ్యి లేకుండా కొన్ని రకాల పదార్థాలతో తయారు చేశారని ఆరోపించారు. తమ నాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధర్మారెడ్డి కుతంత్రాలపై లేఖ రాస్తానని అన్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన మద్దికేర కేజీబీవీ విద్యార్థులు




మద్దికేర: మండల కేంద్రమైన మద్ది తీరంలోని గల కస్తూరిబా పాఠశాలకు సంబంధించి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కస్తూరిబా పాఠశాల ఎస్.ఓ జ్యోతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఓ జ్యోతి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలలో 21 మంది విద్యార్థులు రాయగా 20 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్.ఓ జ్యోతి తెలియజేశారు.అదేవిధంగా ఇంటర్మీడియట్ నందు ఇంప్రూవ్మెంట్ పరీక్షలు రాసిన ముగ్గురు విద్యార్థులకు కూడా మార్కులు పెరిగినట్లు ఎస్.ఓ జ్యోతి తెలియజేశారు.

# ముఖ్యమంత్రి ఆదేశాలను తూచా తప్పకుండా పాటించండి

## గుజ్జు పరిశ్రమలను తెరిపించండి
## తోతాపురిని కొనుగోలు చేయించండి
## మామిడి రైతులకు నష్టం వాటిల్లకుండా చూడండి
## జిల్లా అధికారులకు సూచించిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు
## ఏపీ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేసిన ఎంపీ దగ్గుమళ్ళ



చిత్తూరుమామిడి రైతుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు

జిల్లా యంత్రాంగానికి ఓ ప్రకటనలో సూచించారు.గుజ్జు పరిశ్రమలను తెరిపించి, మామిడి రైతుల నుంచి తోతాపురిని కొనుగోలు చేయించి, వారికి నష్టం వాటిల్లకుండా చూడాలని జిల్లా అధికారులకు తెలియజేశారు. తోతాపురి మామిడి టన్నుకు రూ.. 12 వేల రూపాయలు ప్రకటించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకి ఎంపీ దగ్గుమళ్ళ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

తోతాపురి మామిడికి మద్దతు ధరను 12 వేల రూపాయలగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో.. శనివారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తుందని కొనియాడారు.

ప్రభుత్వ ఆశయాన్ని అధికారులు పసిగట్టి, పక్వానికి వచ్చిన మామిడికాయలను మాత్రమే ప్రాసెసింగ్ కంపెనీలకు పంపించే అంశం పై మామిడి రైతులకు అవగాహన కల్పించడంలో హార్టికల్చర్, అగ్రికల్చర్, అసిస్టెంట్లు, క్షేత్రస్థాయిలో విస్తృతంగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాలోని ఏఏ గుజ్జు పరిశ్రమలు పనిచేస్తున్నాయనే రోజు వారి వివరాలను డిస్ప్లే చేయించాలని.., కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్ కు దిగుమతి అయ్యే మామిడి రవాణాను రాష్ట్ర సరిహద్దుల వద్ద నిఘా ఏర్పాటు చేసి, నియంత్రించాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు.అదే సమయంలో ప్రాసెసింగ్ కంపెనీల వద్ద పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు అంచనా వేసి, మామిడి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తెలియజేశారు.అంతేకాకుండా మామిడి రైతుల నుంచి గుజ్జు పరిశ్రమలు తోతాపురిని కొనుగోలు చేయించడంతోపాటు, ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ సూచించిన గైడ్లైన్స్ ప్రకారం.., మామిడి రైతులకు మద్దతు ధరను ఇప్పించే బాధ్యతను అధికారులు తీసుకోవాలని తెలిపారు. అప్పుడే మామిడి రైతులకు మేలు చేసిన వారి అవుతామని, ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అభిప్రాయపడ్డారు.

# అగ్రవర్ణ కుట్రలకు బలవుతున్న బీసీ పారిశ్రామిక వేత్తలు

## రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అద్యక్షులు ఆర్. కృష్ణయ్య




హైదేవ్రాబాద్ జూన్ 7 ;అగ్రవర్ణ కుట్రలకు బీసీ పారిశ్రామిక వేత్తలు బలవుతున్నారని రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అద్యక్షులు ఆర్. కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేసారు.సమాజంలో బీసీల ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో జరుగుతున్న పురోగతిని సహించలేక కొందరు అగ్రవర్ణ వ్యక్తులు కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. శనివారం ప్రెస్ క్లబ్ లో హైదరాబాద్ బిసి సంక్షేమ సంగం అద్యక్షులు బూపేష్ సాగర్ ఆద్వర్యం లో జరిగిన మీడియా సమావేశం లో మాట్లాడుతూ తాజాగా, బీసీ పారిశ్రామికవేత్తల విజయం ఓర్చలేని విధంగా, కొందరు బీఆర్ఎస్ నేతలు, వారి అనుచరులు ఒక ఏథనాల్ పరిశ్రమపై చట్ట విరుద్ధంగా దాడికి పాల్పడ్డారు. ఇది యావత్ బీసీ వర్గాల అభివృద్ధిపై దాడిగా భావించాల్సి వస్తుందన్నారు.“బీసీలు పరిశ్రమల రంగం లో అభివృద్ధి చెందుతూ, పారిశ్రామిక యజమానులుగా ఎదుగుతున్న సమయంలో, కొంతమంది అగ్రకులాలవారు ఈ మార్పును జీర్ణించుకోలేక కుట్రలకు దిగుతున్నారు. ఇది వెనుకబడిన తరగతుల ఎదుగుదలపై నిర్వహిస్తున్న మానసిక దాడి” అని ఆయన వ్యాఖ్యానించారు.ఈ దాడిలో పాల్పడిన వారిపై చట్టబద్ధంగా చర్యలు తీసుకొని, బాధిత పరిశ్రమలకు న్యాయం జరగాలనీ, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ యంత్రాంగం పటిష్ట నిఘా విధించాలనీ డిమాండ్ చేశారు.దేశ సమగ్రాభివృద్ధికి అడ్డుగా నిలిచే సామాజిక?ఆర్థిక అసమానతలను అధిగమించేందుకు ఈ తరహా చట్టవిరుద్ధ చర్యలకు కఠినంగా ఎదురొద్దామని బీసీ సంక్షేమ సంఘం ఆహ్వానం పలుకుతోంది అని అన్నారు. ఈ సమావేశం లో నీల వెంకటేష్, ర్యాగ రమేష్,అనంతయ్య,సి.రాజందర్,చ్కన్ద్ర చెకర్ గౌడ్,జక్కుల వంశీ, నిమ్మల వీరన్న , రాజ్ కుమార్ ,తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక తవ్వకాలపై అధికారులు స్పందించడంలేదు

పితాపురంకాకినాడ జిల్లా పితాపురం నియోజకవర్గం లో అక్రమ ఇసుక తవ్వకాలపై పితాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ సీరియస్ అయ్యారు. ఉప్పాడ తీర గ్రామాలలో బొండు ఇసుక తవ్వకాలు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని అయన ప్రశ్నించారు.వైసీపీ ముసుగులో ఇంకా వారి పాలనే పితాపురంలో సాగుతోంది. సహజ సంపదను దోచుకుంటున్నారు.కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చేలా అధికారుల వ్యవహార శైలి ఉంది. ఇప్పటికీ బొండు ఇసుక తవ్వకాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం విడ్డూరం. పోలీసులు అక్రమ ఇసుక తవ్వకం దారులతో కుమ్మక్కైనట్లు గా కనిపిస్తోంది. ఇటీవల కూటమి పార్టీలలో చేరిన వైసీపీ నేతలే ఈ తవ్వకాలకు ముఖ్య సూత్రధారులు. ఇటువంటి చర్యల వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు. పితాపురంలో పవన్ కళ్యాణ్ పేరు చెడగొట్టాలని చూస్తున్నారు. అక్రమం మట్టి తవ్వకాలకు పవన్ పూర్తి వ్యతిరేకమని అన్నారు. పవన్ ఆశయాలకు వ్యతిరేకంగా పితాపురంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇసుక తవ్వకాలు ఆపకపోతే ప్రజలే రోడ్డుకే పరిస్థితి ఉందని అన్నారు.

# ఈదుల్ అదా ప్రార్థనలు




**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 7 జూన్ 2025**ఈదుల్ అదా సందర్భముగా మల్కం చెఱువు దగ్గరలో ఉన్న కుతుబ్ షాహీ మసీదులో ప్రార్థనలు చేసిన మణికొండ వాత్సవ్యాలు షేక్ ఆరిఫ్, మొహమ్మద్ రియాజుద్దీన్ పటేల్, , మొహమ్మద్ మునఫ్, మొహమ్మద్ అక్బర్, సాదిక్, సయ్యద్ ఫాజిల్, తక్దీర్, బాషా, ఫజ్లూర్, రహమాన్, ముజాహిద్, ఫజ్లూర్ రహమాన్, ముజాహిద్, ఆజాజ్, ముతివార్, మహబూబ్ తది తరులు.

# వేములవాడ రూరల్ ఎస్సై అంజయ్యకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** శనివారం రోజున వేములవాడ రూరల్ మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై అంజయ్యకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నేతలు పుష్పగుచ్ఛం అందజేసి మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుతూ నూతన ఎస్సై అంజయ్య ఈ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణలో విశేష పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ న్యాయం కల్పించే విధంగా పనిచేయాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో బిసి సెల్ అధ్యక్షులు వంగపల్లి మల్లేశం, మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్, బండ శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీటీసీ బొడ్డు రాములు, బత్తిని ఎల్లా గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ సెక్రెటరీ అనిల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మానుపాటి పరశురాం, సోషల్ మీడియా కోఆర్డినేటర్ చిలుక ప్రభాకర్, శ్రీకాంత్, అశీల శేఖర్, చింతల కోటి రాజు, కొండవేని తిరుపతి, మోతే నాగుల నరసయ్య, బండ రాజమల్లు, వెలిశాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలు పరిష్కరించేందుకే భూభారతి చట్టం

## జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జూన్ 7 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, అందోల్ నియోజకవర్గం లోని చౌటకూర్ మండల పరిధిలో గల పోసానిపల్లి గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సును సందర్శించిన జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, రైతులతో మాట్లాడారు, భూభారతి విశిష్టతను తెలియజేశారు, రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు, భూభారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు, భూభారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం, క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే బృందాలకు, సహకరించాలని కలెక్టర్ సూచించారు, భూభారతి చట్టంలో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని, అందుకు రెవెన్యూ అధికారులు, రైతులకు పూర్తిగా సేవలు అందిస్తారని అన్నారు, ఆర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు,

# జోగిపేటలో తడి చెత్తతో ఎరువుల తయారీపై అవగాహన సదస్సు

## మున్సిపల్ కమిషనర్ తిరుపతి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జూన్ 07 ప్రజాబలం )**సంగారెడ్డి జిల్లా, ఆందోల్ జోగిపేటలో చేపట్టిన, వందరోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా, పట్టణంలోని వార్డులలో ప్రతి ఇంట్లో మిగిలిపోయిన తడి చెత్త తో, ఎరువులు ఎలా తయారు చేసుకోవాలో, అవగాహన కార్యక్రమాన్ని మున్సిపాలిటీ సిబ్బంది, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఆధ్వర్యంలో నిర్వహించారు, ప్రతి ఇంట్లో ఎరువులు తయారు చేసుకోవడం వల్ల, మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని, మరియు పట్టణాన్ని చెత్త రైతంగా తీర్చిదిద్దగలమని, అవగాహన, అంతేకాకుండా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, మంజూరు ధ్రువపత్రాలు అందించి, త్వరలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని, ప్రభుత్వం పూర్తి చేసిన ఇండ్ల లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని తెలిపారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఏ ఈ ఈ శ్రీకాంత్, ఆర్ ఓ శ్రీధర్, శానిటరీ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్, ఆర్ ఐ నారాయణ, మెస్మ టిఎంసి బిక్షపతి, లక్ష్మీనారాయణ, మెస్మ ఆర్పీలు మరియు సిబ్బంది పాల్గొన్నారు....

# అక్రమంగా కోడెలను తరలించిన వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

## వేములవాడలో గోవదశాలలు మూసివేయాలి, హిందూ సంఘాల ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ పట్టణంలో గోవదశాలకు అక్రమంగా కోడెలను తరలించిన విషయంలో చట్ట ప్రకారం కేవలం రెండు కోడెలను మాత్రమే శుక్రవారం రోజున కాపాడుకోవడం జరిగిందని, మిగిలిన నాలుగు కోడెల విషయంలో పూర్తిగా అక్రమ రవాణా జరిగిందని, గోవదశాలకు కోడెలు తెచ్చిన వ్యక్తులపై పూర్తి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పవిత్రమైన వేములవాడ పుణ్యక్షేత్రంలో గోవధశాలలు మూసివేయాలని, వేములవాడ పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడాలని, హిందూ సంఘాల ఆధ్వర్యంలో వేములవాడ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రేగుల సంతోష్ బాబు, గడప కిషోర్ రావు, నాగుల రాము గౌడ్, రేగుల రాజ్ కుమార్, మెరుగు లక్ష్మణ్, మైలారం శ్రీనివాస్, నందగిరి రాహుల్, కోరేపు వెంకటేష్, చిలువేరు పరుశురాం, బండి నరేష్, కిరణ్ హిందూ సంఘాల నాయకులు పాల్గొనడం జరిగింది.


# రాజన్న సేవలో సిద్ధార్థ ఎస్ జె ( డిఓపి )- ప్రియాంక వర్మ భూపతి రాజు దంపతులు.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి నీ శనివారం రోజున నాంది, ఉగ్రం సినిమాల డిఓపి( డైరెక్షన్ ఆఫ్ ఫోటోగ్రఫీ ) సిద్ధార్థ ఎస్ జె - ప్రియాంక వర్మ భూపతి రాజు దంపతులు కుటుంబ సమేతంగా రాజన్నను దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం అనంతరం శివునికి ప్రీతికరమైన కోడెమొక్కులు చెల్లించుకుని , రాజన్న సేవలో తరించారు. అర్చకులు మామిడిపల్లి శరత్ కుమార్ నాగిరెడ్డి మంటపంలో వేదొక్త ఆశీర్వచనం తో పాటు, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి దర్శనం చాలా బాగా జరిగిందని, స్వామివారి కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. మరిన్ని కొత్త ప్రాజెక్ట్స్ తో మీ ముందుకు వస్తున్నట్లు చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం వెంకట్రావు పల్లి గ్రామం తన సొంత గ్రామం అని ఆయన వెల్లడించారు.

# రాజన్న ఆలయ ఉద్యోగులకు డ్రెస్ కోడ్, ఐడీ కార్డు వెంటనే అందించాలి.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** శనివారం రోజున తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బత్తుల మహేందర్ యాదవ్ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సూపర్నెంట్ కు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల మహేందర్ యాదవ్ మాట్లాడుతూ రాజన్న ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు డ్రెస్ కోడ్ మరియు ఐడి కార్డ్స్ వెంటనే అందజేయాలని చెప్పి విన్నవించడం జరిగింది. రాజన్న ఆలయ ఉద్యోగులకు ఈ డ్రెస్ కోడ్ లేకపోవడం వల్ల ఆలయంలో దళారులు కూడా చాలామంది తయారై రాజన్న భక్తులకు అక్రమ మార్గాల ద్వారా దర్శనాలు చేపించుకుంటూ అందిన కాడికి దోచుకుంటున్నారు కనుక రాజన్న ఆలయానికి వచ్చే ఆదాయం గండి పడకుండా ఉండాలంటే రాజన్న ఆలయ ఉద్యోగులందరికీ వెంటనే డ్రెస్ కోడ్, ఐడి కార్డ్స్ అందజేయాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు నియోజకవర్గ అధ్యక్షులు మొగిలి కరుణాకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఈర్లపల్లి హరీష్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు వంశీకృష్ణ, టౌన్ అధ్యక్షులు బండారి గవాస్కర్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహిళలందరినీ బాధిస్తున్నాయి.

విజయవాడ రాజధాని అమరావతి పై జర్నలిస్ట్ కృష్ణంరాజు,సాక్షి ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపై ఏపీ కాంగ్రెస్ సీనియర్ మహిళా నేత సుంకర పద్మశ్రీ మండిపడ్డారు.సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ జగన్ ఠ పేటియం బ్యాచ్ రాజధాని అమరావతి పై ఇంకా విషం చిమ్ముతున్నారు. రాజధానిపై సాక్షి ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాస్ రావు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలి. మీ ఇంట్లో మహిళలు లేరా? సాక్షి పత్రిక నడుపుతోంది కూడా ఓ మహిళేగా. అమరావతి అంటే జగన్ఠ కో కి ద్వేషం. ఎన్నికల్లో డిపాజిట్లు రాకుండా ప్రజలు బుద్ధిచెప్పినా సిగ్గురాలేదని అన్నారు. వాళ్ళు చేసిన వ్యాఖ్యలతో వాళ్ళ ఇంటి మహిళలు సైతం వారిని చీత్కరిస్తున్నారు. మీరు చేసిన వ్యాఖ్యలతో రాష్ట్రవ్యాప్తంగా మహిళలు మిమ్మల్ని అసహ్యించు కుంటున్నారు. బహిరంగంగా మీరు కనిపిస్తే మిమ్మల్ని చీపుర్లు,చెప్పులతో కొట్టేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. వారు చేసిన వ్యాఖ్యలు కేవలం అమరావతి రాజధాని మహిళలను మాత్రమే బాధించడం లేదు...రాష్ట్ర మహిళలు అందరినీ బాధిస్తున్నాయి. ఇప్పటికే మీ నాయకుడు...మీ పార్టీ అమరావతి మహిళల కన్నీటిలో కొట్టుకుపోయింది. ఇపుడు మీరు చేసిన వ్యాఖ్యలతో రాష్ట్ర మహిళలు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. మిమ్మల్ని కన్న తల్లి,కట్టుకున్న భార్య,తోబుట్టువులు సైతం అసహ్యించుకున్నారని అన్నారు.

# జిల్లా సిపిఎం పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరణ.




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం ),** శనివారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం దేశాయిపల్లి గ్రామంలో సిపిఎం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జూన్ 14,15,16 తేదీలలో మూడు రోజులపాటు జరిగే రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరణ చేయడం జరిగింది. రాజకీయ శిక్షణ తరగతుల ముఖ్య ఉద్దేశం రాబోయే రోజులలో ప్రభుత్వం అలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల ను ఎండ కట్టడానికి, పోరాటాలకు వేదికగా జిల్లా నాయకులకు ఈ శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయని భావిస్తూ, ఈ రాజకీయ శిక్షణ తరగతులకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రజానికం, వ్యాపార వర్గాలు, కాంట్రాక్టర్లు మీ వంతు ఆర్థిక సహాయ, సహకారాల అందించాలని జిల్లా సిపిఎం పార్టీ కమిటీ విజ్ఞప్తి చేసింది.

ఈ కార్యక్రమంలో మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురిజాల శ్రీధర్, పార్టీ నాయకులు రామంచా అశోక్, కుడుకల గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## వంద రోజుల యాక్షన్ ప్లాన్ లోభాగంగా తడి పొడి చెత్త నిర్వహణపై లక్షెట్టిపేట మున్సిపాలిటీలో అవగాహన



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జూన్ 07 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో 10 వ వార్డులో వంద రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఆదేశాల మేరకు స్వేచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. శనివారం10 వ వార్డు ప్రజలకు తడి పొడి చెత్త మురుగు కాలువలు,నాలాలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొని 10 వ వార్డులో శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ కందుల రాజేష్,శానిటేషన్ ఇన్స్పెక్టర్,బాల్క నరేష్,దినేష్, వినోద్ కుమార్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి. తిప్పాపూర్ లోని గోశాలలో కోడెల హెల్త్ బుల్లెటెన్ విడుదల చేసిన జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** తిప్పాపూర్ లోని గోశాలలో అనారోగ్యంతో ఉన్న కోడెలలో శనివారం రోజున రెండు కోడెలు మృతి చెందినట్లు,మిగిలిన వాటికి వెటర్నరీ వైద్యులు అందించే చికిత్సకు స్పందిస్తున్నాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు.

గోశాలలో ఉన్న 1300 పశువులలో ప్రస్తుత మొత్తం 14 కోడెలకు వెటర్నరీ డాక్టర్ల వైద్య బృందం చికిత్స అందిస్తున్నట్లు, వైద్యానికి 10 కోడెలు స్పందిస్తూ, అనారోగ్యం నుండి కోలుకుంటున్నట్లు, మరో రెండు కోడెల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు, కొత్తగా ఏవి కూడా అనారోగ్యమునకు గురి కాలేదు అని తెలిపారు. కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి పేర్కొన్నారు.

## వరుణ్ హై స్కూల్ కు ప్రతిభా అవార్డు

బ్రహ్మంగారి మఠం లోని ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కు ప్రతిభా అవార్డు దక్కింది 2025 మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 584/600 లకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా అవార్డులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసినదే బ్రహ్మంగారిమఠంలోని వరుణ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో పదవ తరగతి చదివిన ఎల్ వెంకట చరణ్య కు ప్రతిభ అవార్డు దక్కినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎలిచెర్ల వెంకటరమణారెడ్డి ప్రధానోపాధ్యాయుడు డీ ప్రణయ్ కుమార్ లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా కరెస్పాండెంట్ మాట్లాడుతూ 1993లో ప్రారంభమైన మా పాఠశాల గత 33 సంవత్సరాలుగా బ్రహ్మంగారి మఠం మండలంలో అద్భుత ఫలితాలను సాధించడంతోపాటు క్రమశిక్షణకు నాణ్యమైన చదువుకు మారుపేరుగా వరుణ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ అన్నారు ఇప్పటివరకు మా పాఠశాలలో అనేకమందికి ప్రతిభా అవార్డులు గతంలో వచ్చాయని ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారం లేక వచ్చాక మళ్ళీ ప్రతిభ అవార్డులను ప్రకటించిందని అందులో కూడా మా పాఠశాల విద్యార్థిని శ్రీ వెంకట శరణ్య ఉందన్నారు అంతేకాకుండా మా పాఠశాలలో చదివిన అనేక మంది విద్యార్థినీ విద్యార్థులు దేశ విదేశాలలో సైతం అనేకమంది ఇంజనీర్లుగాను సైంటిస్టులు గాను పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు ఈ ప్రతిభ అవార్డు వచ్చేందుకు కృషిచేసిన మా పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు భవిష్యత్తులో కూడా ఇలాంటి అవార్డులు మరెన్నో సాధించాలని ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ఆశీర్వదించారు

## పద్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన త్రిపుర గవర్నర్

మేడ్చల్ దివంగత బీజేపీ నేత పద్మారెడ్డి కుటుంబ సభ్యులను త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డినాచారం లోని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తరువాత అయన మాట్లాడుతూ పద్మా రెడ్డి భారతీయ జనతా పార్టీకి పాత కార్యకర్త, నేను పార్లమెంటు ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో పోటీ చేసిన సందర్భంలో కన్వీనర్ గా ఉండి పార్టీ కోసం పనిచేసిన గొప్ప నాయకుడు, నాకు చాలా ఆప్తుడు.పద్మా రెడ్డి హఠాన్మరణం కుటుంబ సభ్యులకు తీరని లోటు అని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప్పల్ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, స్థానిక బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా యోగా దినోత్సవం

విశాఖపట్నం జూన్ 21న ప్రపంచ యోగా దినోత్స వాన్ని విశాఖలో ఘనంగా నిర్వహి స్తున్నామని విశాఖ ఎంపీ భరత్ తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. విశాఖపట్నంలో జరిగే యోగా కార్య క్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమో దీ హాజరవుతున్నారని చెప్పారు. విశాఖలో నిర్వహించే యోగాకు ప్రపంచ రికార్డ్ కోసం సన్నాహాలు చేస్తున్నామని అన్నారు.కేంద్ర ప్రభు త్వం సౌత్ కోస్ట్ రైల్వేజోన్కి జీఎంని నియమించిందని విశాఖపట్నం ఎంపీ భరత్ వెల్లడించారు. విశాఖ రైల్వేస్టేషన్ అప్గ్రేడేషన్ జరుగుతుం దని.. సుమారుగా 500 కోట్లు కేటాయించిందని స్పష్టం చేశారు. రైల్వే జోన్ పనులు వేగవంతంగా చేస్తున్నామని అన్నారు.ఆంధ్ర యూని వర్సిటీలో మార్పులు చేస్తున్నామని తెలిపారు. కచ్చితంగా మార్పులు ఉంటాయని వివరించారు. స్టీల్ ప్లాంట్, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించింది వాస్తవమేనని.. అవసరమైన మేరకు కార్మికులను విధుల్లో ఉంచి మిగతా వారిని తొలగిస్తున్నారని వెల్లడించారు విశాఖపట్నం ఎంపీ భరత్.

# కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రూ.31 కోట్లతో ఉపాధి నిధులతో రోడ్ల నిర్మాణం

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**
**కరీంనగర్ సీఆర్ఐఎఫ్ నిధులతో 1314 కి.మీల పరిధిలో రోడ్లను విస్తరించాం**
**పీఎంజీఎస్ వై కింద మారుమూల గ్రామాల్లో రోడ్లను నిర్మించాం.**
**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి**
**కొత్తపల్లిలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన రోడ్డును ప్రారంభించిన కేంద్ర మంత్రి.**
**ఆసిఫ్ నగర్ లో ఎంపీ లాడ్స్ నిధులతో కూరగాయల మార్కెట్ షెడ్ కు శంకుస్థాపన**



కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. అందులో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.31 కోట్ల 12 లక్షల రూపాయలతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో అంతర్గత రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. కరీంనగర్ నియోజకవర్గం కొత్తపల్లి మండలంలోని ఖాజీపూర్ లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 14 లక్షల రూపాయలతో చేపట్టిన రోడ్డును బండి సంజయ్ ప్రారంభించారు. అనంతరం కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్ నగర్ లో 9 లక్షల 50 రూపాయల ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మించనున్న మార్కెట్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మొత్తం పెద్ద ఎత్తున పనులు కొనసాగుతున్నాయి. ప్రధానంగా రోడ్లను నిర్మిస్తున్నాం. ఈసారి ఈ పథకం కింద దాదాపు 31 కోట్ల 12 లక్షల రూపాయల పనులు జరుగుతున్నాయి. ఈ కొత్తపల్లి మండలంలో రోడ్ల నిర్మాణం కోసం ఈ ఏడాది 74 లక్షల రూపాయలను విడుదల చేశారు. అందులో భాగంగా ఖాజీపూర్ లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 14 లక్షల రూపాయలతో చేపట్టిన రోడ్డును ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. అని పేర్కొన్నారు.

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కేంద్ర రహదారుల మౌలిక సదుపాయాల నిధి సిఆర్ ఐ ఎఫ్, కింద రూ. 291 కోట్లను ఖర్చు చేసి 1341 కిలోమీటర్ల మేరకు రోడ్లను నిర్మించామన్నారు. తెలంగాణలోనే అత్యధికంగా సిఆర్ ఐఎఫ్, నిధులను తీసుకొచ్చి కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రోడ్లను నిర్మించగలగడం సంతోషంగా ఉందన్నారు. ఇవిగాకుండా ప్రధానమంత్రి సడక్ యోజన కింద వందల కోట్లను ఖర్చు చేసి మారుమూల గ్రామాల్లో రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ విషయానికొస్తే.. జాతీయ రహదారుల నిర్మాణం కోసం దాదాపు 5 వేల కోట్లు ఖర్చు చేసినం కరీంనగర్ నుండి వరంగల్, సిద్దిపేట నుండి ఎల్కతుర్తి నేషనల్ హైవేల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అతి త్వరలోనే కరీంనగర్- జగిత్యాల రోడ్డ నిర్మాణ పనులను ప్రారంభించబోతున్నం అని పేర్కొన్నారు.

ప్రయాణీకులకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నేషనల్ హైవే నిధులతో రాజీవ్ రహదారిని విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్దంగా ఉందని చెప్పారు. అయితే ప్రస్తుతం స్టేట్ హైవేగా ఉన్న ఈరోడ్డు మెయింటెనెన్స్ కు సంబంధించి కాంట్రాక్ట్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. సదరు కాంట్రాక్టర్ తో మాట్లాడుకుని సమస్యను సెటిల్ చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే వెంటనే రాజీవ్ రహదారిని విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ

**మండలానికి 1605 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల మంజూరు.**
**వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసిన టిడిపి నాయకులు,అధికారులు.**



తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలి లో శనివారం రోజున ప్రభుత్వ రాయితీతో కూడిన వేరుశనగ విత్తనాలను టిడిపి నాయకులు, అధికారులు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ మండలానికి 1605 క్వింటల్ వేరుశనగ, 30 క్వింటాల్ కందులు,11 క్వింటాల్ మినుములు,5 క్వింటాల్ కొర్రలు మరియు 1 క్వింటాల్ పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు తుగ్గలి మండలానికి మంజూరు అయ్యాయని ఆయన తెలియజేశారు.వేరుశనగ క్వింటం మొత్తం ధర 9300,సబ్సిడీ ధర 3720 రూపాయలు,రైతులు చెలించాల్సిన ధర 5580 రూపాయలయని,గరిష్టంగా 90కేజీలు విత్తనం అందజేస్తామని ఏవో తెలియజేశారు. వేరుశనగ విత్తన సాగులో రైతుల తప్పకుండా నితిన్ శుద్ధి చేసుకోవాలని ఆయన రైతులకు తెలియజేశారు.అనంతరం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర,సర్పంచ్ రవి, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, మనోహర్ చౌదరి,వ్యవసాధికారి పవన్ కుమార్ లు రైతులకు వేరుశనగ విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్,తిమ్మయ్య చౌదరి,టిడిపి నాయకులు బాలన్న, విద్యా కమిటీ చైర్మన్ మిద్దె రవి,లక్ష్మీనారాయణ, తిమ్మప్ప,మాజీ వైస్ ఎంపీటీసీ వెంకటేష్,వ్యవసాయ విస్తరణ అధికారులు,లోహిత్,స్రవంతి,రైతులు మరియు టీడీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారయత్నం

ఖమ్మం చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న 11 ఏళ్ల మైనర్ బాలికపై ఓ యువకుడు అత్యాచార యత్న నికి పాల్పడ్డాడు నిందితుడు ఖమ్మం పట్టణం కొత్తగూడెం గ్రామానికి చెందిన ఎస్.కె ఇర్ఫాన్ (24) అనే యువకుడు గా గుర్తించారు. చింతకాని మండలం కోదుమూరు గ్రామంలో షేక్ ఇర్ఫాన్ అనే యువకుడు ముస్లింలకు మత ప్రచారం కోసం వచ్చి ఇంట్లో ఒంటరిగా వున్న మైనర్ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడని స్థానికులు తెలిపారు. మైనర్ బాలిక కేకలు వేయడంతో పక్కనే ఉన్న స్థానికులు గమనించి యువకుడి నీ పట్టుకొని తాళ్లతో చేతులను కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు చింతకాని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు

## రాయితీ విత్తనాలను పంపిణీ చేసిన మంత్రి కొండపల్లి

విజయనగరం గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవర ణలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రాయితీ పై విత్తనాలు పంపిణీ చేశా రు.అనంతరం 80 శాతం రాయితీ తో ఎగ్రికల్చర్ డ్రోన్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటు వ్యవసాయ లాభసాటిగా చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపా రు. రైతులకు యంత్ర పరికరాలు, విత్తనాలు ఎరువులు రాయితీ పై అందజేస్తామని తెలిపారు. అనం తరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయు డు మాట్లాడుతూ నేరుగా రైతులు వద్దకే ఎరువులు విత్తనాలు అందిం చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కె ట్ కమిటీ చైర్మన్ పి.వి వి గోపాల రాజు, వ్యవసాయ శాఖ జెడి వీటి రామారావు, మాజీ ఎంపీపీ గంట్యా డ శ్రీదేవి, కొండపల్లి భాస్కర్ నాయు డు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం కించపరిచింది

### ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి వారిని నిండా ముంచింది

### వెంటనే ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలు చెల్లించాలి

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



జగిత్యాల : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం కించపరిచిందని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. శనివారం జగిత్యాలలో ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వారిని విస్మరించిందన్నారు. ఉద్యోగుల కు పెండింగ్ లో ఉన్న డీఏలు విడుదల చేస్తామని చెప్పి కేవలం ఒక్క డీఏ విదిల్చారని.. ప్రభుత్వం తీరుపై ఉద్యోగులంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, బాధపడుతున్నారని అన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే నెరవేర్చాలని, పెండింగ్ డీఏలన్నీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 500 రూపాయల నోట్లను ప్రభుత్వం ఉపసంహరించుకోవటం లేదు

న్యూ డిల్లీ జూన్ 7 ప్రభుత్వం 500 రూపాయల నోట్లను ఉపసంహరించుకోవటం లేదు. అవి చలామణీలోనే ఉంటాయి. ఈ నోట్లు దేశవ్యాప్తంగా చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి. వాటి జారీ, స్వీకరణ యథావిధిగా కొనసాగుతుంది' అని ది ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో స్పష్టం చేసింది. ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించింది. రూ.2వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు 19 మే 2023న ఆర్‌బీఐ ప్రకటించింది. అయితే, త్వరలో దేశంలో రూ.500 నోట్లను కూడా ప్రభుత్వం రద్దు (చేయనుందంటూ ఓ వార్త తెగ వైరల్ అవుతోంది. 2026 మార్చి నాటికి రూ.500 నోట్లను ఆర్‌బీఐ చెలామణి నుంచి ఉపసంహరించుకుంటుందంటూ విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.'కాపిటల్ టీవీ' అనే యూట్యూబ్ ఛానల్ దీనిపై వీడియో సైతం రిలీజ్ చేసింది. 2026 మార్చి నాటికి రూ.500 నోట్లు చాలామణీలో లేకుండా పోతాయని పేర్కొంది. 12 నిమిషాల నిడివిగల ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. ఈ ప్రచారంపై ప్రభుత్వానికి చెందిన పీఐబీ ఫ్యాక్ట్ చెక్ తాజాగా స్పందించింది. 'కేంద్ర ప్రభుత్వం ఇటీవలే రూ.2 వేల నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే.

## దగ్గు జ్వరం సిరప్ తాగి చిన్నారి మృతి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జూన్ 07 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం పరిదిలోగల అల్లాదుర్గం మండల కేంద్రంలో, బుడగ జంగాల కాలనీలో విషాదం, జ్వరం దగ్గు సిరప్ తాగి చిన్నారి ప్రియ (05)మృతి మరో ఆరేళ్ల చిన్నారి ఐశ్వర్య,అస్వస్థత, జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స, జ్వరం దగ్గు సిరప్ తాగిన మరో ముగ్గురు,చిన్నారులు, రేణుక, (09) శీను(08) గణేష్(03) నిలకడగా ఆరోగ్యం, దంపతులు సాయమ్మ, వైఫ్ ఆఫ్, సిద్దయ్య, లకు ఐదుగురు సంతానం, చిన్నారి ప్రియ మృతికి, సిరప్ అధిక దోస్ కారణమా, ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా, అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్న సంబంధిత అధికారులు....

# బంగారు పతకాలు సాధించిన శివాని ,చందనలు



రాయచోటి జవహర్ నవోదయ విద్యాలయ వలసపల్లి అన్నమయ్య జిల్లాలో 12వ తరగతి చదువుతున్న దివ్యాంగురాళ్లయిన శివాని మరియు చందనలు సాధించిన బంగారు పథకాలు భవిష్యత్తు తరాలకు ఆశా కిరణాలని మరియు అన్నమయ్య జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శనివారం రాయచోటి కలెక్టరేట్లోని తన చాంబర్లో అంతర్జాతీయ మరియు జాతీయస్థాయిలలో బంగారు పథకాలను సాధించిన శివాని మరియు చందన లను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రత్యేకంగా అభినందించారు. జవహర్ నవోదయ విద్యాలయ, వలసపల్లి అన్నమయ్య జిల్లాలో 12వ తరగతి చదువుతున్న దివ్యాంగురాలైన శివాని జాతీయ మరియు అంతర్జాతీయ ప్యారాస్పోర్ట్స్ థాయిలాండ్ లో జరిగిన షార్ట్ పుట్ మరియు జావలిన్ త్రో పోటీలలో లలో 07 గోల్డ్ మెడల్స్ మరియు 01 సిల్వర్ మెడల్ ను సాధించారు. అదే పాఠశాలలో 12వ తరగతి చదువుతున్న దివ్యాంగురాలైన కే. చందన, జాతీయ స్థాయిలో బంగారు పథకాన్ని సాధించి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ గీత మాట్లాడుతూ నవోదయ విద్యాలయ సమితి మరియు ఆదిత్య మెహతా ఫౌండేషన్ సంయుక్తంగా పేరా స్పోర్ట్స్ నందు శిక్షణ ఇచ్చారని పేర్కొన్నారు. మీరు ఈ పథకాలు సాధించి ఎంతోమంది యువతకు స్ఫూర్తినిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ దివ్యాంగురాళ్లయిన శివాని మరియు చందనలు సాధించిన బంగారు మరియు వెండి పథకాలు సాధించడం ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులకు ఆదర్శమని వీరు సాధించిన విజయాలు భవిష్యత్తు తరాలకు ఆశా కిరణాలుగా నిలుస్తాయని కొనియాడారు.

# మండలంలో ప్రశాంతంగా ముగిసిన బక్రీద్ వేడుకలు

### త్యాగానికి ప్రతిఫలం బక్రీద్ పండుగ

### ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు

కౌతాళం మండలం లో ముస్లిం సోదరులు శనివారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాలలో మసీదులలో. ఈద్గా లలో ఈమమ్ లు మోలి సబ్ లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ప్రవక్త గురించి ఇమామ్ సద్దాం హుస్సేన్ త్యాగాల పండుగ బక్రీద్ ..బక్రీద్' పండుగ అసలు పేరు– ' ఈదుల్ – అద్ హా' అంటే ? "త్యాగాల ప్రతిఫలం పండుగని పేర్కొన్నారు.ప్రతీ వ్యక్తి ప్రవృత్తిలో "దాన గుణాన్ని" "త్యాగనిరతిని" పెంపొందించటానికి "త్యాగాల పండుగ అని నిర్దేశించటం జరిగిందన్నారు. త్యాగాల పండుగ సంక్షిప్తంగా ప్రవక్త ఇబ్రాహీం (అలై) దైవ మార్గంలో చేసిన ఖుర్బానీ గుర్తు గా దైవ మార్గంలో ఒక గొర్రెనో, మేకనో, లేక ఒంటెనో ఖుర్బానీ ఇవ్వాల్సిందిగా నిర్దేశించటం జరిగింది. దానికి కారణం ఆ ఖుర్బానీ ఇవ్వగా వచ్చిన మాంసంలో మూడు భాగాలు చేసి ఒక భాగం బీదలకు పంచాలి తద్వారా ఎందరో ఆకలితో అలమటించే బీదలకు రుచికరమైన ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుంది. మరొక భాగం బంధువులు దగ్గరవారు ఇరుగుపొరుగు వారికి దానం చేసి మిగిలిన ఒక భాగం స్వయంగా తినటం కోసం అన్న ఉద్దేశంతో మాత్రమే!అసలు ఖుర్బానీ ఇవ్వాల్సినవి ఏమిటి?ధర్మంలో ప్రార్థన, ఉపవాసం, కుర్బని ఇవ్వటం ఏదో పుణ్యం కోసం యాంత్రికంగా చేసుకుపోవటానికి నిర్ధేశించినవి కావు. కానీ, వాటి నిర్వర్తించటం ద్వారా ఉన్నత విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని నిర్మించి.. మంచిపనులు చేసే ప్రవృత్తిని జనింపజేయటమే!

అమితంగా ప్రేమించే ధనాన్ని త్యాగం చెయ్యగలగాలి. ప్రేమించే వస్తువులను త్యాగం చెయ్యగలగాలి.ఇష్టపడే ఆహార పదార్థాలను త్యాగం చెయ్యగలగాలి.ఈ విధంగా మనిషి అమితంగా ప్రేమించే పై వాటిని త్యాగం చెయ్యటంతో పాటు మనిషి.. ఇతరుల పట్ల ఉండే ఈర్ష్యా–ద్వేషాలను ఖుర్బానీ ఇవ్వాలి.వదులుకోలేని బలహీనతలను ఖుర్బానీ ఇవ్వాలి..చెడు కోరికలను, చెడు ఆలోచనలను ఖుర్బని ఇవ్వాలని కోరారు. త్యాగనిరతిని వ్యక్తిత్వంలో కలిగి ఉన్నప్పుడే ఖుర్బానీ ఇవ్వటమనే.ప్రక్రియకు,సార్థకత,చేకూరుతుందని దైవమార్గంలో ఇచ్చే (ఖుర్బానీ) అసలు ఉద్దేశాన్ని అర్థం చేసుకుని బక్రీద్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని.కోరారు.అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# రైతే పెద్ద శాస్త్రవేత్త

**హుస్నాబాద్ రైతు మహోత్సవం రెండవ రోజు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా**

**రాష్ట్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి హాజరయ్యారు**

**ఈ సందర్భంగా ఆయన అన్ని స్టాల్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు**

**ఈ సందర్భంగా కోదండరెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ.**

**రైతే పెద్ద శాస్త్రవేత్త**

**రైతు బిడ్డా సీఎం రేవంత్ రెడ్డి**

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ఐనప్పటి నుండి రైతులకోసం ఆలోచన చేస్తున్నాడు.ధరణి తో లక్షలాది మంది రైతులు ఇబ్బంది పడ్డారురేవంత్ రెడ్డి అధికారంలోకి వస్తే ధరణి ప్లేస్ లో భూ భారతి తెస్తామన్నారు మాట ప్రకారం చేశారు.నకిలీ సీడ్ వల్లనే రైతులు నష్టపోతున్నారు.మల్టీనేషనల్ కంపెనీల వల్ల రైతులు అగమౌతున్నారు.అందుకు రైతుకు మిత్తన హక్కును కల్పించే దిశగా విత్తన చట్టం తీసుకురాబోతున్నారు.

ములుగులో కొన్ని మల్టీనేషనల్ కంపెనీలు మొక్క జొన్న విత్తనోత్పత్తి చేసి రైతులను ఆగం చేసింద్రు,ములుగు ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది.త్వరలో విత్తన చట్టం తీసుకురావాలని నిర్ణయం తీసుకొని కమిటీ వేశారు.ఆవిత్తన కమిటీ జిల్లాల పర్యటన చేసి రైతుల నుండి అభిప్రాయాలు సేకరిస్తుంది.ఇప్పటికే మహబూబ్ నగర్, నిజామాబాద్ లో రైతు పండుగలను చేసుకున్నాం.ఇప్పుడు హుస్నాబాద్ లో రైతు మహోత్సవం జరుగుపుకుంటున్నాం.రైతుకు సెలవు ఉండదు, పండుగైన పబ్బమైన సాగు లోనే ఉంటాడు.పసుపు పంటలో రైతులు చాలా ఇబ్బంది పడ్తున్నారు.కానీ పసుపు వల్ల కరోనా నుండి చాలామంది బయటపడ్డారు.అది నేను చెప్పడం లేదు ప్రధాని మోడీ చెప్పారు.సాంప్రదాయ పంటలు సాగుచేయాలి.విత్తనం వల్ల రైతులు ఒంటరయ్యాడు.ఉపాధి హామీ పథకం వల్ల గ్రామాల్లో కూలీలా కొరత ఏర్పడింది.ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలనీ కోరాం.పసుపు రైతు యాంత్రీకరణ వైపు రావాలి.పసుపు పీకడానికి, ఉడకబెట్టడానికి, పాలిష్ చేయడానికి శ్రమపడ్తున్నారు.

యాంత్రీకరణ అవసరం..

ఆ దిశగా రైతులు ఆలోచన చేసి ముందుకు సాగాలి.వ్యవసాయంలో ఇబ్బందులు దూరం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారు.ఆనాడు వైఎస్ రుణమాఫీ చేస్తే, ఈనాడు రేవంత్ రెడ్డి రుణమాఫీ చేసి చరిత్రలో నిలిచారు.

రైతు భరోసా కూడా వేస్తున్నారు. ఐతే గుట్టకు రోడ్లకు కాదు సాగు చేసే భూమికి చేశారు.వడ్లకు 500 రూపాయల బోనస్ వల్ల చాలా మంది రైతులు లాభపడ్డారు.రైతు కమిషన్ వచ్చి 6నెలలు అయ్యింది చాలా పనులు చేశాం.ఆదర్శ రైతు వ్యవస్థను తీసుకురావాలని చెప్పాము.రైతుకు కులం మతం లేదు, రైతు అందరి వాడు.త్వరలో ఆదర్శ రైతు ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది.తెలంగాణ చెరువుల రాష్ట్రం గొలుసుకట్టు చెరువుల నిలయం.మేజర్ నుండి మైనర్ ఇరిగేషన్ ను విడదీసి చెరువుల బాధ్యత రైతులకు ఇవ్వాలని చెప్పాము.అదికూడా త్వరలో అమలవుతుంది.ఎక్కడెక్కడ ఎలాంటి పంటలు పండుతాయో, అక్కడ ఆయా మార్కెట్లు ఉండాలని రైతు కమిషన్ సూచించింది.రైతులు ఐక్యంగా ఉండాలి.పూర్వం కుటుంబాలు ఎలావున్నాయో రైతులు కూడా అలా కలిసి పనిచేయండి.

కేంద్రం వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు.ఇందిరా గాంధీ హయాంలో బ్యాంకుల జాతీయకరణ చేశారు.దాని ద్వారా రైతులకు బ్యాంకులు అందువాటులోకి వచ్చాయి.భూ పరీక్షా చేసుకొని అనుకూలమైన పంట వేయాలి.గత ప్రభుత్వంలో భూ సారపరీక్షలు చేయకుండా 16 కోట్లు పక్కన పెట్టింది.సీఎం రైతులకోసమే ఎక్కువ ఆలోచన చేస్తున్నారు.రైతులు కోతులతో ఇబ్బంది పడ్తున్నారు.. సోలార్ ఫెన్సింగ్ చేసుకోవాలని నాబార్డు మీటింగ్ లో నిర్ణయం తీసుకున్నాం.దానికి నాబార్డు సపోర్ట్ చేయడానికి ముందుకొస్తుంది అందరు రైతుకు అండగా నిలబడాలి.అన్వేష్ రెడ్డి సీడ్ కార్పొరేషన్ చైర్మన్ రైతులకు ఉపయోగపడేలా ఇక్కడ రైతు మహోత్సవం జరుగుతోంది.రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

యంత్రపరికరాలపై అవగాహన కల్పించుకోవాలి.

రైతే పెద్ద శాస్త్రవేత్త:

కానీ నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారు

రైతులు మళ్లీ స్వతహాగా విత్తనం తయారుచేసుకోవాలి.

అధిక దిగుబడులకోసం చేస్తున్న ప్రయోగాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

రసాయనాలు తగ్గించాలి,

పెస్టిసైడ్ వాడకుండా కూడా చాలామంది రైతులు అధిక దిగుబడి తెస్తున్నారు

మంచి విత్తనాలు రైతులకు అందాలి

సీడ్ కార్పొరేషన్ ద్వారా రైతులకు మేలైన విత్తనాలు అందిస్తున్నాం.

సీడ్ కార్పొరేషన్ ఇచ్చే విత్తనాలను నమ్ముకోండి

ప్రైవేట్ కంపెనీల ప్రచారాలకు మోసపోకండి

సీడ్ కార్పొరేషన్, యూనివర్సిటీ ద్వారా వచ్చే విత్తనాలు ఈ స్టాల్స్ లో ఉంచాం

దేశంలో ఎక్కడ లేని విదంగా తెలంగాణాలో రుణమాఫీ చేశాంధాన్యం కొనుగోలు కూడా రికార్డు స్థాయిలో చేశాం

రాష్ట్రంలో వరిసాగు పెరిగింది, ఐనా ప్రతిగింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది

తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేసింది.

నేను ఒక రైతుగా చెబుతున్నా పంట మార్పిడి చేసి దిగుబడి సాధిద్దాం.

గరిమా అగర్వాల్, అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.

భారత్ వ్యవసాయ దేశం

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు తీసుకురావడానికే ఈ రైతు మహోత్సవం

శుక్రవారం శనివారం పదివేల మంది రైతులు హాజరయ్యారు

150 స్టాల్స్ ఏర్పాటు చేశారు

వ్యవసాయ, వ్యవసాయన పరికరాల స్టాల్స్ వున్నాయి.ఫామ్ మెకనైజషన్ కు సంబంధించి యంత్రపరికరాలు కూడా స్టాల్స్ లో వున్నాయి

బ్యాంకుల స్టాల్స్ కూడా వున్నాయి. ఎవరైనా ఈఎంఐ, కింద రుణాలు పొంది యంత్రాలు తీసుకోవచ్చు

రైతులకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు జరుగుతున్నాయి.

రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు

సిద్ధిపేట జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమను కూడా త్వరలో ప్రారంభించు కోనున్నాం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ భవాని, కెవిఎన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ ఆర్డిఓ రామ్మూర్తి, ఏఎంసి చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, పశు సంవర్తక తదితర శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష రూపాయలు చెల్లిస్తేనే ఇందిరమ్మ ఇండ్లు?

హన్మకొండ లక్ష రూపాయలు ఎవరు ఇస్తే వారికే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేపిస్తున్న కాంగ్రెస్ నాయకులు,హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన బండారు అనిత అనే మహిళ తన భర్తతో ఇద్దరూ కూలి పని చేసుకుంటూ నలుగురు పిల్లల్ని పోషిస్తున్నారు.ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకుంటే రూ.1 లక్ష ఇస్తేనే ఇల్లు మంజూరు అవుతుందని కాంగ్రెస్ కార్యకర్తలు డిమాండ్ చేశారని వాపోతున్న మహిళ,దీంతో చేసేదేమీ లేక రూ.50 వేలు అప్పు చేసి మరీ చెల్లించానని ఆవేదన వ్యక్తం చేసిన మహిళ ఇల్లు కట్టుకునే స్థోమత లేకనే ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకుంటే, కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవ్వడానికి కూడా ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు.

## జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలోని ప్లాస్టిక్ స్క్రాప్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం ...

జగిత్యాల జిల్లా // అర్బన్ మండలం ధరూర్ గ్రామంలోని ప్లాస్టిక్ స్క్రాప్ దుకాణంలో ప్రమాదం కారణంగా భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. స్క్రాప్ దుకాణం సమీపంలోనే పెట్రోల్ బంక్ తో గృహ సముదాయాలు ఉండటంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీగా ఎగిసిపడుతున్న మండల కారణంగా ధరూర్ గ్రామంలో దట్టమైన నల్లటి పొగ అలుముకుంది. అయితే సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో ఓ వృద్ధురాలికి దహన సంస్కారాలు నిర్వహించగా అక్కడి నుంచి గాలికి వచ్చిన నిప్పు రవ్వల కారణంగానే ఈ ప్రమాదం చోటుచేసుకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## హైదరాబాద్లో పూజా సారీస్ కొచర్ షోరూమ్ ప్రారంభం

హైదరాబాద్ సెలెబ్రెటీ ఫ్యాషన్ డిజైనర్, పూజా సారీస్ మేనేజింగ్ డైరెక్టర్ రామ్ అగర్వాల్ తాజాగా పూజా సారీస్ కొచర్ ప్రీమియం స్టోర్ ను బంజారాహిల్స్ లో ఏర్పాటు చేశారు. ఈ షోరూం ను ఃఔఎ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా, పూజా శారీస్ వ్యవ స్థాపకురాలు అర్చనా అగర్వాల్ తో కలిసి ప్రారంభించారు. ఫ్యాషన్ డిజైనర్ రామ్ అగర్వాల్ మాట్లాడుతూ బాలీవుడ్, టాలీవుడ్కు చెందిన పలువురు సెలెబ్రిటీలకు స్టైలింగ్ చేశాం. తమ కలెక్షన్స్ జాతీయ, అంతర్జాతీయ ఫ్యాషన్ షో వేదికల్లో ప్రదర్శించామన్నారు. సారీస్, సూట్స్, ఇండో–వెస్ట్రన్, లెహంగాలు వంటి విభిన్న కేటగిరీల్లో, లగ్జరీ , ప్రెట్ సెగ్మెంట్లలో మనోహరమైన డిజైనర్ ఔట్ఫిట్స్ను అందించడం తమ ప్రత్యేకత అని వివరించారు. వ్యవస్థాపకురాలు అర్చనా అగర్వాల్ మాట్లాడుతూ, భారతదేశం నలుమూలల నుంచి ప్రత్యేకమైన కలెక్షన్స్ కు వేదికగా ఈ పూజా శారీస్ కోచర్ ను ఏర్పాటు చేశామన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com